www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 273 | సోమవారం 26-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ఇక ముఖమే ఆధార్



జూలై 1 నుంచి అమలుకు యూఐడీఏఐ ఏర్పాట్లు

న్యూఢిల్లీ : ఆధార్‌కు మరొక కొత్త సాంకేతిక అంశాన్ని జోడించేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికర సంస్థ(యూఐడీఏఐ) సన్నాహాలు చేస్తోంది. 2018, జూలై 1వ తేదీ నుంచి ఆధార్ వినియోగదారుల ధ్రువీకరణకు సంబంధించి ఐరిస్, వేలి ముద్రలతోపాటు ముఖ ప్రామాణీకరణ సాంకేతిక సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నది. వృద్ధాప్యం, అరిగిన వేలి ముద్రల కారణంగా గుర్తింపులో ప్రామాణీకరణ సమస్యలు తలెత్తుతున్న వారికి సహాయంగా ముఖ ప్రామాణీకరణను ప్రవేశపెట్టనున్నట్లు 12 అంకెల గుర్తింపు ఆధార్‌కు ప్రాధికార సంస్థగా ఉన్న యూఐడీఏఐ జనవరిలో ప్రకటించింది. ప్రత్యేక స్థితిలో మాత్రమే ముఖ ప్రామాణీకరణ అనుమతించబడుతుందని తెలిపింది. ఆధార్ వినియోగదారుల వివరాల ధ్రువీకరణకు ఓటీపీ లేదా ఐరిస్, ఫింగర్ ప్రింట్‌తోపాటు ఈ అనుమతి ఉంటుందని వివరించింది. గతవారం - మిగతా 2 లో

మోడీ యాప్‌తో యమ డేంజర్

ఫ్రాన్స్ నిపుణుడి హెచ్చరిక

న్యూఢిల్లీ : ఇప్పటికే ఆధార్‌తో వ్యక్తిగత సమాచారం అంగట్లో సరుకుగా మారిందని ఒకపక్క ఆందోళనలు వ్యక్తం అవుతుంటే ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ప్రధాని మోడీ ఆండ్రాయిడ్ యాప్ ఓ మూడో వ్యక్తికి చేరవేస్తోందంటూ ఫ్రాన్స్‌కు చెందిన ఒక సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు సంచలనాత్మక విషయాలను వెల్లడించాడు. 'నమోయాప్' పేరిట ప్రాచుర్యం పొందిన ఈ యాప్‌ను మీరు ఇన్‌స్టాల్ చేసుకుంటే వ్యక్తిగత వివరాలన్నీ 'క్లెవర్ ట్యాప్' అనే అమెరికా కంపెనీకి వెళతాయని ఇలియట్ ఏల్డర్సన్ అనే నిపుణుడు ట్విటర్ ద్వారా తెలిపారు. ఒక్క సమాచారమే కాదు. ప్రజల పేరు, స్త్రీ లేదా పురుషుడు, ఫొటోలు, ఈ మెయిల్, పర్సనల్ నెంబర్లు కూడా డొమైన్‌కు (హెచ్‌టీటీపీ// ఇన్. డబ్ల్యు జెడ్ఆర్కేటీ.కం&8221) వెళుతున్నాయని వివరించారు. ఈ డొమైన్ ఒక పెద్ద ఫ్రాడ్ లింకని ఆయన హెచ్చరించారు. వ్యక్తిగత వివరాల సేకరణకు పాస్ వర్డ్‌లు, క్రెడిట్ కార్డుల నెంబర్ల సేకరణకు అందరికీ దొంగపద్ధతుల్లో మోసపూరితంగా ఈ మెయిల్స్ పంపుతూ ఉంటుందని జీడేటా సంస్థ తెలిపింది.

ఎన్‌సీసీ కెడేట్లకు 'మోడీ' వల : జాతీయ కేడెట్ దళం (ఎన్‌సీసీ) - మిగతా 2 లో



బావి మింగేసింది

10 మంది దుర్మరణం



- నిజామాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం
- అదుపుతప్పి బావిలో పడిన ఆటో
- ఏడుగురికి గాయాలు
- ఓవర్ లోడ్ కారణంగానే ప్రమాదం

విశాలాంధ్ర-నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముస్కాల్ నుంచి మెండోరా వెళ్తుండగా మెండోరా సమీపంలో అదుపుతప్పిన ఓ ఆటో బావిలో పడింది. ఈ ఘటనలో పది మంది దుర్మరణం చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఆరుగురు చిన్నారులు ఉన్నారు. ఆటో ఓవర్‌లోడ్‌తో రావడం వల్లే ఈ స్థాయిలో మృత్యువాత పడ్డట్టు స్థానికులు తెలిపారు. ఐదారు మంది వెళ్లాల్సిన ఆటోలో 17 మంది ప్రయాణిస్తున్నారని, ఎదురుగా వచ్చే - మిగతా 2 లో

ఉద్యోగ భద్రత ఉఫ్


- పరిశ్రమల యాజమాన్యానికి అనుకూలంగా నిబంధనల్లో మార్పు
- యజమానికి ఇష్టముంటేనే ఉద్యోగం లేదంటే.. ఊడుతుంది
- గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసిన మోడీ సర్కార్
- ఐక్య పోరుకు కార్మిక సంఘాల సన్నద్ధం



న్యూఢిల్లీ : వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుడికి ఇకపై ఉద్యోగ భద్రత హుళుక్కే. కంపెనీ యాజమాన్యం కార్మికుడ్ని విధుల నుంచి ఎప్పుడంటే అప్పుడు తీసేసే ప్రమాదం ఏర్పడింది. 3నెలలు, 6నెలలు..కాల వ్యవధితో కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని నియమించుకునే హక్కు యాజమాన్యాలకు కల్పిస్తూ కేంద్రంలోని మోడీ సర్కార్ నిర్ణయం తీసుకుంది. తద్వారా కార్మికుడి ఉద్యోగ భద్రతకు మోడీ సర్కార్ తూట్లు పెట్టింది. దీనికి సంబంధించి కేంద్రం తాజాగా 'గెజెట్ నోటిఫికేషన్' జారీ చేసింది. దీని ప్రకారం,'పారిశ్రామిక నిబంధనల'కు సంబంధించి మార్పులు చేశారు. యజమాని ఇష్టముంటే కార్మికుడి ఉద్యోగం ఉంటుంది. లేదంటే ఊడుతుంది. యాజమాన్యానికి అనుకూలమైన నిబంధనల మార్పు చేశామని గెజెట్ నోటిఫికేషన్‌లో కేంద్రం తెలిపింది. ఈ నిబంధనల మార్పు వల్ల, దేశవ్యాప్తంగా అనేక పరిశ్రమల్లో యాజమాన్యాలకి విశృంఖల మైన స్వేచ్ఛ దక్కింది. కార్మికుడిని ఉద్యోగంలో కొనసాగించటం యాజమాన్యం ఇష్టప్రకారంపై ఉంటుంది. కార్మిక సంఘాలు దేనినైతే వ్యతిరేకిస్తున్నాయో, దానినే మోడీ సర్కార్ అమల్లోకి తేవటం సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తోంది. ఇంతకు ముందు వాజ్‌పేయి ప్రభుత్వం ఉన్నప్పుడు 2003లో ఇలాగే 'పరిశ్రమ నిబంధన'ల్లో మార్పులు చేసి, కార్మికుల ఉద్యోగ భద్రతకు తూట్లు చేశారు. దేశ వ్యాప్తంగా దీనిపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావటంతో 2007లో యూపీఏ ప్రభుత్వం ఆ నిబంధనల్ని రద్దు చేసింది. మళ్లీ దీనిని మోడీ సర్కార్ అమల్లోకి తేవటంపై దేశంలోని కార్మికవర్గాలన్నీ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మళ్లీ ఉద్యమించడానికి కార్మిక సంఘాలన్నీ సిద్ధమవుతున్నాయి.

కాల్ మనీ ఉచ్చు

- వారానికి రూ.10 వడ్డీ వసూలు
- ఖాళీ చెక్కులతో కోర్టులో కేసులు
- మహిళలపై అత్యాచారాలు
- శ్రీకాకుళంలో తూర్పు గోదావరి జిల్లా వడ్డీ వ్యాపారుల ఆగడాలు



విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : రాష్ట్రాన్ని విభజించవద్దంటూ నాలుగేళ్ళ క్రితం రోడ్డుపైకొచ్చి నిరసన తెలిపిన ఉపాధ్యాయుల్లో అతడూ ఒకరు.. ఆ సమయంలో ప్రభుత్వం జీతాలు నిలిపివే యడంతో ఇంటి అవసరాల కోసం ఓ ప్రైవేటు ఫైనాన్స్ నుంచి రూ. 1లక్ష అప్పు తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని పది వాయిదాల్లో రూ.14 వేల చొప్పున చెల్లించేశాడు. అప్పు తీరిపోయిందనుకున్న ఆ ఉపాధ్యాయునికి ఓరోజు ఫైనాన్స్ సంస్థ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మరో రూ. 5 లక్షలు మీరు చెల్లించాల్సి వుందనేది ఆ ఫోన్ సారాంశం. అదేంటని నిలదీస్తే అదంతేనంటూ చెప్పిన ఫైనాన్స్ ప్రతినిధులు ఆ ఉపాధ్యాయుడు అంతకుమునుపు ఇచ్చిన ఖాళీ చెక్కులను నెల జీతం వచ్చే రోజే బ్యాంకులో వేయడం ద్వారా మరో రూ.90 వేలు గుంజుకున్నారు. మాతో గొడవ పడతావా.. నీ సంగతి చూస్తామంటూ.. కోర్టులో రూ.5 లక్షలు చెక్ బౌన్స్ కేసు వేయడం ద్వారా సాలరీ అటాచ్ చేస్తూ ఇప్పుడు నెలకు రూ.పాతిక వేలు చొప్పున లాగేస్తున్నారు. సదరు బాధితుడు శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం మెట్టవలస ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు బొమ్మాళి అప్పారావు. వచ్చిన జీతంలో సగం సదరు ఫైనాన్స్‌సంస్థే పట్టుకుపోవడం, బతుకు దుర్భరంగా మారడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక నిట్టూరుస్తున్నాడు. 2105 డిసెంబర్‌లో శ్రీకాకుళం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే కాల్‌మనీ కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత పోలీసులు ఫిర్యాదును బుట్టదాఖలు చేశారు. అప్పటినుంచి సదరు ఉపాధ్యాయుడికి మరిన్ని కష్టాలు - మిగతా 2 లో

రాష్ట్రంలో తగ్గిన ఓటర్లు

- మూడేళ్లలో 20.93 లక్షల తగ్గుదల
- తాజా జాబితా ప్రకారం 3.49 కోట్ల ఓటర్లు
- సవరణలో లోపాలే కారణమా?

3లో

రైల్వే స్టేషన్లకు నవకళ

- దేశంలో 90 స్టేషన్ల ఎంపిక
- జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం
- సంస్కృతి, చారిత్రక అంశాల మేళవింపు

11లో

ప్రత్యేక హోదా పోరాటానికి

మా మద్దతు

పార్టీలకు అతీతంగా సమైక్య పోరుకు హామీ



హైదరాబాద్‌లో 'మా' ప్రతినిధులను కలిసిన రామకృష్ణ, చలసాని 2లో

ఇదీ లోకం!



వెలగని వయోజన జ్యోతులు



- వెలవెలబోతున్న సాక్షర భారత్ కేంద్రాలు
- 1500 గ్రామాల్లో ఖాళీగా పడి ఉన్న పోస్టులు
- కోట్ల ఖర్చు నిరర్థకమే
- అంతా మిథ్య.. అక్షరాస్యతపై కాకి లెక్కలు

విశాలాంధ్ర-అమరావతి : నిరక్షరాస్యుల్లో అక్షర జ్యోతులు వెలిగించడం కోసం ప్రారంభించిన వయోజన విద్యా కేంద్రాలు, సాక్షర భారత్ కేంద్రాలు వెలవెలబోతున్నాయి. ఏటా రూ.కోట్లు ఖర్చుపెడుతున్నా ఆ స్థాయి ఫలితాలు రావడం లేదన్న అభిప్రాయం రాష్ట్ర విద్యాశాఖ వర్గాల్లోనే వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 502 మండలాల పరిధిలోని 9,979 గ్రామ పంచాయతీల్లో సాక్షర భారత్ కార్యక్రమం అమలవుతోందని అధికారులు తమ నివేదికల్లో రాసుకుంటున్నారు. ఆ లెక్కలను పట్టుకొని పరిశీలనకు బయలుదేరిన వారికి అడుగడుగునా నిరాశే ఎదురవుతోంది. ఏమ్మా, మీ గ్రామంలో వయోజన కేంద్రం ఉందా అని అడిగితే స్థానికులు తెల్లముఖం వేస్తున్నారు. రాష్ట్రంలోని సింహభాగం గ్రామ పంచాయతీల్లో ఈ కేంద్రాలు పని చేయడం లేదు. ప్రతి గ్రామ పంచాయతీలో వయోజన విద్య, సాక్షర భారత్ కేంద్రాల నిర్వహణకు ఇద్దరు కోఆర్డినేటర్లను నియమించాల్సి ఉంది. ప్రతి కో ఆర్డినేటర్‌కు రూ.2 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించాలి. వాస్తవంలో దాదాపు 1500 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. పని చేస్తున్న చోట 2016 డిసెంబర్ తరువాత జీతాలు ఇవ్వలేదని తెలిసింది. రికార్డులకూ, వాస్తవ ఫలితాలకూ పొంతన లేని పరిస్థితి నెలకొంది. 15-50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వయోజనుల్లోని నిరక్షరాస్యులను గుర్తించి, అక్షరాలు నేర్పాలని, శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి చైతన్యాన్ని, నైపుణ్యాన్ని కల్పించాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. దీనికోసం రాష్ట్రంలో 1980 నుంచి వయోజన విద్య, 2010లో సాక్షర భారత్ కార్యక్రమం రాష్ట్రంలో అమలవుతున్నాయి. వయోజన విద్య కోసం ప్రత్యేకంగా ఓ - మిగతా 2 లో

జపాన్ రాజ్యాంగ సవరణ : షింజో అబే



టోక్యో : జపాన్ రాజ్యాంగాన్ని సవరించడానికే ప్రధానమంత్రి షింజో అబే నిర్ణయించుకున్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వివాదాస్పదమైన ఈ చర్యను కొనసాగించడానికే ఆయన పూనుకున్నట్లు తెలిపారు. ఆయనపైన రాజకీయ కుంభకోణం ఆరోపణలు వచ్చినందున ఆయన పట్ల ప్రజలలో ఆదరణ తగ్గుతోందని తెలుస్తోంది. తన మద్దతుదారులలో ఒకరికి తక్కువ ధరకు ప్రభుత్వ భూమిని ఇచ్చారని, బహుశా ఆయన భార్య హకి ఈ వ్యవహారంలో జోక్యం కలిగివున్నారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. భూవిక్రయానికి సంబంధించిన అధికార రికార్డులలో మార్పులు చేసినట్టుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ప్రజలలో వ్యతిరేకత వ్యక్తమౌతోంది. పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీ సమావేశంలో అబే మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై తాను దర్యాప్తు జరిపించి ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. రాజ్యాంగాన్ని సవరించి ప్రభుత్వాన్ని చక్కదిద్దడం ద్వారా ఇలాంటివి తిరిగి జరగకుండా చూస్తానని అబే చెపుతున్నారు.

17 గంటలు - 14875 కి.మీ

లండన్ : ఆస్ట్రేలియా నుంచి బ్రిటన్‌కు 17 గంటల 5 నిముషాల సేపు విమానం ఎక్కడా ఆగకుండా ప్రయాణించి బ్రిటన్ చేరుకుని చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియాలోని పెర్త్ నుంచి లండన్ హీత్రో విమానాశ్రయానికి ఆదివారం ఈ విమానం చేరుకున్నది. 14,875 కిలోమీటర్లు ఈ విమానం ఎక్కడా ఆగకుండా ప్రయాణించింది. 787-9 డ్రీమ్‌లైనర్ బోయింగ్ విమానం 230 మందికి పైగా ప్రయాణీకులు, సిబ్బందిని తీసుకుని హీత్రో విమానాశ్రయానికి ఉదయం కచ్చితంగా 5 గంటలకు చేరుకున్నదని గార్డియన్ పత్రిక తెలిపింది. విమానయాన చరిత్రలోనే ఇది ఒక గొప్ప మలుపుగా పేర్కొన్నారు. మొట్టమొదటి వాణిజ్య విమానం ఆస్ట్రేలియా నుంచి ఐరోపా ఖండానికి మధ్యలో ఆగకుండా చేరుకోవడం విశేషం. గతంలో ఇలాంటి విమానాల కంటే ఈ విమానంలో ఇంధన సామర్థ్యం 20 శాతం అధికంగా ఉంటుందని వైమానిక సంస్థ తెలిపింది. ఆస్ట్రేలియా నుంచి విమానం బయలుదేరిన తరువాత కొద్ది సేపటికి మార్కస్ తుపాను ప్రభావం మూలంగా ప్రయాణీకులు కొంత ఆందోళనకు గురయ్యారు. పెర్త్ విమానాశ్రయం నుంచి శనివారం సాయంత్రం 6.57 గంటలకు బయలుదేరిందని ఆస్ట్రేలియా వాణిజ్య, పర్యాటక శాఖ మంత్రి స్టీవ్ సిబో తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

కారల్‌మార్క్స్ ఆలోచన

–టెరిస్టియా విసెంట్
(బ్రిటన్‌లో క్యూబా రాయబారి)

కారల్ మార్క్స్ ఆలోచనను పలు కోణాల నుంచి అర్థం చేసుకోవచ్చు.
- ప్రపంచాన్ని వ్యాఖ్యానించడం
- ప్రపంచాన్ని అర్థం చేసుకొనే పరిశీలనా పద్ధతి
- ప్రపంచాన్ని మార్చటానికి కార్యాచరణకు కరదీపిక



ప్రజలు కొన్నిసార్లు ఇందులో ఒక వైపు నుంచే చూస్తారు. కాని అన్ని వైపుల నుంచి చూసే అవసరం ఉన్నది. ఇక్కడ రెండు అంశాలను పరిశీలిద్దాం. కొంతకాలం క్రితం వరకు మూడవ ప్రపంచంగా పిలవబడే అంశాన్ని చూద్దాం.

1860 దశకంలో కారల్ మార్క్స్, ఏంగిల్స్‌లు యూరప్ వెలుపల ప్రపంచం పట్ల, వాటి సమస్యల పట్ల ఆసక్తిని ప్రదర్శించారు. వలస సమస్య, జాతీయ సమస్య, అక్కడ అణగారిన ప్రజల భవిష్యత్తు, వారి విముక్తి పోరాటాలను అధ్యయనం చేశారు.

మార్క్స్, ఏంగిల్స్ తర్వాత వారి అనుచరులు ఆ సిద్ధాంతాన్ని యావత్ ప్రపంచానికి విస్తరింపజేయడం ద్వారా సంపద్వంతం చేశారు. విప్లవ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో వారు చెప్పింది ఏమిటి? మానవాళి విముక్తి క్రమాన్ని పేర్కొన్నారు. ఆర్థిక పునాదికి దానిని కుదించలేదు. మార్క్సిజాన్ని నిరంతరం అభివృద్ధి చేయడం ద్వారా అది ఒక సజీవశక్తిగా మన్నగలుగుతుంది.

నేటి లాటిన్ అమెరికాకు మార్క్సిజం మౌలికమైనది. అక్కడ ఏయే వర్గాల పాత్ర, బలహీనతలను, ప్రత్యేక పరిస్థితులు, సమస్యలను అర్థంచేసుకొనేందుకు అది ఉపయోగపడుతుంది.

క్యూబా విప్లవాన్ని తీసుకోండి... లాటిన్ అమెరికా విప్లవ సంప్రదాయాలు, జోషే మార్టి ఆలోచనకు మార్క్సిజం అనుసంధానమైంది. క్యూబా విప్లవకర అనుభవాల నుంచి లాటిన్ అమెరికా ఎంతో ప్రయోజనం పొందుతున్నది.

మార్క్సిజం మానవవాదం కూడా. చరిత్రను మార్పు చేసే ప్రజల విప్లవశక్తిపై ఆధారపడిన మానవవాదం అది.

మార్క్సు సిద్ధాంతం, ఒక భావన, ఒక పరిశీలనా పద్ధతి, ఒక శాస్త్రం.. అంటే నిర్దిష్టమైనది; ఒకే రకమైన రెండు నిర్దిష్ట పరిస్థితులు ఉండవు అని చే గువేరా విశ్లేషణ చేశారు. విప్లవకర శాస్త్రం విప్లవకర రైఫిల్‌ను చేపట్టడం ద్వారా క్యూబా విప్లవం మార్క్స్‌ను ముందుకు తీసుకుపోయిందని చే గువేరా అన్నారు. క్యూబా విప్లవం, ఫిడెల్ కాస్ట్రో విద్యాబోధన ద్వారా ఆ సమాజంలో మార్పు వచ్చింది. చైతన్యస్థాయి పెరిగింది. మార్క్సిజం అనేది మానవాళి సముపార్జించిన సాంస్కృతిక శాస్త్ర విజ్ఞాన వారసత్వ సంపదలో ఒక భాగం.

మార్క్స్, లెనిన్ గ్రంథాలను అధ్యయనం చేయాలి. అనంతరం సమకూరిన నూతన విజ్ఞానాన్ని శాస్త్రీయ విజయాలను అధ్యయం చేయడం ద్వారా సృజనాత్మక మార్క్సిజానికి ప్రాతిపదికలను నిర్మించాలి.

(లండన్, మార్క్స్ సమాధి వద్ద చేసిన ప్రసంగం)

దుబాయ్ ధరిత్రి గంట ద్వారా

323 మె.వా. విద్యుత్ ఆదా



దుబాయ్ : దుబాయ్‌లో ధరిత్రి గంట 2018 సందర్భంగా కర్బనపు వాయువుల విడుదలను తగ్గించడమేకాక 323 మెగావాట్ల విద్యుత్‌ను ఆదా చేశారు. విద్యుత్ సరఫరాను గంటసేపు నిలిపివేయడం ద్వారా భారీగా విద్యుత్‌ను ఆదాచేసినట్టు సంబంధిత శాఖతో పాటు నీటి సరఫరా సంస్థ కూడా ప్రకటించింది. గత సంవత్సరం కంటే 32 శాతం అదనంగా విద్యుత్‌ను ఆదా చేయగలిగారు. 140 టన్నులతో సమానమైన విషవాయువుల విడుదలను తగ్గించారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ధరిత్రి గంటను పాటించి విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు కర్బనపు వాయువుల విడుదల తగ్గించి ఉష్ణోగ్రతలు పెరుగుదలను కొంత మేర తగ్గించగలిగారు. పర్యావరణ సమస్యలపై ప్రజలను చైతన్యం చేయడమే ధరిత్రి గంట పాటింపు లక్ష్యం. గత మూడేళ్లుగా దుబాయ్‌లో విద్యుత్, నీటి సరఫరా సంస్థలు కలిసి ధరిత్రి గంటను పాటిస్తున్నాయి. దుబాయ్ సుప్రీం కౌన్సిల్ ఆఫ్ ఎనర్జి సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఎమిరేట్స్ వైల్డ్‌లైఫ్ సొసైటీ, వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్ సంస్థలు సహకరిస్తున్నాయి. ప్రైవేట్ సంస్థలు, యూనివర్సిటీలు, స్కూళ్లు, ప్రభుత్వంతో కలిసి ఈ కార్యక్రమాలను చేపడుతున్నాయి. రాత్రి 8.30 గంటలకు ఎర్త్‌అవర్‌ను ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికులంతా దేశంలోని పలు ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు.

వాణిజ్య యుద్ధంపై చైనా హెచ్చరిక



బీజింగ్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం ప్రపంచానికి హాని చేస్తుందని చైనా ఉపప్రధాని హన్ జంగ్ హెచ్చరించారు. చైనా నుంచి దిగుమతి చేసుకునే స్టీల్, సాంకేతిక పరిజ్ఞానంపై సుంకాలు విధించాలని ట్రంప్ నిర్ణయించిన నేపథ్యంలో తాము కూడా అందుకు తగిన విధంగా స్పందించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇక్కడ వాణిజ్య సంస్థల అధినేతలతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ప్రపంచీకరణకు సహకరిస్తే అందరికి ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు. వాణిజ్య యుద్ధం ఎవరికీ ప్రయోజనం కలిగించదు. తీవ్ర పరిణామాలు కలిగి ప్రతికూల ఫలితాలు వస్తాయని హన్ అన్నారు. 300 కోట్ల డాలర్ల విలువైన దిగుమతి సుంకాలను వందకు పైగా వస్తువులపై విధిస్తామని రెండు రోజుల క్రితం చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. వాణిజ్య యుద్ధం భీతితో పలు దేశాలలో ఆర్థిక మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రపంచ వాణిజ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆయా ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుని ఆర్థిక ప్రపంచీకరణను మరింత సరళంగా, సమ్మిళితంగా, సమతుల్యంగా, ప్రయోజనకరంగా నిర్వహించేందుకు కృషి చేయాలని హన్ విజ్ఞప్తి చేశారు. చైనా మార్కెట్‌కు విదేశీ కంపెనీలను మరింతగా ఆహ్వానిస్తామని ఆయన అన్నారు.

బ్రిటన్‌లో సమోసా వారోత్సవం

లండన్ : బ్రిటన్‌లోని ఒక నగరంలో ఏప్రిల్ 9 నుంచి 13వ తేదీ వరకు సమోసా వారోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. భారత దేశంలో ఎక్కువగా మక్కువ చూపే సమోసాలు బ్రిటన్‌కు కూడా విస్తరించాయి. ఇంకా అనేక దేశాలలోనూ వీటికి ఆదరణ పెరిగింది. లీసెస్టర్ కర్రీ అవార్డ్సు వ్యవస్థాపకులు ఈ వారోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దక్షిణాసియా ప్రాంతంలోని సుసంపన్నమైన ఆహార వారసత్వ సంస్కృతిని ఇది తెలియజేస్తుంది. ముఖ్యంగా దక్షిణాసియా దేశాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన ప్రజలు సమోసా విస్తరణకు దోహదం చేశారు. కేకు, సమోసా, టీ ఈ ప్రాంతంలో ఎక్కువగా ఆదరణ పొందాయని లీసెస్టర్ కర్రీ అవార్డ్సు వ్యవస్థాపకులు రొమాయిల్ గుల్జార్ తెలిపారు. పదో శతాబ్ది నాటి నుంచే పశ్చిమాసియాలో సమోసా చరిత్ర ప్రారంభమైందని గుల్జార్ తన వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. వ్యాపారులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వీటిని పరిచయం చేశారని, దీంతో ఇది ప్రపంచ వ్యాప్తమైందని ఆయన పేర్కొన్నారు. ముక్కోణ ఆకారంలో లభించే సమోసా భారతదేశంలో సంప్రదాయ ఆహారంగా మారిపోయింది. మంచి స్నాక్‌గా ప్రజలు ఇష్టపడుతున్నారు. బంగాళాదుంప ముక్కలు, బఠాని గింజలు, ఉల్లిపాయ తదితరాలతో సమోసాను తయారు చేస్తున్నారు. ఎగ్ సమోసా కూడా ప్రాచుర్యంలోకి వచ్చింది. ముందుగా లీసెస్టర్ నగరంలో వారోత్సవాలు నిర్వహించి, క్రమంగా దానిని జాతీయ సమోసా వారోత్సవాలుగా మలచాలని భావిస్తున్నారు.

ఆఫ్ఘన్‌లో 63 మంది మిలిటెంట్ల హతం

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్‌లో 24 గంటల్లో కనీసం 63 మంది మిలిటెంట్లను హతం చేసినట్టు భద్రతాదళాలు తెలిపాయి. హతమైన వారిలో 14 మంది ఐఎస్ ఉగ్రవాదులున్నారు. నంగర్‌హర్, ఉర్జిగన్, పరాక్, కాందహార్, పట్టియా రాష్ట్రాలలో టెర్రరిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టినట్టు రక్షణమంత్రిత్వ శాఖ వర్గాలను ఉటంకిస్తూ టోలో న్యూస్ ఈ అంశాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా భద్రతాదళాలు పలు ఆయుధాలను, పేలుడు వస్తువులను కనుగొని స్వాధీనం చేసుకున్నట్టుగా భద్రతా దళాలు తెలిపాయి. ఈ ఘటనలపై తిరుగుబాటుదారుల సంస్థలు స్పందించలేదు.

ముఖమే ఆధార్

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో ఆధార్ ఎన్‌స్క్రిప్షన్ వ్యవస్థ పటిష్టతను నొక్కి చెబుతూ జూలై 1 నుంచి ముఖ ప్రామాణీకరణ అంశాన్ని ప్రవేశపెట్టనున్నట్లు యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే తెలియజేశారు. ఇప్పటికే ప్రజాపంపిణీ వ్యవస్థ, టెలికం కంపెనీలు, బ్యాంకులు, ఆదాయపు పన్ను వంటి ఇతరత్రా వాటికి ఆధార్ గుర్తింపును వినియోగిస్తున్నారు.

యమ డేంజర్

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులంతా ప్రధాని మోడీ యాప్ నమోను తమ స్మార్ట్ ఫోన్లలో వినియోగించాలంటూ వెలువడిన ఆదేశాలు వివాదాలకు దారి తీసింది. త్వరలో కేడెట్లతో సమావేశమవుతామని మోడీ వెలువరించిన నేపథ్యంలో వారి ఫోన్ నెంబర్లు, ఈ మెయిల్ ఐడీలు సేకరించాలంటూ ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ బీఎస్ సహ్రావత్ అన్ని రాష్ట్రాల్లోని విభాగాలకు ఆదేశాలిచ్చారు. దీంతో 15 లక్షల మంది కేడెట్లలో 13 లక్షలమంది సభ్యుల నెంబర్లను అధికారులు సేకరించి కేంద్రానికి పంపారు. వీరంతా ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై పలువురు కెడేట్లు విపక్షాల నాయకులు మండిపడుతున్నారు. ఒక ప్రైవేట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని అధికారికంగా ఎలా ఆదేశాలు ఇస్తారని పలువురు ట్విటర్ వేదికగా 'డిలిట్ నమో యాప్' ట్యాగ్‌తో విమర్శలు కురిపించారు. అధికారిక యాప్ పీఎంఓకు బదులు నమోను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేక హోదా పోరాటానికి 'మా' మద్దతు

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ : తెలుగు ప్రజల హక్కుల సాధనకు ప్రజల పక్షాన పోరాటాలకు మద్దతు ఇస్తూ తమ వంతు సహాయం అందిస్తామని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(మా) తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాజకీయ పార్టీలు చేపడుతున్న ప్రత్యేక హోదా, విభజన హామీల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని మా అధ్యక్షుడు శివాజీరాజా ప్రకటించారు. ఏపీలో జరుగుతున్న న్యాయమైన పోరాటానికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ మద్దతు ఇవ్వాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్‌లు శివాజీరాజాను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్‌లో ఏపీకి న్యాయం చేసేందుకు అనేక హామీలను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. అదే సమయంలో విభజన హామీ చట్టంలో ఉన్న అనేక అంశాలను సాధించడంలో రాష్ట్రంలో ఉన్న టీడీపీ కూడా విఫలమైందన్నారు. ప్రధానమైన ప్రత్యేక హోదాను అటు కేంద్రం, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు గడిచిన నాలుగు సంవత్సరాలుగా పక్కకు పెట్టి ప్రత్యేక ప్యాకేజీ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల పక్షాన ప్రత్యేక హోదా కోసం ప్రయత్నించడం మంచిదే అన్నారు. అయితే పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన ప్రత్యేక హోదాను సాధించుకునేందుకు మొదటి నుండి సీపీఐతో పాటు వివిధ రాజకీయ పక్షాలు పోరాటాలు చేస్తూనే ఉన్నాయని తెలిపారు. అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయింపులో కూడా విభిన్న వాదనలు వినిపించడంతో పాటు ఇటీవల జేఎఫ్‌సీ పేరుతో కమిటీని వేసి వారి అసలు రంగును బయటపెట్టామని వివరించారు. ఇప్పుడు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా లేఖ రాయడం, దానిపై చంద్రబాబు స్పందించడం వంటి కొత్త నాటకాలకు తెరతీశారని పేర్కొన్నారు. ఇలాంటి వాటితో మభ్యపెట్టకుండా ప్రజలకు మేలు చేసే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా శివాజీరాజా మాట్లాడుతూ భవిష్యత్తులో విభజన హామీలపై పోరాటాలకు తమ తరపున బలమైన మద్దతు ఇస్తామన్నారు. అందరం కలిసి పార్టీలకు అతీతంగా పోరాడి తెలుగువారి హక్కులను సాధించుకుందామని ఆయన అన్నారు. ఏపీలో ప్రజల తరపున జరిగే ప్రతి ఉద్యమానికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ తరపున పూర్తి మద్దతు ఇవ్వడం పట్ల రామకృష్ణ, చలసాని శ్రీనివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి ఫిల్మ్ డివిజన్ కార్యదర్శి మద్దినేని రమేష్, కోశాధికారి మాదాల రవి, మా కమిటీ సభ్యులు రఘుబాబు, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



వెలగని వయోజన జ్యోతులు

(మొదటిపేజీ తరువాయి)

విభాగమే పని చేస్తోంది. విద్యాశాఖ ఆధ్వర్యంలోని ఈ విభాగానికి భారీగా నిధులు ఖర్చు పెడుతున్నారు. ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నాయి. ఇంత వ్యయం చేస్తున్నా, ఈ విభాగంలో చురుకుదనమే కనిపించడం లేదని విద్యాశాఖ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీకి డైరెక్టర్ పోస్టు లేదు. జాయింట్ డైరెక్టరే ఇన్‌చార్జి డైరెక్టరుగా వ్యవహరిస్తున్నారు. ఆయనతోపాటు ఒక డిప్యూటీ డైరెక్టర్, నలుగురు అసిస్టెంట్ డైరెక్టర్లు పర్మనెంట్ ఉద్యోగులు ఈ విభాగంలో పని చేస్తున్నారు. మరో నలుగురిని ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తీసుకున్నారు. అన్ని జిల్లాల్లో కలిపి 150 మంది వరకు రెగ్యులర్ ఉద్యోగులు, జిల్లాకు నలుగురు చొప్పున అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. రాష్ట్రంలో ఏడేళ్ల క్రితం సాక్షర భారత్ కార్యక్రమం ప్రారంభమైనప్పుడు నిరక్షరాస్యులు దాదాపు 83 లక్షల మంది ఉన్నట్లు అంచనా వేశారు. గత ఏడాది వరకు వీరిలో 51 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దినట్లు అధికారులు తమ నివేదికల్లో చెప్పుకొన్నారు.

అయితే అదంతా అంకెల గారడీ మాత్రమేనని పలువురు పేర్కొంటున్నారు. అసలు వయోజన విద్యా కేంద్రాలు, సాక్షర భారత్ కేంద్రాలే తెరుచుకోనప్పుడు ఇక శిక్షణ, అవగాహనకు తావెక్కడ అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై వయోజన విద్యాధికారుల వాదన వేరుగా ఉంది. వయోజన విద్యా కార్యక్రమాన్ని అందరి సామాజిక కార్యక్రమంగా చూడాలి. ఏదో ఒక శాఖ పనిగా భావించడం సరికాదు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు సంక్షేమ శాఖలు కూడా ఈ కార్యక్రమాల్లో పాలుపంచు కుంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భానుడి భగభగ

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు, తగ్గిన జనసంచారం

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. భానుడి ప్రతాపానికి సెగలు వస్తుండగా.. మరోవంక ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అనూహ్యంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఇళ్ల నుండి బయటికి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. రాత్రిళ్లు కూడా సెగలు ప్రారంభమయ్యాయి. దీంతో మార్చి చివరి వారంలో పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఇంకెలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ప్రధాన నగరాల్లో జనసంచారం ఇప్పటికే తగ్గింది. పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామీకరణతో పాటు కాలుష్యం అధికమవుతుండడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరగనుందని, సాధారణ ఉష్ణోగ్రతల కంటే 1-3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నట్లు భారత వాతావరణ సంస్థ వెల్లడించింది. వడగాడ్పుల తీవ్రతా పెరుగుతుందని హెచ్చరించింది. ఆదివారం రికార్డుస్థాయిలో 39 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత హైదరాబాద్‌లో నమోదైంది. మరో వారం పాటు 39-40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గోదావరిఖని, మందమర్రి, కొత్తగూడెం, మనుగూరు, భూపాలపల్లి, బెల్లంపల్లి, నిజామాబాద్, కామారెడ్డిల్లో ఉష్ణతాపం రోజు రోజుకూ పెరుగుతోంది.

రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండు: నగరంలో భానుడి భగభగలకు విద్యుత్ డిమాండు రికార్డు స్థాయిలో నమోదవుతోంది. గ్రేటర్‌జోన్‌లో రెండు రోజులుగా విద్యుత్ వినియోగం 53 నుంచి 55 మిలియన్ యూనిట్లకు చేరింది. గతేడాది ఏప్రిల్‌లో నమోదైన విద్యుత్ వినియోగం ఈ ఏడాది మార్చి చివరి వారంలోనే నమోదవుతోంది. ఏప్రిల్‌లో డిమాండు 62 నుంచి 65 మిలియన్ యూనిట్ల వరకు చేరవచ్చునని విద్యుత్‌శాఖ అంచనావేస్తోంది. గ్రేటర్ జోన్ పది సర్కిళ్ల పరిధిలో మూడ్రోజులుగా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

బావి మింగేసింది

(మొదటిపేజీ తరువాయి)

వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయిందని స్థానికులు చెప్పారు. ప్రమాద వార్త తెలుసుకున్న కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ కార్తికేయ మిశ్రా, జేసీ సహా పలువురు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయ చర్యలు చేపట్టారు. ఆటో బావిలో పడిన సమయంలో ఆటోకు వెలుపలిగా కూర్చున్న వారు నీటిలో నుంచి ఈదుకుంటూ బయటికి వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆటోలో ఉన్న మరికొందరిని స్థానికులు కాపాడారు. కొందరికి గాయాలు కాగా, మరికొందరు నీళ్లు తాగి స్పృహ కోల్పోయారు. దేహాలు బావి పూర్తి అడుగు భాగంలో లభించాయి. ఈ ప్రమాదం జరిగిన అరగంట వ్యవధిలోనే ఎనిమిది మంది మృత దేహాలు బయటికి వచ్చాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఎక్కువ మంది ప్రయాణికులతో ఆటోలు ప్రయాణించడం ఈ ప్రాంతంలో సహజమేనని, పోలీసులు కానీ, రవాణాశాఖ అధికారులు కానీ పట్టుకోరని స్థానికులు అంటున్నారు. వందల సంఖ్యలో ఆటోలు ఈ విధంగానే రాకపోకలు సాగిస్తుంటాయని, అందుకే వీటిని నిలువరించడం కొంత కష్టంతో కూడుకొని ఉందని పోలీసు శాఖ చెబుతోంది. వీటిని నిలువరించడంలో రవాణాశాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. రోజువారి తనిఖీలు లేకపోవడం, వాహనాల నాణ్యతను పరిశీలించకపోవడం ఇలాంటి ప్రమాదాలకు ఊతమిస్తున్నాయి. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి పోచారం దిగ్భ్రాంతి

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎంఆర్ఎం రావును ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచించారు.

కాల్‌మనీ ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

మొదలయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తావా? ఇంకా పది చెక్కులున్నాయంటూ మరింత వేధించడం మొదలెట్టారు. ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులతో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో అధిక సంఖ్యలో కేసులు వేయడం ద్వారా జిల్లాలో వందల సంఖ్యలో బాధితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. డేనైట్ జంక్షన్ వద్ద శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుని కార్యాలయం ఎదురుగా ఈ శ్రీసాయి మణికంఠ ఫైనాన్స్ సంస్థ కార్యాలయం వుంది. వారిచ్చే బుక్‌పై కనీసం చిరునామా, ఫోన్ నెంబరు లేదా మరే సమాచారమూ లేదు. సదరు కార్యాలయంలో అప్పు తీర్చని మహిళలను రప్పించుకుని అసభ్యకరంగా ప్రవర్తిస్తారని తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లలేక చాలామంది బాధితులు అవమానభారంతో కృంగిపోతున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు జరుగుతున్నా, పెద్దలకు వ్యవహారం తెలిసినా కనీస చర్యలు లేవు. కాల్‌మనీ ఫిర్యాదు అందుకున్న తర్వాతైనా సదరు మణికంఠ ఫైనాన్స్ సంస్థకున్న అనుమతులపై ప్రశ్నించలేదు. వారానికి రూ. 10వడ్డీ మొదలు ఎంతైనా గుంజడం ఈ ముఠా పని. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన వడ్డీ వ్యాపారులు జిల్లాలో దశాబ్దకాలంగా హల్‌చల్ చేస్తున్నారు. కానీ ఇటీవల కాలంలో ఈ వడ్డీ పేరుతో దందా మరింత ఎక్కువైంది. వీరి దెబ్బకు ఎంతో మంది కుదేలైపోయారు.



కాల్‌మనీ కార్యకలాపాలు జరిగేదిక్కడే

నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి తన అవసరాల కోసం కేవలం రూ.20వేలు అప్పుగా తీసుకుంటే రూ.4లక్షలు చెక్‌బౌన్సు కేసు వేయడం ద్వారా ఆమె జీతాన్ని కూడా ఈ ముఠా అటాచ్ చేయించగలిగింది. ఇంకా పాతపట్నంలో పనిచేస్తున్న రాజారత్నం అనే ఉపాధ్యాయురాలు రూ. 10వేలు బకాయి వుండగా, రూ.3లక్షల ముక్కు పిండి మరీ వసూళ్లు చేయడం వీరికే చెల్లింది. అలాగే పశుసంవర్ధక శాఖకార్యాలయంలో పనిచేస్తున్న కొండబాబు అనే వైద్యుడు, రణస్థలంలో పనిచేస్తున్న ఢిల్లీశ్వరరావు అనే ఉపాధ్యాయుడు నుంచి కూడా రూ.3 లక్షల చొప్పున బలవంతపు వసూళ్లు జరిపారు. ప్రభుత్వ ఉద్యోగులు రోడ్లపైకి రారని ఏం చేసినా గుట్టుగా వుంటారన్నదే వారి ధైర్యం. దీనిపై పోలీసు యంత్రాంగం ఎలా స్పందిస్తుందో చూడాలి. ప్రయివేటు ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టం చేసేందుకు సిద్ధమైంది. ఈ శాసనసభా సమయాల్లోనే ఆ బిల్లు చర్చకు రావాల్సి వుండగా, అదీ జరగలేదు. చెక్‌లు, ప్రామిసరీ నోట్లతో ఇష్టానుసారు వ్యాపారం చేసే వారిని అడ్డుకోవాలని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



బాధిత ఉపాధ్యాయుడు బొమ్మాళి అప్పారావు

29న జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 08 ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్ళూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ దావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4 గంటల 56 నిమిషాలకు రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి జీఎస్ఎల్‌వీ-08ను ప్రయోగించనున్నారు. దీనిలో జిశాట్-8 కమ్యూనికేషన్ శాటిలైట్ పంపనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి ఈ నెల 27, 28 తేదీలలో ఏఆర్ఆర్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. అందులో షార్ శాస్త్రవేత్తలు పాల్గొని అధికారపూర్వకంగా ప్రయోగ తేదీని, సమయాన్ని ప్రకటించనున్నారు. ఈ ప్రయోగాన్ని మిషన్ డైరెక్టర్ మోహన్ నిర్వహించనున్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయబడింది. ఈ ప్రయోగానికి సంబంధించి అనుసంధాన ప్రక్రియ పూర్తి చేశారు. 2.140 టన్నుల బరువు కలిగి ఉండే శాటిలైట్ కాల పరిమితి పది సంవత్సరాలు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 రాకెట్ 450 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి బయలుదేరుతుంది. ఈ ప్రయోగంలో 2.140 బరువు కలిగిన జిశాట్ ఉపగ్రహాన్ని అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి శాస్త్రవేత్తలు రాకెట్‌ను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయోగం సందర్భంగా షార్ మార్గం గుండా వెళ్లే వాహనాలను పోలీసులు, జీఎస్ఎఫ్ జవాన్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సముద్ర మార్గం గుండా చొరబాటుదారులు లోనికి ప్రవేశించకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.





వైభవంగా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రభుత్వం తరపున పాల్గొన్న మంత్రులు

విశాలాంధ్ర బ్యూరో - కడప : రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలో కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీరాముల వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ మహోత్సవాలలో ప్రభుత్వం తరపున జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఆదినారాయణ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ఉత్సవాలు ప్రారంభించారు. మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి సీతారాముల కళ్యాణం కోసం తలంబ్రాలను తెచ్చారు. మార్చి 30న సీతారాముల కళ్యాణం టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఒంటిమిట్ట ఆలయాన్ని భద్రాచలం తరహాలో అభివృద్ధి చేసేందుకు టీటీడీ కృషి చేస్తోందన్నారు. ధర్మ ప్రచారంలో బాగంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి టీటీడీ సహకరిస్తూ ఆయా వర్గాలవారికి అర్చక శిక్షణ ఇచ్చి అక్కడి ఆలయాల్లో అర్చకులుగా నియమిస్తామన్నారు. పోతన సాహిత్య పీఠం ఆధ్వర్యంలో విద్వాన్ కట్టా నరసింహులు రచించిన 'శ్రీరామనీయకం' ప్రత్యేక సంచికను వారు ఆవిష్కరించారు. ఆలయాన్ని అభివృద్ధి చేసి, దేశ వ్యాప్తంగా ఎక్కువ మంది భక్తులు పాల్గొనేటట్లు చేయడానికి ముఖ్యమంత్రి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 30న కళ్యాణానికి ముఖ్యమంత్రి హాజరవుతారని, అభివృద్ధి ప్రణాళికలను ఆ రోజు సీఎం ప్రకటిస్తారన్నారు ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సీయం రమేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, చీఫ్ విప్ మేడా మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీష్ రెడ్డి, తెలుగు దేశం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తగ్గిన ఓటర్లు

* మూడేళ్లలో 20.93 లక్షల తగ్గుదల
* తాజా జాబితా ప్రకారం 3.49 కోట్ల ఓటర్లు
* సవరణలో లోపాలే కారణమా...!

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో ఒక్కసారిగా 20.93 లక్షల మంది ఓటర్లు తగ్గిపోయారు. మూడు సంవత్సరాలల్లోనే ఓటర్ల సంఖ్య ఇంత భారీగా తగ్గటం ఇదే ప్రథమం. 18 ఏళ్లు వయస్సు నిండిన వారికి కొత్తగా ఓటు కల్పించటంతోపాటు, మృతి చెందిన వారి పేర్లను జాబితా నుంచి ప్రభుత్వం తొలగించింది. అదే సమయంలో కొన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్దేశపూర్వకంగానే ఓటు హక్కును తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార టీడీపీ నాయకులు కావాలనే ప్రత్యర్థుల ఓట్లను గల్లంతు చేయటంపై ఎన్నికల సంఘానికిసైతం ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తాజాగా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. తాజా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 3,70,82,855 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటరుక్లు 1,73,69,922 మంది, మహిళా ఓటర్లు 1,76,11,570 మంది, హిజ్రాలు (థర్డ్ జండర్) ఓటర్లు 8,579 మంది ఉన్నారు. 2015 జనవరిలో ప్రభుత్వం నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణల ప్రకారం చూస్తే స్త్రీ, పురుషుల ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గటం గమనార్హం. దీంతో ఓటర్ల జాబితా సవరణలలో తప్పులు దొర్లాయనే విమర్శలకు బలం చేకూరుతున్నట్లైంది. ఒక్కసారిగా 20.93 లక్షల మంది ఓటర్లు తగ్గటంతో అధికార టీడీపీతోపాటు ప్రతిపక్షాలనుసైతం కలవరపాటుకు గురి చేస్తోంది. 2015 జనవరిలో విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం 13 జిల్లాల్లోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3,70,82,855 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 1,84,14,685 మంది, మహిళా ఓటర్లు 1,86,64,912 మంది, థర్డ్ జండర్ ఓటర్లు 3,258 మంది ఉన్నారు.

తాజా జాబితా ప్రకారం స్త్రీ, పురుష ఓటర్లు తగ్గగా, థర్డ్ జండర్ ఓట్లు మాత్రం పెరిగాయి. తాజా జాబితాలో 8,579 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉండగా, ఒక్క ప్రకాశం జిల్లాలోనే అత్యధికంగా 6,187 మంది ఓటర్లు ఉండటం విశేషం. మహిళా ఓటర్లు 10,53,342 మంది, పురుష ఓటర్లు 10,44,763 మంది తగ్గారు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా 37,86,500 మంది, అత్యల్పంగా విజయనగరంలో 17,36,620 మంది ఓటర్లు ఉన్నారు. అన్ని జిల్లాల్లోనూ మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉండగా, శ్రీకాకుళ మాత్రం 1,381 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.



జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు

జిల్లా పేరు	జనవరి, 2015	జనవరి, 2018
శ్రీకాకుళం	20,09,458	20,12,087
విజయనగరం	17,31,610	17,36,020
విశాఖపట్నం	34,09,005	31,29,887
తూర్పు గోదావరి	38,75,850	37,86,500
పశ్చిమ గోదావరి	29,58,410	28,56,565
కృష్ణా	33,41,069	30,17,405
గుంటూరు	36,63,089	35,60,881
ప్రకాశం	24,79,684	24,01,928
నెల్లూరు	22,78,313	20,78,627
కడప	21,69,805	18,66,145
కర్నూలు	30,88,316	27,30,115
అనంతపురం	30,15,385	29,17,318
చిత్తూరు	30,62,861	28,96,956
మొత్తం	**3,70,82,855**	**3,49,87,371**

కర్నూలులో భారీగా 3.58 లక్షలు తగ్గుదల

తాజా ఓటర్ల జాబితా ప్రకారం కర్నూలు జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గింది. 2015 జనవరినాటి ఓటర్ల జాబితా కంటే తాజా ఓటర్ల సంఖ్య 3,58,201 మంది తగ్గారు. ఆ తర్వాత కృష్ణా జిల్లాలో 3,23,614 మంది ఓటర్లు తగ్గినట్లు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన జాబితా ప్రకారం తెలుస్తోంది. అత్యల్పంగా శ్రీకాకుళం జిల్లాలో 2,629 మంది ఓటర్లు తగ్గారు. కడప జిల్లాలో 3,03,660 మంది, విశాఖ జిల్లాలో 2,79,118 మంది, నెల్లూరు జిల్లాలో 1,99,686 మంది, చిత్తూరులో 1,65,905 మంది, గుంటూరులో 1,02,208 మంది, పశ్చిమ గోదావరిలో 1,01,845 మంది, అనంతపురం జిల్లాలో 98,067 మంది, తూర్పు గోదావరిలో 89,350 మంది, ప్రకాశంలో 77,756 మంది, విజయనగరం జిల్లాలో 4,410 మంది ఓటర్లు తగ్గారు.

అమిత్ షా, చంద్రబాబు లెక్కలు మోసం

పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రాభివృద్ధిపై బీజేపీ, టీడీపీ అధినేతలు అమిత్‌షా, చంద్రబాబు చెబుతున్న లెక్కలు పచ్చి మోసమని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆదివారం పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లపాటు కలిసి ఉండి, ఇప్పుడు ఒకర్నొకరు అధికార, ప్రతిపక్షాలుగా మారి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ విభజనతో కాంగ్రెస్ పూర్తిగా నష్టపోయిందని తెలిపారు. ఏపీకి ఐదేళ్ల ప్రత్యేక హోదా, ప్రధాని మన్మోహన్ హామీలు, ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలన్నీ అమలు చేస్తే.. దాదాపు 5 లక్షల మంది విలువైన ప్రయోజనాలు ఏపీకి చేరువవుతాయని పేర్కొన్నారు. అసత్యాల అమిత్ షా, మోసకారి మోడీ, వెన్నుపోటు చంద్రబాబు..రాష్ట్రాన్ని ముంచినోళ్లని మండిపడ్డారు.

బీసీలకు అండగా కాంగ్రెస్ : గంగాధర్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : బీసీలకు అండగా కాంగ్రెస్ నిలిచిందని, కాంగ్రెస్ పాలనలో బీసీలను ఉక్కు పాదంతో అణచివేశారంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమైనవని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ జి.గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. బీసీలకు టీడీపీ ఎంతో చేసిందని చెప్పడం..వారు పరోక్షంగా బీసీలను మోసగించడమేనని పేర్కొన్నారు. చంద్రబాబుకు బీసీలపై చిత్తశుద్ధి వుంటే..ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని కోరారు. బీసీలకు కాంగ్రెస్ హయాంలోనే ఫీజు రీయింబర్స్‌మెంటును కేటాయించారని గుర్తుచేశారు. 1972లో బీసీలకు రిజర్వేషన్‌ను కాంగ్రెస్సే కల్పించిందని, ఈ విషయాన్ని అచ్చెన్నాయుడు గుర్తెరగాలని సూచించారు.

ఆర్టీసీ వీసీగా నేడు సురేంద్రబాబు బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) నూతన వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్‌వీ సురేంద్రబాబు సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకూ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఎం మాలకొండయ్యను డీజీపీగా నియమించిన విషయం తెలిసిందే. గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌కు అదనపు డీజీపీగా చేసిన సురేంద్రబాబు ఇటీవలే డీజీపీగా పదోన్నతి పొందారు.

కేఈకి ఎండోమెంట్ అదనపు బాధ్యతలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఖాళీగా ఉన్న దేవదాయ, ధర్మదాయశాఖ బాధ్యతలను ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తికి కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ, బీజేపీ పొత్తులో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే పైడికొండల మాణిక్యాలరావు దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రిగా పని చేశారు. ఎన్‌డీఏ నుంచి టీడీపీ వైదొలగటంతో కేంద్రంలోని టీడీపీ మంత్రులు, రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో దేవదాయ, ధర్మదాయశాఖను సీఎం చంద్రబాబు తన వద్దే ఉంచుకున్నారు. కాగా, ఆ శాఖను ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తికి అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న శాఖలతోపాటు అదనంగా దేవదాయ, ధర్మదాయశాఖను కేటాయించారు. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పదవికి కామినేని శ్రీనివాస్ రాజీనామా చేయగా, దానిని తాత్కాలికంగా ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడుకు అప్పగించారు. అయితే పూర్తిస్థాయిలో ఆ శాఖను ఎవరికి కేటాయించలేదు.

చంద్రబాబు శ్రీరామనవమి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : అష్టకష్టాలు ఎదురైనా ధర్మాన్ని విడిచిపెట్టని శ్రీరాముడు ఆదర్శనీయుడని, సుపరిపాలనకు ఆయన ఆద్యుడని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారికి ఆయన శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు విళంబి నామ సంవత్సరంలో జన్మించారని పండితులు చెబుతారని సీఎం గుర్తు చేశారు. కోదండరాముడు సమస్యల నుంచి పారిపోకుండా, సంక్షోభాలను ఎలా ఎదుర్కొని విజయాలు సాధించవచ్చో నిరూపించారని ఆయన పేర్కొన్నారు. ధర్మానికి నష్టం వాటిల్లితే ఎంతటి వారినైనా శిక్షించటానికి దశరథ తనయుడు వెనుకాడలేదన్నారు. తండ్రి మాట జవదాటని పితృవాక్య పరిపాలకునిగా రాముడు ప్రసిద్ధుడైనట్లు చెప్పారు. అలాగే తల్లిదండ్రులను గౌరవించే ఉత్తమ సంప్రదాయ, సంస్కారాలను రామాయణం తెలియజేస్తుందన్నారు. అలాంటి రామాయణం నిత్యజీవన పారాయణమని సీఎం పేర్కొన్నారు. శ్రీరాముని కాలంలో ధర్మం నాలుగు పాదాలా నడిచిందని, నెలకు మూడు వర్షాలు కురిశాయని, రామరాజ్యం సుభిక్షంగా ఉండేదని ఇతిహాస కావ్యాలు చెబుతున్నాయని ఆయన గుర్తుచేశారు. కడపజిల్లా ఒంటిమిట్టలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీరామనవమి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని, ఈనెల 30న కల్యాణం జరుగుతుందన్నారు. టీడీపీ అధికారానికి వచ్చాక ఒంటిమిట్ట ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు చంద్రబాబు తెలిపారు.

మహిళలను కించపరిస్తే సహించం : మంచులక్ష్మి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : సినీతారలపై ఓ యాంకర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఓ టీవీ ఛానల్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ యాంకర్ అభ్యంతరకరంగా మాట్లాడారని, ఇలాంటి చర్యలను సహించేది లేదని మంచులక్ష్మి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దీనిని ఇంతటితో వదిలేది లేదని, పబ్లిసిటీ కోసం సినీపరిశ్రమలలో పనిచేసే మహిళలను కించపర్చడం నీచమైన చర్య అని ఆమె ట్వీట్ చేశారు. ఇప్పటికే మా అసోసియేషన్ ఫిర్యాదు చేయడంలో రెండ్రోజులుగా ఈ వివాదం కొనసాగుతోంది.

నేడు ఏపీడబ్ల్యూజేఎఫ్ పదేళ్ల పండుగ

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (ఏపీడబ్ల్యూజేఎఫ్) పదేళ్ల పండుగను సోమవారం విజయవాడలో నిర్వహించనున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల పండుగను పురస్కరించుకుని సోమవారం విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి అలంకార్ టాకీస్ మీదుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ప్రదర్శన, అనంతరం కళాక్షేత్రంలో సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు, జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి పితాని సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొలుసు పార్థసారధి, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులను సత్కరించనున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జర్నలిస్టులకు ట్రిబుల్ బెడ్‌రూమ్ గృహ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆ లక్ష్యాన్ని పరిపూర్తి చేసేందుకు, వారికి పెన్షన్ సదుపాయం కల్పించేందుకు, జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చేందుకు ఈ పదేళ్ల పండుగ కార్యక్రమాన్ని అంకితం చేస్తున్నట్లు చెప్పారు. జర్నలిస్టులంతా ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు.

ఆధార్ డేటా బహు భద్రం

న్యూఢిల్లీ : ఆధార్ సమాచారం చాలా భద్రంగా ఉందని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(ఉడాయ్) పునరుద్ఘాటించింది. పలువురి ఆధార్ కార్డుల వివరాలు, వారి బ్యాంకుల వివరాలకు సంబంధించిన సమాచారం లీకైందని ఢిల్లీకి చెందిన ఓ సెక్యూరిటీ పరిశోధనాసంస్థ గుర్తించినట్లు సదరు వెబ్‌సైట్ వార్తను ప్రచురించింది. ఒక వెబ్‌సైట్ ప్రచురించిన వార్తపై ఉడాయ్ స్పందించింది. ఆధార్ డేటా సురక్షితంగా ఉందని, ఎటువంటి సమాచారం లీక్ కాలేదని ఉడాయ్ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. ఆధార్ భద్రత విషయంపై ఉడాయ్ సీఈఓ అజయ్ భూషణ్ సర్వోన్నత న్యాయస్థానంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన గంటల వ్యవధిలో ఈ వార్తలు రావడం గమనార్హం. ఆధార్ సమాచారం రహస్య రూపంలో నిక్షిప్తమవుతుందని.. దానిలో చొరబడాలంటే ప్రపంచంలో శక్తిమంతమైన సూపర్ కంప్యూటర్‌కైనా కనీసం 1300కోట్ల సంవత్సరాలు పడుతుందని ఉడాయ్ శుక్రవారం సుప్రీంకోర్టుకు వివరించిన విషయం తెలిసిందే.

రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటుంది..

★ 27న కేంద్రంపై అవిశ్వాసం పెడతాం...
★ బీజేపీపై వైసీపీ, జనసేన వైఖరి స్పష్టం చేయాలి
★ మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం



విశాలాంధ్రబ్యూరో-అమరావతి : ప్రజాస్వామ్యన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ఈ నెల 27న కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతోందని మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం వెల్లడించారు. పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ లోక్ సభాపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే స్పీకర్‌కు నోటీసులు అందజేశారని స్పష్టం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాల అమలు కోసం కాంగ్రెస్ రాజీలేకుండా పోరాడుతుందని స్పష్టం చేశారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మొదటి ప్రాధాన్యతగా ఏపికి ప్రత్యేకహోదా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. కేంద్రంలోను, రాష్ట్రాంలోనే కాంగ్రెస్ పుంజుకుంటుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ లేకుండా ప్రభుత్వం ఏర్పాటు అసాధ్యమని జోశ్యం చెప్పారు. ప్రజల నాడి తెలుసుకుంటున్నామని, అందరూ కాంగ్రెస్ బేటరనిని అంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రానికి కాంగ్రెస్ చేసిన సహాయాన్ని ప్రజలిప్పుడు అర్థం చేసుకుటున్నారని చెప్పారు. రాష్ట్రానికి చాలా చేశామంటూ బీజేపీ అధ్యక్షులు అమిత్‌షా చేసిన వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాని మన్‌మోహన్‌సింగ్ కేబినేట్‌లో రాష్ట్రానికి ప్రవేశపెట్టిన హామీలనే..ఇప్పుడు అడుగుతున్నారని స్పష్టం చేశారు. అమిత్ షా నిధుల విషయంలో వక్రీకరించి మాట్లాడారని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడి మట్టినీరు తీసుకొచ్చినప్పడే చంద్రబాబు నోరెత్తి మాట్లాడి వుంటే..నేడు ఈ పరిస్థితి తలెత్తేది కాదని పేర్కొన్నారు. బీజేపీ అధికార దాహంతోనే హామీలను అమలు చేయట్లేదని పేర్కొన్నారు. అవినీతి, వలస పాలనపై చంద్రబాబు పట్టు కోల్పోయారని పేర్కొన్నారు. బీజేపీకి వైసీపి, జనసేనలు ఎందుకు మద్దతిస్తున్నాయో వైఖరి స్పష్టం చేయాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షులు ఎం.జే రత్నకుమార్, అధికార ప్రతినిధి కె.శివాజి, డాక్టర్ గంగధార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు పతనం తప్పదు

దళితులపై దాడులు అరికట్టకపోతే

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ హెచ్చరిక



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టకపోతే ప్రభుత్వాలు పతనం తప్పదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ హెచ్చరించారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం దాసరిభవన్‌లో సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విల్సన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులు, మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు పెరిగాయన్నారు. ఇంతజరుగుతున్నా కూడా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయే కాని చర్యలు తీసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులకు దళితుల పట్ల చిత్తశుద్ధి లేదనడానికి రాష్ట్రంలో గరగపర్రు ఘటనే నిదర్శనమన్నారు. దీనిని మరువకముందే జెర్రిపోతు పాలెం, సుధాపాలెం, గొట్టిపాడు, దేవరపల్లి, నక్కలదిన్నె, పచ్చికాపాలెం, వేలపాడు గ్రామాల్లో ఆడ, మగ అనే తేడా లేకుండా అణగారిన వర్గాలపై దాడులు జరిగాయన్నారు. ఫిర్యాదుల చేసినప్పటికీ టీడీపీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. దాడులను అరికట్టకపోగా 'తెలుగుతేజం' పేరుతో దళితలను ప్రభుత్వం మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పతనం తప్పదన్నారు. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ ఏప్రిల్ 5న జగ్‌జీవన్‌రామ్, మహాత్మ జ్యోతిరావుఫూలే, 14న బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా సమితులను కోరారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును పున: సమీక్షించాలని కోరుతూ అన్ని దళిత సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించాలన్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు మౌలిక వసతులు, మెస్ చార్జీలు పెంచడం, హాస్టళ్ల కుదింపు యోచన మానుకోవాలని కోరుతూ అన్ని జిల్లాల్లోనూ కార్యక్రమాలు జరపాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బుట్టి రాయప్ప, ఎన్ నాగరాజన్, కె ప్రసాద్, కలింగ లక్ష్మణ్, బి వెంకట్రావు, మహేష్, టి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ప్రత్యేక పరిస్థితులపై మార్క్స్ నిశిత పరిశీలన

నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్ అంజయ్య

విశాలాంధ్ర బ్యూరో-కడప : మార్క్స్ భారతదేశ ప్రత్యేక పరిస్థితులపై ఎంతో నిశితంగా పరిశీలన చేసి వాస్తవ నిర్ధారణలను చేశారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ సైంటిఫిక్ సోషలిజం ప్రొఫెసర్ అంజయ్య పేర్కొన్నారు. కడపలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం సీపీఐ 26వ రాష్ట్ర మహాసభల గౌరవార్థం ఆ పార్టీ కడప జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య అధ్యక్షతన 'పెట్టుబడి గ్రంథం-సమకాలీనత' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ అంజయ్య ప్రసంగిస్తూ మార్క్సిజం ప్రపంచ మానవాళికి సంబంధించిన సిద్ధాంతమని, కొందరు విమర్శిస్తున్నట్లుగా మార్క్సిజం యూరప్‌కే పరిమితం కాదన్నారు. పెట్టుబడి గ్రంథాన్ని రచించటానికి మార్క్స్ అపారమైన కృషి చేశారని, ఆ గ్రంథంలో శ్రమ ప్రాముఖ్యత, ద్రవ్యం పెట్టుబడిగా మారే క్రమాన్ని, ఆ క్రమంలో ఉత్పన్నమయ్యే అదనపు విలువ, తద్వారా సంభవించే దోపిడీని శాస్త్రీయంగా నిరూపించారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నేటి హైటెక్ యుగంలో అనేక సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. సాంకేతికత పెరిగినప్పటికీ శ్రమ దోపిడీ మాత్రం మారలేదని, శ్రమ రూపాలు మాత్రమే మారాయన్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడి గ్రంథానికి సర్వకాలీనత ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు మాట్లాడుతూ మార్క్స్ తన పెట్టుబడి గ్రంథం కోసం రాసుకున్న చిత్తు ప్రతులన్నీ ప్రస్తుతం వెలుగు చూస్తున్నాయన్నారు. ఆ చిత్తు ప్రతుల్లో ఆసియా ఖండానికి సంబంధించి ప్రత్యేకించి భారతదేశానికి సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ దోపిడీ ఉన్నంత కాలం పెట్టుబడి గ్రంథం, మార్క్సిజం సజీవంగా ఉంటాయన్నారు. భారత దేశం కులాలుగా విడిపోవడం వెనుక బ్రాహ్మణ భావజాలం ప్రధాన కారణమని మార్క్స్ నిర్ధారణ చేసిన విషయం ఆయన చిత్తు ప్రతులు వెలుగులోకి రావడం ద్వారా నిర్ధారణ అయిందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, పార్టీ నాయకులు చెన్నకేశవ రెడ్డి, నాగార్జున రెడ్డి, కృష్ణమూర్తి, ఎల్.నాగసుబ్బారెడ్డి, జి.చంద్ర, విజయలక్ష్మి, చంద్రశేఖర్, విద్యార్థులు, యువత ఈ సదస్సులో పాల్గొన్నారు.

కేంద్రానికి యూసీలు పంపించాం

* రాజధానికి ఇచ్చింది రూ.1,500 కోట్లు
* రూ.1,578 కోట్లను ఖర్చు చేశాం
* విజయవాడ, గుంటూరులో 42 శాతం డ్రెయినేజీ పనులు పూర్తి
* అమిత్ షా లేఖ అబద్దాల పుట్ట
* క్రీడలశాఖ మంత్రి కొల్లు రవీంద్ర



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : కేంద్రం నుంచి రాజధాని నిర్మాణం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి మంజూరు చేసిన నిధులు, ఖర్చుకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్‌లను (యూసీ) పంపించినా, తమకు అందలేదంటూ కేంద్రం అబద్ధాలు చెబుతోందని యువజన సర్వసులు, క్రీడలశాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేవలం రూ.1,500 కోట్లే ఇచ్చారని, విజయవాడ, గుంటూరు నగరాలల్లో డ్రెయినేజీ నిర్మాణానికి ఇచ్చిన రూ.వెయ్యి కోట్లను కూడా రాజధానికి ఇచ్చినట్లుగా చెప్పటం హాస్యాస్పదమన్నారు. రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం రూ.1,578 కోట్లను ఖర్చు చేసి, యూసీలను కూడా పంపించిందంటూ ఆధారాలను చూపించారు. విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, కేవలం ఎనిమిది శాతం ఖర్చుకు సంబంధించిన యూసీలే వచ్చాయని అసత్యాలను ప్రచారం చేస్తోందన్నారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో డ్రెయినేజీ నిర్మాణ పనులు 42 శాతం పూర్తయినట్లు తెలిపారు. 2019-20కల్లా మిగిలిన పనులన్నీ పూర్తవుతాయన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు రూ.1,050 కోట్లను కేంద్రం విడుదల చేయగా, 92 శాతం పనులను పూర్తి చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించి రూ.946.47 కోట్లకు యూసీలను పంపించామన్నారు. రాజధాని నిర్మాణంతోపాటు వెనుకబడిన జిల్లాల్లో జరిగిన ఖర్చుకు సంబంధించిన యూసీలను అవసరమైతే మళ్లీ పంపిస్తామన్నారు. ఇదిలావుండగా, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం నాలుగో విడత మంజూరైన రూ.350 కోట్లను కేంద్రంలోని బీజేపీ ఉద్దేశపూర్వకంగానే వెనక్కి తీసుకుందని విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు విడుదల చేసే నిధులను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచామని చెబుతుండగా, రాష్ట్రానికి కేవలం 37 శాతం నిధులు అందినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా సీఎం చంద్రబాబు ఎంతో ఓపికగా ఎదురు చూశారని, రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చూడలేకే ఎన్‌డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాసిన లేక పూర్తి అబద్దాలతో కూడి ఉందన్నారు. ఆర్థిక లోటుకు సంబంధించి 2016-17లో ఒక్కపైసా ఇవ్వలేదని రవీంద్ర వివరించారు.

ఆధునిక తెలుగుపద్యపు చమత్కారం 'ఓటరన్న శతకం'

డా॥ ఇనగంటి భాగ్యరేఖ
✆ : 93911 82787

పద్యం హృద్యం. కోయి కోటేశ్వరరావు చేతిలో ఆటవెలది 'ఓటు' గజ్జె కట్టి ఘల్లుమంది ఈ ఓటరన్న శతకంలో.

తెలుగువారికి కొన్నేళ్ళ తర్వాత పద్యం మీదకు మనసు పోయింది. ఛందస్సులో లయఉంది కాబట్టి ధారణకు అవకాశం ఉంది. ఈ శతకంలో కోయి కోటి తెలుగువారికి ఎన్నికల ఎరుక చెప్పాడు. తన పద్యశైలి ఎలాంటిదో 'ఎల్లజనుల కిపుడు ఎన్నికల ఎరుక సులభ సుందరముగ కలుగజేసి చాటునిజము' అంటూ చివరి పద్యంలో వివరించాడు.

శతకం పాత ప్రక్రియే కావచ్చు, సంఘ సంస్కరణకు మంచి ఆయుధం. సామాజిక, చారిత్రకాంశాలను, సాంఘిక అవినీతులను ఎండగట్టి నీతిచాటే పదునైన వాదనగల కత్తి. రాజకీయ కల్మషాన్ని దుయ్యబట్టడానికి, ప్రజలలోని అశ్రద్ధ, అజ్ఞానాన్ని తుడిచిపెట్టేందుకు తెలుగుపద్యాన్ని చురకలా చేతబట్టాడు.

స్టేట్‌మెంట్స్: పద్యంలోని రెండు పాదాలు ప్రస్తుత సమస్య. ఐతే, మూడోపాదం కొసమెరుపై ఒక నీతిని, బోధను, కవిచెప్పే శాసనంగాను నిలిచింది. ఈ స్టేట్‌మెంట్ (శాసనం) పద చమత్కారంతోనో, అర్థచమత్కారంతోనో తళుక్కుమంటుంది.

సాహితీ చమత్కారం : ఈ స్టేట్‌మెంట్ వాక్యాలలో సాహితీ చమత్కారం తొణికిసలాడుతుంది. 'గతము మరిచిపోవు గజనీలు మనకేల' అనడంలో చటుక్కున గజనీ మహమ్మద్ చేతిలో మోస పోయిన ఫిరదౌసీ కవి, అతని షానామాకావ్యం గుర్తుకొస్తాయి. గజనీ వాగ్దానం అక్షరలక్షలు. మన నాయకులు కూడా ఇలాగే ప్రజాహితంగూర్చి వాగ్దానాలుచేస్తారు. 'కత్తికేమితెల్సు? గాయాల కుశలమ్ము', అందరూ నడువవలె 'సుందర' మార్గాన పుచ్చలపల్లి సుందరయ్య చాటిన సోషలిజాన్ని జ్ఞప్తికి తెచ్చాడు. 'వేలుగుంజు వరకె వేశ్యల వలపులు', 'కౌరవులనె గెలిచె బృహన్నల నాడు' (హిజ్రాలకు ఎన్నికల్లో పోటీకి అవకాశం ఉండాలంటాడు). నీరు దేవుడెరుగు నిధులు నేతలెరుగు' నంటూ ప్రాజెక్టులు కడతామని చెప్పే నాయకుల క్రియారాహిత్యం గురించి చెప్తాడు. నీరుపల్ల మెరుగు, నిజము దేవుడెరుగు సామెతకిది అనుసరణే ఐనా ఒక కొత్త సామెతగా సాహిత్య చమత్కృతి అయింది. ఓటు అమ్ముకునే వారిని 'అతనికంటె మిన్న ఆచంట మల్లన్న' అంటాడు. ఛందస్సు కోసం కాస్త అక్షరరూపం మార్చుకొన్న సామెతయిది.

ఓటుకోసం ఆశలు చూపే వారి గూర్చి 'ఓటు చింతకాయ పాటకురాలునా?'అంటాడు. ఒకనాడు బ్రిటిష్ వారి హేతువాదంలో భారతీయసంస్కృతిని హేళనచేస్తూ 'మంత్రాలకు చింత కాయలు రాల్తాయా' అన్న నుడి ఉంది. దీన్ని ఎంతో చక్కగా ప్రయోగించాడు. పాడితే శిలలైనా కరుగుతాయంటారు. పార్టీలవారి పాటకు ఓటు చింతకాయ రాలదంటాడు.

భాషకానరాని నాయకుల వాగ్దానవర్షాల గురించి 'పిండి కొద్ది రొట్టె దండిగా సమకూరు' నంటాడు. 'తలచునా గురువింద తనకింద నలుపును?' అన్న తెలుగుసామెతతో అవినీతి పాలకు లను ఎండగట్టాడు. నేరచరిత లేనంతమాత్రాన ఆ నేతలంతా ధర్మపరులు కారంటూ – 'మేకవన్నె పులులు లోకాన ఎందరో' అన్న సత్యనిరూపణ చేశాడు.

నిజమైన అభ్యర్థికి ఎన్నికల్లో సీటు రాదంటూ – 'నంగనాచి కెరుక? ముంగిట ముత్యమ్ము' అనే ప్రాసవాక్యంలో మంచి అభ్యర్థుల్ని ముంగిట ముత్యాలంటాడు' పార్టీ అధిష్ఠానాలు నంగనాచులు అని గేలిచేశాడు. ఎంతో పదునైన మాట ఇది. ఈ శతకంలో కవి భాషను పదునుగా వాడాడు.

పదునైన ఓటు ఆయుధాన్ని ప్రజలకు వాడుకోటం తెలీదు. వంకరబుద్ధి ఉన్న నాయకులకే ఓటేసి గెలిపించె ఈ వెఱ్ఱి ప్రజలని 'కొరివితోడ తలను గోక్కున్న ఫలమేమి?' అని ప్రశ్నిస్తాడు.

డబ్బు ఎరవేసి రేసుగుర్రాలపై కాలుదువ్వే వారి విషయం ఎలా ఉందంటే – 'ఊరకుక్కలాట ఊరిలో పెళ్ళికి' అన్నట్లు (ఇది ఊళ్లో పెళ్ళికి కుక్కల హడావిడి అనే సామెత). చీరెలు సారెలు వంటి వస్తువులు, ఉచిత భోజనాలు ప్రచారకులకు పెట్టేవారిని 'అల్పనేతలైన కల్పతరువులగు' అంటూ మంచి జాతీయంతో సూచించాడు. ఇది ఇతిహాస పరాజ్ఞానమే కాని దీని వెనుక స్వతంత్రం వచ్చి ఇన్నేళ్ళయినా మిగిలిపోయిన కరువు పీడని సూచిస్తున్నాడు. ఇటువంటి జాతీయాల వాడకం వల్ల సులభంగా ప్రజలకు కవి చెప్పే సందేశం చేరింది.

ఇక ఈ ఓటరన్న శతకంలో ఐతిహ్య ప్రమాణాలు చాలా చోటుచేసుకున్నాయి. 'భీముని గదకన్న, రామబాణముకన్న, కత్తికన్న, మిషనుగన్ను కన్న, భవ్యమైన ఓటు వజ్రాయుధము మిన్న'అంటాడు. భీమునిగద, రామునిబాణం, కత్తి, వజ్రాయుధం ఇతిహాసకాలపు వస్తువులు. ఇక ఆధునికంగా వచ్చి చేరిన మిషనుగన్ను ఇవన్నీ చాలా దృఢమైనవి. ప్రజలచేత ఓటు అనే ఆయుధాన్ని పోల్చేందుకు మరేదీ దొరకలేదు. ఒక్క వజ్రాయుధమే చూపించబడింది.

చిన్నతనంలో శైశవదశలో పిల్లలు లోకం తెలీక తప్పొప్పులు తెలీని వయసులో తాయిలాలు దాచుకుని రహస్యంగా తింటారు. తాయిలాలు, కాకెంగిళ్ళు పిల్లచేష్టలు. పెద్దయినా అదే అలవాటుందంటే నిరుపేదరికం, పారద్రోలలేని నిరుద్యోగం, నిస్సహాయతలే దీనికి కారణం. ఓటర్లు తాయిలాలు మరిగి (లంచాలు) మోటుగా ఓటు వేయరాదు.దానికి ఒక సాహిత్య చమత్కారం తగిలించాడు. 'ఎరను మింగినచేప, ఏమాయె చివరకు' అంటూ పంచతంత్రపు కథను జోడించాడీ 'సూరి'. మాజీనేరగాళ్ళు కూడ తాజాగా నేతలైనప్పుడు హిజ్రాలు నాయకులైతే తప్పేంటని,వారి సామర్థ్యాన్ని గౌరవిస్తూ 'కౌరవులనె గెలిచె బృహన్నలనాడు' అనటంలో పౌరాణికాంశాలను చక్కటిదృష్టాంతాలుగా వాడుకోవటం సాహిత్య చమత్కారమే.

పదచమత్కారాలు–కొత్త పదప్రయోగాలు : ఈ శతకశైలిలో ఆ పదాలు పలుకగానే చిరుహాస్యంగా కలుగుతుంది. కల్లిబొల్లి మాటలు చెప్పే నేతల గూర్చి 'మేలు చేయవెపుడు మేకప్పు మాటలు' అంటాడు. ఇక చిచ్చుబుడ్డి ఒక్కసారిగా దూసుకొచ్చి చెప్పలేని వెలుగు, సంతోషం చిమ్మి నిమిషంలో నిశ్శబ్దమౌతుంది. చడీచప్పుడు ఉండదు. హీరోలంతా రాజకీయాల్లోకి అలాగే హంగామాగా దూసుకొచ్చి ఒక వెలుగు వెలిగి హఠాత్తుగా వెనుకబడటాన్ని – 'చిచ్చుబుడ్డి నిజము సినిమా హీరోయిజము' అనటంలో ఓ కొత్త చమత్కారం ఉంది. ఆడినమాట తప్పే గోముఖవ్యాఘ్రాల గూర్చి 'ప్రేమతత్వ మహిమ పెద్ద పులికెరుక?' అనటంలో పాఠకునికి



కథాసాహిత్యం స్ఫురిస్తుంది. 'పులి– బంగారుకడియం' లాంటి నీతికథలు స్ఫురణకొస్తాయి. ఆవు– పులి కథలో పులిమారింది కాని ఈ రాజకీయ పులులు మారవు. ఇదొక భావచిత్రం. ప్రేమతత్వం అమాయక ప్రజలకి సంకేతం అయితే ఇది సింబాలిక్ ఆర్ట్ లాంటిదన్నమాట.

ప్రజలముందు బాగా పనిచేస్తామని చెప్పి పార్లమెంటులో తీరా నోరెత్తలేని నాయకులను 'ఆవులింతకైన అసలు నోరెత్తరు' అంటాడు. చెడ్డనాయకుల పట్ల 'రీకాల్' ప్రయోగించాలంటూ– 'ముల్లుగర్ర లేక ముందుకు పోదెద్దు' అన్న పాలనా వ్యవసాయానికి దారి నిర్దేశించాడు.

విద్యార్థులకు రాజకీయాలు అవసరం. కాబట్టి వారు రాజకీయాలలో ఉండాలని ఉపన్యసిస్తాం కానీ ఆచరణ ఏది? రాజకీయాలు బురదలాంటివి వాటి జోలే వద్దనే యువతని ఖండిస్తూ 'బురదనీటిలో విరియదా పద్మమ్ము?' అనటంలో సాహితీగంధం కనబడుతుంది. పంకములో పుట్టదా పరిమళపు దామర అని అన్నమయ్య కూడా అన్నాడు.

తెలుగుపద్యం–హాస్యం: సులభశైలిలో రాసినా వ్యంగ్య, చమత్కృతులు కోయి కోటేశ్వరరావు కలంలో పెనవేసుకున్నాయి. వికటాట్టహాసాలకు దారిలేదు కానీ సుస్మితహాస్యాన్ని రుచి చూపించాయి. సీట్ల పంపకాల పొత్తుల గూర్చి – 'జాతకాలు మార్చు జంపు జిలానీలు' అంటాడు.

సీటు రాని నాయకుల బెదిరింపులను గూర్చి – 'పదవి ముందు చావు పలుచనై పోయెను','ఎన్నికల్లో డబ్బు ఎరవేసే వారిని గూర్చి – 'ఓటు కూడ మనకు ఏటియమ్ సుఖమిచ్చు' నంటాడు. ఊరువాదా తిరిగి ఉత్తమ నటనతో ప్రజల్ని హత్తుకునే వారిపై 'దిండుకౌగిలింత తీర్చునా ప్రణయార్తి' అని రసచమత్కారాన్ని రంగరించాడు. గద్దెకు అతుక్కుపోయే వారికి – 'పడక సుఖము కన్న పదవి సుఖము మిన్న' అట! రిగ్గింగ్‌లకు పాల్పడిన వారిని–'అత్యాచార సుఖము ఆనందమిచ్చునా' అనడుగుతాడు. రోడ్డు చిమ్మినట్లు ఫోజులిచ్చే వారి సేవానిరతిపై – 'నాయకుల మించు నటరత్నలెవరింక' అని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. పార్టీలో నిలబడేందుకు సీటులిచ్చినా సంతోషం మిగలకపోవడానికి కారణం– 'గుండెపోటు వచ్చె నిండిపెండెంటుతో' అని అసలు రహస్యం చెప్పి నవ్విస్తాడు. దొంగనాయకుల్ని – 'విశ్వశాంతి గూర్చి వీరప్పనెరుగునా?' అని రాజకీయపు చణుకులు రుచిచూపించాడు.

కోటి తన పద్యాలలో అనేకరకాలుగా చమత్కారాన్ని సాధించాడు. అన్యదేశ్యాల వాడకం వల్ల, రాజకీయసత్యాలను పేర్కొనటం వల్ల, తూగు లయవాక్యాల వల్ల, పాత సామెతలు– కొత్త సామెతల సృజనవల్ల, అచ్చ తెలుగు జాతీయాలు నుడికారాలు సందర్భోచిత వాడకం వల్లా, రస, అర్థ చమత్కారాలు సాధించాడు. ఇతని శైలి పాలిటిక్స్ పదునేకాదు పద్య చమత్కారాలతో నిండి ఉంది. కోటి పద్యం హృద్యం. 'బ్రతుకు వచ్చుగాక బహుబంధములనైన..' అనే పద్యాన్ని తలపుకు తెచ్చే పద్యమిది. –

'బ్రతుక వచ్చునెపుడు భార్యకు దూరమై
కొలువు లేక భువిలో నిలువలేరు
అష్టమ వ్యసనము అధికార దాహమ్ము
ఉన్నమాట వినర! ఓటరన్న' – చాలా చమత్కార పద్యమిది.

సప్తవ్యసనాలు తెలుగువారి అష్టమ వ్యసనం కనిపెట్టాడీ కవి.

కవిబోధ: ఓటు విలువ ప్రజలు తెలుసుకోవాలంటాడు. రాజకీయ పరిజ్ఞానం తప్పనిసరి, ప్రజల బాధ్యతది. 'రాజకీయ మన్న రంగుమార్చుటె కదా!' అని వాపోతాడు. హద్దులేని హామీల సాగరాల వల్ల లాభం లేదంటాడు – 'ఉప్పునీరు దప్పిక తీర్చునా?' 'గడ్డిమేసే కాడ గజదొంగలే అంత', 'ఎన్నికల వరాలు ఏప్రిల్ పూలురా' అంటాడు. 'ల్యాపుటాపులోన సాపాటు దొరకునా' అంటాడు. 'కళ్ళజోడు లేక కనులకు దిక్కేదని జాగృతం చేస్తాడు. ఉత్తములైన నాయకులుండాలని 'మంచి వైద్యులున్న మంత్రసానులు సున్న' అని మంచి దృష్టాంతం చెప్పాడు. మాటల్లో మద్యనిషేధం చెప్పి ఎన్నికల్లో దాన్ని ఏరై పారించేవారు 'అదనుచూసి నడుచు అవకాశవాదులు' అని తెలివినేర్పుతున్నాడు. ఓటుమిషన్ పనితీరుని 'మిషనులోన ఎంత మిషదాగియున్నదో?' నంటాడు. 'రక్షక భటులందు రౌడీలు దాగుండు'నని పొగరుబోతు లాఠీలను గూర్చి జనులకు జాగృతి నేర్పాడు. 'పుచ్చ కూరగాయ మెచ్చునా? మన ఆత్మ' అని మచ్చలేని నేతలనే ఎన్నుకోమంటాడు. గ్రామీణాభివృద్ధి వదలి పట్టణాల కొంగుపట్టిన వారిని 'పాదుచెడిన ఎడల బ్రతుకునా వృక్షమ్ము' అని నీతిబోధ చేశాడు. మంచి నేతలనే ఎన్నుకోవాలి 'పెన్నుకైన మన్నిక చూడమా?' అని కొత్త నుడికారాలు వాడాడు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నిలపాలి. ఓటు వేయకపోవటం సరైనపని కాదని 'నీరు లేక తరువు నిలుచునా పుడమిలో' అని ప్రజాస్వామ్యవృక్షాన్ని కాపాడమంటాడు. నాయకుల పరస్పర దూషణలని 'వరదలెక్కువైన బురదంతదరిచేరు'నని హెచ్చరించాడు.

జాతీయాలు: ఉచిత సేవలు చేస్తామని నేతలు పదవిపొందగానే 'పెదవి విరుచు'నట. గోహింసవద్దనే 'గోముఖ వ్యాఘ్రాలు' లౌకికతను 'కేకపెట్టు', 'తినమరిగిన పులి', మేకవన్నెపులులు, కొరివితో తలగొక్కోటం, తోలుబొమ్మలాట, దీపమార్పు, పిండి కొద్ది రొట్టె, కొంగుపట్టి, నంగనాచి, ముంగిట ముత్యమ్ము, వక్రబుద్ధి, కల్పతరువు, అదనుచూసి, అవకాశవాది, పాదాలు నరుకు, గర్భకుడి, అర్భకుడు, కుంభవృద్ధి, కనికట్టు .. ఇలా అడుగడుగునా తెలుగు నుడికారమే.

అనువాదపదాలు:నలుపులక్ష్మి (బ్లాక్‌మనీ) లాంటి పదాలూ వాడాడు.

అన్యదేశ్యాలు: హీరోయిజమ్, టైటనియం, పాస్‌పోర్టు, రౌడీలు, ఏటియమ్, ఫెవికాలు పగిది, మాజీ నేరగాళ్ళు, తాజా నేతలు, వారెంటు, తూట, సారి, రీకాలు, రిగ్గింగ్, పెయిడు వార్త, పాలిటిక్సు, మానిఫెస్టో, ల్యాపుటాపు, సాపాటు, ఏప్రిల్ పూలు, అఫిడవిట్టు, పార్టీ, సీటు, ఎక్సైజుటాక్సు, పోలు, సర్వేలు, శాంపిలు, మతలబులు, బుకీలు, రేసుగుర్రాలు, చికెను టోకెనులు, పెట్రోలు ఖర్చు, గల్లపట్టి, క్రేజు, మాజీనేత, ఫోటోకార్డు, లిస్టు, గవర్నెన్సు, ఓటుమిషను, బీపు శబ్దము– ఇవన్నీ శబ్ద చమత్కారం సాధించాయి ఈతని శైలిలో.

ఈ అన్నిటికన్నా దళితవాదం, స్త్రీవాదం కూడా సందర్భానికి అతికి కనిపిస్తున్నాయి. – మహిళాబిల్లు దీపమార్చిన నేతలు స్త్రీలకు మేలు చేయలేరు– 'పరుగు సాగుటెట్లు పాదాలు నరికిన?' అన్నాడు. ఓటర్లు తమ ఓటుసు సద్వినియోగం చేయాలని ఓటువేయడం ప్రజాస్వామికమని బోధచేసిన పద్యాలు బాగున్నాయి. చదివిన వారికి వెంటనే భావం స్ఫురించే పద్యాలివి. అన్వయ క్లిష్టత లేదు.

కోటి నోటి ఓటు పాటకి, ఆటవెలది బాగా నర్తించింది. ఇతని విమర్శ కూడా సద్విమర్శగానే ఉంది, కాఠిన్యతలేదు. సమకాలీన రాజకీయాలకు ఇది నిలువుటద్దం. శతక ప్రక్రియలో రాజకీయ చరిత్ర రచనకు ఇది కొత్తమార్గం.


ఈ శతకానికి ముందు మాటలేదు. అంబేద్కర్ నిర్వచనం, జాషువా, కాళోజీల కవితలే పరిచయ వాక్యాలు. నూట ఎనిమిది పద్యాల్లేవు. సంఖ్యానియమంలో ప్రాచీన నియమంలేదు. శత అంటే వంద. వందంటే వందే పాటించాడీ కోటి. లెక్కలు ఖచ్చితం. గతంలోని జర్నలిజం అనుభవం వల్ల కోటి శైలిలో పాత్రికేయ భాష, శైలి, తెలుగువాడుకలో జీర్ణించుకుపోయిన అన్యదేశ్యాలు విరివిగా అగుపిస్తాయి. ✪

కవితల పూలబొకే 'మాటముల్లు'

కవితని పుష్పంతో పోల్చడానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు అనుకుంటున్నా. సౌందర్యానికి, సౌకుమార్యానికి, రెండూ రెండే. పూలది పరిమళం. కవితలది భావ పరిమళం. రెండూ ఉత్సాహాన్ని, ఉల్లాసాన్నిచ్చేవే. కాకపోతే కవితకి ప్రత్యేకం చైతన్యం. ఒక్క పువ్వే ఆహ్లాదం కలిగిస్తే మరి పూలబొకే సంగతి చెప్పాలా? ఏ కవితా సంపుటైనా పుష్పగుచ్ఛమే! అరవైఏడు కవితల పూలబొకేని కవి గుర్రాల రమణయ్య పాఠకలోకానికి "మాటముల్లు" పేరిట అందించారు.

ఈ సంపుటిలో ఎన్నో అంశాల్ని కవి తీసుకున్నాడు. కవితలుగా మలిచాడు. వార్ధక్యపు బతుకు నడకకి చేతికర్ర లాంటిది పెన్షన్. "పింఛను" అనే కవితలో ఈ కవి, వృద్ధాప్య పెన్షన్ కోసం ఆఫీసు ఆవరణలో పడిగాపులు పడే ఒక ముసలావిడని కవితా వస్తువుగా స్వీకరించాడు. ఆ విధంగా తన సామాజిక స్పృహని బాధ్యతని చాటుకున్నాడు. ఇలాంటి సంఘటనలు తరచు పత్రికల్లో వచ్చే వార్తాంశాలే. వీటిని కవిత్వీకరించే క్రమంలో వార్తకి కవితకి వ్యత్యాసాన్ని కవి సాధించాలి. ఇక్కడే ప్రతిభ పాత్ర కనబడుతోంది.

"ఎండైనా వానైనా, ఆమెకు చెట్టే గొడుగు, తామరాకు మీద నీటిబిందువుల్లా, ఆమె కనుకొలుకుల మధ్య తడి ఆరదు. ఆ బుగ్గల మీది చార కూడా, ఆమె పురాతన నిరీక్షణను చెబుతున్నట్టుంటుంది. ఒక గాయాల గుండె ముల్లెను విప్పినట్లుంటుంది. ఎంతకీ పిలుపు పిలుపురాదు.." అని సాగుతుందీ కవిత.



"వాతావరణ కాలుష్యం గురించి కాదు, సంస్కృతీ కాలుష్యం గురించి చింతించాల్సిన సమయం" అని చెబుతూ కవి కన్నవారిని వృద్ధాశ్రమాలకి పంపే దుష్టసంస్కృతిని నిరసించాడు. "జీవితానుభవాల సంకలనాలన్నీ, తాళపత్ర గ్రంథాల్లా మరుగున పడిపోతున్నాయి. అనుబంధాల చందమామ కథలన్నీ, వృద్ధాశ్రమాల పంచన సేద తీరుతున్నాయి" అని అంటారు. ఇక్కడ 'సేద తీరడం' అన్నమాట కంటె మరోమాట వాడి ఉండాల్సింది.

"వాకిలి" శీర్షికగా ఉన్న కవితలో కవి "అడుగుల సవ్వడి వినబడితే చాలు, రెండు హృదయ కవాటాలు తెరిచేస్తుంది. కోటగుమ్మంలో వెలిసినా గుడిగుమ్మంలో ఒదిగినా, వాకిలెపుడూ ప్రజల పక్షమే!" అని అంటారు. ప్రజల పక్షాన నిలబడటమే కవికైనా, కవితకైనా, మరెవరికైనా పరమావధి కావాలి..ఆ ఎరుక కలగాలి!

సుధామ 'వర్టిగో' రోగం మీద కవిత రాశారు. ఎండ్లూరి సుధాకర్ 'మధుమేహం గురించి హాస్యంగా రాస్తూ..'నన్ను కుట్టిన దోమైనా తేనెటీగై ఎగిరిపోతుంది' అంటారు. శ్రీరమణయ్యగారు రక్తపోటు గురించి రాస్తూ "ఇంటికి వీధిపోటు లాంటి వైనం, మనిషికి రక్తపోటనే ఈ రోగం, చావనీక బతకనీక వాద్యం లేకుండానే, పాడుకుంటుంది నిత్య చావుగీతం" అని చెబుతారు.

మనకోమాట ఉంది..! నలుగురితో చావు పెళ్ళితో సమానం! ఈ కవి ఒకచోట "ఎందుకో చావంటే భయం పోయింది, అందరిలాగే నేనూ చచ్చిపోతానన్న ధైర్యం". లాజిక్కు బావుంది. 'లోలకం' అన్న కవితలో "తననెదిరించే ధీరుల వెనుక, తోక ముడిచిన కాలం నిరంతరం, కుక్కపిల్లలా వెంట నడుస్తోంది." 'వహ్వా' అని అనకుండా ఉండలేం కదా!

పురపాలక సంఘాన్ని ఈ కవి "పుర కాలుష్య సంఘం" అని సంబోధించారు. కవి సమ్మేళనాల్లో ఈ మాట వినిపిస్తే చప్పట్లు మోగడం ఖాయం. మరోచోట, కన్నీళ్ళు వెచ్చగా ఎందుకుంటాయో చెబుతూ కవి "గుండె అగ్నిపర్వతం ఎగజిమ్మిన లావా కాబట్టి, ఎంతో రగిలి పొగిలి ఉబికి వస్తాయి కాబట్టి" అని అన్నారు. 'ఫోటో' అన్న కవితలో ఇలా అంటారు. 'నా తర్వాత తరానికి, నేను బతికున్న రుజువు పత్రం నా ఫోటోనే కదా!' ఈ సంపుటిలో వర్షంపై ఒక కవిత ఉంది. వర్షంలో తడవని వ్యక్తి ఉండనట్టే, వర్షంపై కవిత రాయని కవి అంటూ ఉండడేమో! ఈ కవి దృష్టిలో వాన ఇలా ఆవిష్కరించబడింది..'నదీ దేహంలో సుతారంగా, వాన తుంపర, అలల వీణపై కలకల గానం, కొండకి తలంటు పోసే అమ్మవాన మనిషి జీవితోత్సవంలో నర్తించే జాణ"

నల్లిపై కూడా ఈ కవి ఒక కవిత రాశారు. దేనిపైనైనా కవిత రాయడం ఈ కవికి నల్లేరుపై నడక లాగనిపిస్తోంది. కాకపోతే అల్లిక విషయంలోనే కాస్త జాగ్రత్త పడాలనిపిస్తోంది.

ఈ 'మాటముల్లు' కవితా సంపుటికి శివారెడ్డి 'చివరికంటా' అని ముందు మాట రాశారు. దీన్లో 'కవిత్వం చదివేటప్పుడు' 'చెవి' 'ఊహ' ప్రధాన పాత్ర వహిస్తాయని ఒక పాశ్చాత్య విమర్శకుడి మాటని ఉటంకించారు. 'హృదయానికి చెవులుంటే జగమంతా నాదమయం..' అని ఇదే భావాన్ని మన సినారె ఇంకా బాగా చెప్తారు ఒక చిత్రగీతంలో ఎప్పుడో.

చివరిగా ఈ పుస్తకం చేతిలోకి తీసుకోగానే ముందుగా కనిపించే ముఖచిత్రం గురించి..'బ్రహ్మజెముడు కంచెపై పుష్ప వికసనంలా 'చంద్రోదయం' అన్న శ్రీరంగం నారాయణబాబు కవితా పాదాన్ని గుర్తు చేస్తూ..పూలు వికసించిన బ్రహ్మజెముడు ఫోటోగ్రాఫ్! లోకంపై సర్రియలిస్టిక్ ఎక్కిరింతలా ఉంది ఆ బొమ్మ!

'కవిత్వమంటే చీకటిలో వెలిగించిన దీపం'అని అంటారు శ్రీరమణయ్య. ఈ కవి ఇలా దీపాల్ని వెలిగిస్తూనే ఉంటారని వెలుగులు నింపుతూనే ఉంటారని భావిస్తున్నాను.

మాటముల్లు–శ్రీగుర్రాల రమణయ్య,
పుటలు:144, వెల: వంద రూపాయలు,
దొరుకుచోటు: శ్రీగుర్రాల రమణయ్య, ఇంటినెం: 628, లెక్చరర్ కాలనీ, మాగుంట లేఅవుట్, నెల్లూరు–524003
సెల్‌నెం: 9963921943

–ఎస్. హనుమంతరావు, ✆ : 8897815656

సాహితి

దేశదేశాల కవితా రహస్యం

జర్మన్ కవిత్వం: బెర్టోల్ట్ బ్రెష్ట్




యుద్ధ సమయం
సాన్ కార్లో – ఇటాలియన్ జైలు సెల్,
బందీలైన సైనికులు, తాగుబోతులు, దొంగలతో
నిండిపోయి కిటకిటలాడుతూ ఉంది

ఒక సోషలిస్ట్ భావాలుగల
సైనికుడు
తన దగ్గరున్న చిన్ని పెన్సిల్‌తో
'లాంగ్ లివ్ లెనిన్' – అని
గోడను తొలిచి, అక్షరాలు చెక్కాడు


వెలుతురు సరిగాలేని ఆ సెల్ గోడమీద
పైన ఎక్కడో ఉన్న ఆ చేతిరాత,
మామూలుగా అయితే ఎవరికీ సరిగా కనబడదు
అక్షరాలు పెద్దవయినందువల్లా
గస్తీ తిరుగుతున్న జైలు అధికారి
దూరం నుండి చూసినందువల్లా
పోల్చుకున్నాడు–
ముఖం ముటముటలాడిస్తూ
వెంటనే సున్నం వేసే వాణ్ణి పిలిపించాడు

కర్రకు కట్టిన పొడుగాటి బ్రష్‌తో
అతను ఆ గోడమీద
వణికించే ఆ అక్షరాల వెంట బ్రష్ తిప్పాడు
కాసేపట్లో అక్షరాలు మాయమైపోయాయి
కాని, సున్నం ఆరిపోయిన తర్వాత,
మరుసటి రోజు ఉదయానికి చీకటిగదిలో
'లాంగ్ లివ్ లెనిన్' అక్షరాలు
తెల్లగా, స్పష్టంగా, అందంగా కనిపించసాగాయి
సమావేశమైన జైలు అధికారుల అసహనం
అంచులు దాటింది
తాపీమేస్త్రీని పిలిచి, లోతుగా చెక్కిన ఆ అక్షరాల్ని
ఇటుకతో పూడ్చేయమన్నారు.
కొన్ని గంటలు శ్రమించి
మేస్త్రీ అక్షరాల్ని పూడ్చేశాడు
అక్షరాల రంగు మారింది, కాని..
అక్షరాలు ఎర్రగా దేదీప్యమానంగా
మరింత కొట్టొచ్చినట్లు కనపడసాగాయి
అవే అక్షరాలు–'లాంగ్ లివ్ లెనిన్'!
చేతిరాతని చెరపలేక పోయామని
జైలరు ఉక్రోషంతో ఊగిపొయ్యాడు

ఆ గోడని–పడగొట్టండని.. ఆర్డరు వేశాడు!



యూజెన్ బెర్తోల్ద్ ఫెడరిచ్ బ్రెష్ట్ (10 ఫిబ్రవరి 1898– 14 ఆగస్టు 1956) జర్మన్ నాటక రచయిత, ప్రయోక్త, కవి. మార్క్సిస్టు ఆలోచనావిధానంతో తన రచనల్ని జనంలోకి తీసుకుపోయిన మేధావి. వైవిధ్యభరితమైన సంకేతాలతో వెలువడే ఆయన కవితావాక్యం ఎంతో బలమైనదని విమర్శకులన్నారు. నాజీల కాలంలో, రెండవ ప్రపంచయుద్ధ సమయంలో స్కాండినేవియా, అమెరికాలలో రహస్య జీవితం గడిపి, తూర్పు బెర్లిన్‌కు తిరిగి వెళ్ళారు. అక్కడ 'బెర్లినేర్ ఎన్ సింబల్' పేరుతో తన రెండో భార్య హెలెనీ వైజెల్‌తో కలిసి నాటక కంపెనీ ప్రారంభించారు. ఆమె ఆనాటి ప్రఖ్యాత నటి. వారి ఆధ్వర్యంలో ఆ కంపెనీ చాలా కాలం పనిచేసింది. బ్రెష్ట్ పదిహేడో యేట (1915) రాసిన వ్యాసంలోని ఒక వాక్యం ఆయన చదువుకునే స్కూలు యాజమాన్యానికి కోపం తెప్పించింది. స్కూల్లోంచి పేరు తొలగించి, బ్రెష్ట్‌ను ఇంటికి పంపే సన్నాహాలు జరుగుతున్నప్పుడు ఒక ఉపాధ్యాయుడు జోక్యం చేసుకోవడం వల్ల ప్రమాదం తప్పింది. ఆయన చదువుకొనసాగింది. అయితే ఆయన ఆ మరుసటి సంవత్సరం నుండే విరివిగా పత్రికలకు రాయడం ప్రారంభించారు.1925లో తను చూసిన చార్లీ చాప్లిన్ – 'గోల్డ్ రష్', ఏ సన్‌స్టేయిన్, 'బ్యాటిల్‌షిప్ ఆఫ్ పొటమ్‌కిన్' సినిమాల వల్ల ఆయన చాలా నేర్చుకున్నారు. జర్మనీ రంగస్థల దిగ్గజంగా రూపొందడానికి ఆయనకు అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. సరికొత్త విషయం చెప్పాలనుకున్నప్పుడు, నాటక ప్రక్రియలో సరికొత్త మార్పులు చేసుకోవాలన్నది, సరికొత్త ప్రతీకలతో శైలి కూడా మార్చుకోవాలన్నది ఆయన ఉద్దేశంగా ఉండేది.



1934లో వెలువడ్డ ఈ బ్రెష్ట్ కవిత – ప్రజాజీవితంలో లెనిన్ ముద్ర ఎంత గాఢంగా ఉందన్నది వర్ణించింది. గోడ పడగొట్టించి లెని'నిజాన్ని' పడగొడదామనుకున్నాడు జైలరు– బ్రెష్ట్ కవితలో–లెనిన్ విగ్రహాలు పడగొట్టించి వామపక్ష భావజాలాన్ని చెరిపేస్తామనుకుంటున్నారు పాలకులు నేటి భారతంలో–

అనువాదం,పరిచయం: డాక్టర్ దేవరాజు మహారాజు, ✆: 95737 06806

విశాలాంధ్ర

బతుకు

The Life

సోమవారం

26 మార్చి 2018

పార్టీవేర్ కాటన్ ఫ్రాక్స్ !

పిల్లలు ఎక్కడ ఉంటే అక్కడ సందడే. ఇంట్లో ముందు ఏది కొనాలన్నా ముందు వాళ్ళే గుర్తుకొస్తారు. బట్టలు ఇంక చెప్పేదేముంది. వాళ్ళకు కొన్నాకే ఎవరికైనా. మరి ఈ సీజన్‌లో ఎంచుకోవాల్సిన, వాడుకోవాల్సిన వస్త్రశ్రేణి కాటన్. పిల్లలు అందరూ సౌకర్యంగా ఫీలయ్యేది, ఇష్టపడేది, సంప్రదాయంగా కనిపించేది, ఆధునికత మేళవింపుతో ఆకట్టుకునేది ఏదైనా ఉందంటే అది కచ్చితంగా గౌనే. మరి పెళ్ళిళ్ళు, వేడుకలు ఎక్కువగా జరిగే ఈ కాలంలో పార్టీలకు వెళ్ళేందుకూ వీలుగా పార్టీవేర్ కాటన్ ఫ్రాక్స్ పేరుతో విభిన్నమైన రీతుల్లో, విశేషంగా ఆకట్టుకుంటూ పలు రకాల గౌన్‌లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అలాంటివే ఇవి. మీ పిల్లలకూ నప్పుతాయేమో ఓ లుక్కేయండి మరి!





ఒక్క కుళాయి ముందు ఎంతమందో!

మార్చి నెల కూడా ముగియకుండానే నీటి కష్టాలు మొదలయ్యాయి చాలా ప్రాంతాల్లో. ఒక చేతిలో బిందెలు, బక్కెట్లు, క్యాన్‌లు, మరో చేతిలో చంటి పిల్లలతో నిలబడిన ఈ ఆడపడుచుల్ని చూస్తే ఈ నాలుగు నెలలూ మాకు ఈ పాట్లు తప్పవు అన్నట్టుగా ఉన్నారు కదా! ఈ చిత్రం కావడానికి ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లోది కానీ ఇలాంటి చిత్రాలు ఇక దేశవ్యాప్తంగా తారసపడుతూనే ఉంటాయి.

చలువ పందిళ్ళ జాడేదీ!



కాలంతో పాటు కనిపించకుండా పోయిన వాటిలో చలువ పందిళ్ళూ ఒకటి. చలువా పందిళ్ళా అవేమిటి? అని అడిగేవాళ్ళే ఎక్కువ ఈ రోజుల్లో. చలువ పందిళ్ళు అంటే తాటాకు పందిళ్ళే. ఎండాకాలం వచ్చిందంటే దాదాపుగా ప్రతి ఇంటి ముంగిటా ఈ తాటాకు పందిళ్ళు దర్శనమిచ్చేవి ఒకప్పుడు. వీటిని వేయడం శ్రీరామనవమితోనే ప్రారంభమయ్యేది. గతంలో శ్రీరామ నవమి అంటే పల్లె, పట్నం అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ 15 రోజులు ముందు నుంచే పండగ వాతావరణం నెలకొనేది. ముఖ్యంగా సందుసందునా తాటాకు పందిళ్ళు వేసేవాళ్ళు. ఈ పందిళ్ళల్లో వీధివీధినా నాటకాలు వేసేవాళ్ళు. తాటాకు పందిళ్ళ జోరుతో పండగ పేరు చెప్పి కొంతమందికి ఉపాధి లభించేది. నాటకాల వల్ల జనులందరికీ వినోదం, విజ్ఞానం రెండూ దక్కేవి. శ్రీరామనవమి ఎప్పుడూ మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో వస్తుంది. ఇది ఎండలు ముదిరే కాలం. ఈ సమయంలో వేసే తాటాకు పందిళ్ళు చలవ పందిళు ళ్గా పదిమందికీ నీడనిచ్చేవి. తాటాకు పందిరి వేయడమూ ఒక కళే. తాటాకును కుట్టడం కొందరికి మాత్రమే తెలుసు. అందుకే ఈ కాలంలో ప్రత్యేకంగా వేసే పందిళ్ళ కారణంగా కూలీలు, కార్మికులు, కళాకారులకు చేతినిండా ఉపాధి అవకాశాలు ఉండేవి. ముఖ్యంగా గీత కార్మికులకు మంచి పని దొరికేది. తాటాకులు కోయడం, తడికెలు చేయించడం ఇవన్నీ గీత కార్మికులే చేసేవారు. తాటాకుల విక్రయం వలన రైతులకూ కొంత ఆదాయం వచ్చేది. ఇప్పుడు గతంలో ఉన్నన్ని తాటిచెట్లూ లేవు. తాటాకులు కోసి వేసే పందిళ్ళు అసలే కనిపించడం లేదు. దీంతో గీత కార్మికులకే తెలిసిన ఈ విద్య కనుమరుగైంది. వారి ఉపాధికీ గండి పడింది. గతంలో తాటి చెట్లు ఎక్కి తాటాకులు కోస్తే చెట్టుకు రూ. 5 నుండి రూ. 10 వరకు కూలి లభించేది. తడపలు 100 తడపలు చీలిస్తే రూ. 3 నుండి రూ. 5 వచ్చేది. 50 తాటాకుల మోపు రూ. 50 నుండి రూ. 100 వరకు గిరాకీ గతంలో ఉండేది. కానీ తాటాకు పందిళ్ళ స్థానంలో షామియానాలు దర్శనమిస్తున్నాయి. గతంలో ప్రతి పందిట్లో సాంస్కృతిక కార్యక్రమాలూ ఘనంగా నిర్వహించేవారు. నిత్యం నాటకాలు, బుర్రకథలు, హరికథలు, నృత్య కార్యక్రమాలతో గొప్ప సందడి నెలకొనేది. ఆనాటి కళాకారులకు, నాటక బృందాలకు ఈ తొమ్మిది రోజుల్లో వచ్చే ఆదాయంతో దాదాపు ఆరు నెలల జీవనం గడిచేది. ఆ రోజుల్లో నాటకాలు అంటే ప్రజలు ఎంత దూరమైనా నడచి వెళ్ళి చూసేవారు. బుర్రకథ, హరికథా కళాకారులకూ మంచి ఆదాయం ఉండేది. ఇక నవమి అనగానే గుర్తుకొచ్చేవి వడపప్పు, పానకం. వీటివలన వేసవి కాలంలో దాహం తీరుతుంది. వేడి వల్ల వచ్చే అనారోగ్యాలూ సర్దుకుంటాయి. వడపప్పు (పెసరపప్పు) ఆకలిని కలిగిస్తుంది, శరీరానికి శక్తిని ఇస్తుంది. ఎవరికి వారు ఇళ్ళల్లో వీటిని పెద్దఎత్తున తయారుచేసి, బిందెలతో పానకాన్ని తీసుకొచ్చి అందరికీ పంచేవారు. ఇది కూడా ఇప్పుడు బాగా తగ్గిపోవడం గమనార్హం.





- కొంపల్లి, ఒంగోలు

మంచి శరీరాకృతి కోసం

మంచి శరీరాకృతిని కలిగివుడటమనేది ఈ రోజుల్లో సవాలుగా మారింది. ప్రత్యేకించి యువతకు బ్యూటీ పార్లర్, జిమ్‌కి గాని వెళ్ళే సమయం లేదు. అందుకోసమే ఈ చిన్న చిట్కా..

- పడుకునే ముందు తినకండి. ఇలా తినడం వల్ల శరీరంలోని మెలిన్ అనే హార్మోన్ దెబ్బతింటుంది. పడుకోవడానికి 3 గంటల ముందే తినాలి.
- అరటి పండు, పుచ్చకాయ, బ్రకోలి, గుమ్మడికాయ, వంగ, కివి, ఉల్లిపాయ వంటివి ఎటువంటి పురుగుల మందును గ్రహించవు. అందుకని అవి తినవచ్చు.
- మీరు రుచికరమైన సలాడ్ తయారు చేసుకోవాలనుకుంటున్నారా? తక్కువ క్యాలరీలు వున్న పదార్థాలు వాడాలనుకుంటున్నారా? అయితే దానికి తురిమిన ఆపిల్‌ని కలపండి. లేదా జ్యూస్‌ని కలపండి. దీంతో కొవ్వు శాతం తగ్గుతుంది.
- నిమ్మరసం, ఆలివ్ ఆయిల్, తేనే, ఉప్పును కలిపి సలాడ్‌లో కలిపితే క్యాలరీలను తగ్గించవచ్చు.
- మీ కంటికింద చర్మం పొడి బారకుండా వుండాలంటే కళ్ళకి కొంత వ్యాయామం అవసరం(ఇది కష్టమే కాని ఫలితం వుంటుంది.) ఇది మీరు కళ్ళు తెరిచి వుంచినప్పుడే చేయాలి.
- మీ వంటింటిని అందంగా అలంకరించుకోవాలంటే ముందుగా ఎరుపు, కాషాయ రంగులు వాడితే ఆకలి బాగా వేస్తుంది.. బ్లూ, ఆకుపచ్చ, తెలుపు వాడితే అది మీ ఆకలి మీద పెద్దగా ప్రభావం చూపదు.
- మీ శ్వాసను తాజాగా వుంచుకోవడం కోసం మీ చేతిలో చుయింగమ్ లేకపోతే నిమ్మకాయని వాసన చూడండి. లేదా అజామోదా ఆకు వాసన పీల్చండి.
- మద్యం, పొగ త్రాగడం వంటివి విటమిన్స్‌కి నిజమైన శత్రువులు. మద్యం సేవించడం వల్ల విటమిన్-బి,సి, కే లు నశించిపోతాయి. సిగరెట్ రోజు తాగడం వల్ల శరీరంలో సి-విటమిన్ వుండదు.
- మీకు వ్యాయామం చేసే సమయం లేదా! అయితే వారానికి 2నుంచి 3 సార్లు అరగంట సేపు నడవండి. జిమ్‌కి వెళ్ళడం కన్నా నడవడం మంచి వ్యాయామం.
- హాయిగా నిద్రపోండి. ఎవరైతే 6గంటలకన్నా తక్కువ సమయం కన్నా నిద్రపోతారో వారు నిద్రలేమి, అధిక బరువుతో ఇబ్బంది పడతారు.
- డజను ఆలివ్ పండ్లను మధ్యాహ్నం భోజనంతో తీసుకుంటే మీరు ఆరోగ్యవంతంగా వుంటారు.
- రోజు చేపల్ని తీసుకోవడం వల్ల బలంగా వుంటారు. ఇది గోర్లు, వెంట్రుకల పెరుగుదలకు తోడ్పడుతుంది.






జరిగిన కథ

మొన్న సుభగారి పుట్టినన్రోజు పండక్కి వాళ్ళింటికి వెళ్ళినపుడు 'అల్లుడూ, మావా' వరసలు పెట్టి పిలుచుకోవడం వినని విన్నాను. నేను వొఠి పిచ్చివాణ్ణి. నాకు మతిపోతుంది. పోనీ - నేనే సుభగారితో మనస్సువిప్పి చెప్పితే? ఛా! ఎంతేనా, ఆడపిల్లలున్నవాళ్ళు మధ్యవర్తులు ద్వారా మాటలు జరిపించడం రివాజు. ఆ రివాజు జవదాటితే మొగాడు లోకానికీ లోకువే. నా మేజరుగిరీ, నా యింజనీరు పనీ యెవడిక్కావాలి? లోకానికీ సంఘానికీ సంప్రదాయం కావాలి. దానికి తోడు లక్షలు కావాలి. అసలు లక్షలుంటే సంప్రదాయం అక్కర్లేదు. అంతస్తూ అక్కర్లేదు. సుభగారికీ అన్నీ వున్నాయి, వాళ్ళ నాన్నగారూ అమ్మగారూ 'కో' అంటే కోటిమంది వస్తారు. వీళ్ళు వేలూ లక్షలూ కట్నాలూ ఇవ్వగలరు. అవతలి వాళ్ళు వేలూ లక్షలూ లాంఛనాలకీ వేడుకలకీ ఖర్చు పెట్టగలరు. మరి నేనో......

(నిన్నటి సంచిక తరువాయి)

నా వంతెనల్ని తల్చుకుంటే పాతాళానికి కుంగిపోవాలనిపిస్తుంది. సుభగారిని తల్చుకుంటే ఆకాశం అందుకున్నట్టుంటుంది...ఆకాశం అందుకుందుకు రెక్కల్లేవు నాకు. ఆకాశాని కెక్కడానికి లక్షలతో మెట్లు కట్టిన నిచ్చెన లేదు నా దగ్గిర. వలపు ప్రేమలు నాకు గగన కుసుమాలుగానే మిగిలిపోతాయి...నేను అధఃపాతాళానికి కుంగిపోతాను... కుంగిపోను! నా ఇంజనీరింగు శాస్త్రం నాకుండనే వుంది...మరి, దెక్ పరిధి వర్తులంగా వుండదు కదా!



ఉచ్చారణ:

ఇంటగ్రల్ ఫ్రం ఏటు బి ఆఫ్ ఎక్స్ డియక్స్

ఈజ్ ఎప్రోక్సిమేట్లీ యీక్వల్టు హెచ్ బై త్రీ యింటూ (వై వన్) ప్లస్ (వై ఎన్ ప్లస్ వన్)ద ప్లస్ ట్వైస్

(వై త్రీ ప్లస్ వై ఫైవ్ ....ప్లస్ వై ఎన్ మైనస్ వన్) ప్లస్ ఫోర్


(వై టూ ప్లస్ వై ఫోర్....ప్లస్ వై ఎన్)

ఎన్ ఈవెన్ అండ్ హెచ్ యీజ్ బి మైనస్ ఎ బై ఎన్.

చదరపు కొలత - క్షేత్రం యెలా లెక్కకట్టడం? నాకు పూర్తిగా మతిపోయింది - సుభగారు, కాంగ్రెసు, కమ్యూనిస్టు రాజకీయాల మధ్య ఆ....అర్థమైంది. ఏవుంది, సింప్సన్స్ సూత్రం వుందిగా ట్రిపీజిరియమ్ పారమ్యులా పెట్టి కొట్టేయడమే!

3 ఆమె

ఈవాళకి వారం రోజులైంది జనార్దనంగారి బంగళాకి భోజనానికెళ్లి. నా అంతట నేనే వారం చెప్పకు భోజనానికి వెళ్ళడం బాగుండదేవో అని వెనక తీయలేదు. నేస్తుల్నిద్దర్నీ నాతో లాక్కుపోయాను. వాళ్లిద్దరూ యేమనుకుంటారో అని కూడా ఆలోచించలేదు. ఆలోచించక పోవడమేమిటి? ఆలోచించాను. వంతెన్లు పడగొట్టి బ్రిటిష్‌వాణ్ణి దేశంలోంచి తగిలేసే వరకూ నాలో తీరని తహ తహా? లేకుంటే - జనార్దనం గారిని చూసి ఆయనతో కొంత సేపు గడపాలనే ముచ్చలకోసం ఉబలాటవా? - అని నా మనసుని నేనే నిలదీసి అడిగాను. ముచ్చట - ఉబలాటం- ఏమిటీ మాటలు? ప్రేమ అన్నా, మోహం అన్నా, కామం అన్నా - కొనకి అన్నీవొహటే. ప్రేమ అంటే ఏమిటో యిదమిత్థంగా నేను చెప్పలేను - నా మనస్సుకే తెలీదు. కాని నేను చంటిగుంటని కాను. కామం అంటే స్వానుభవంలేకపోయినా లీలగా ఎరుగుదును. నాతో నేనెందుకు అబద్ధం వాడాలి? నా శరీరానికి తెలుసును. పుస్తకాలు చదువుతున్నాను, సినిమాలు చూస్తున్నాను. అడుగడుగునా ప్రత్యక్షం అవుతూనే వుంది - బీచికెళితే ఓ మొగాడిమీద నా



యీ భావం స్వార్థమే అనిపిస్తుంది, మరి "క్విట్టిండియా" ఉద్యమంలో వంతెన్లు ధ్వంసం చేయడవో? అదీ స్వార్థవేనా? నా పేరు పత్రికల్లో పడి చూసుకుని మురిసిపోవాలని నాకు లేదు. బ్రిటిష్‌వాణ్ణి మన దేశంలోంచి తన్ని తగిలేయలేం. తన్ని తగిలేయగల్గితే కాంగ్రెసువాళ్ళకి పరమానందవే. కాని అది సత్యాగ్రహం అనిపించుకోదు. గనుక వొహవేళ ఫలిస్తే కాంగ్రెసువాళ్లు లోలోపల సంతోషించినా పైకి వొప్పుకోరు. అందుకు దమ్ముల్లేవు. చూస్తున్నాను కదూ. అంచేత ఇంట్లోంచి పొమ్మనక్కర్లేదు. పొగపెడితే వాడే పోతాడు ఈ పొగ పెట్టటానికి కార్డైటు అవసరం. ఇది దేశభక్తితో చేస్తున్నపని నిష్కామ కర్మ, నిస్వార్థం, అయితే - జనార్దనంగారిని చూస్తేనే నా గుండె గంతులేస్తుంది. ఎందుకు గంతు లేస్తుంది? కార్డైటు కోసవా - ఆయన మీద నా కున్న కామన కోసవా! రెండింటింకోసవూ



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

కానీ, నా మొదటి కామన కార్డైటు - ప్రస్తుతానికి.

అవును, నాతో నేను చిత్తశుద్ధితో మెలగాలంటే "ప్రస్తుతానికి" అని బొద్దంబాల్ చెప్పాలి. కాని నా కార్డైటు కామన జనార్దనంగారు తీర్చేట్టు లేరు. వాళ్ళింటికి భోజనానికి వెళ్ళావా - కార్డైటు ముచ్చు ముక్కలు వెనకటికి యిస్తానని ఖరారుచేసిన పెద్ద మనిషి ఆ వూసే మర్చిపోయాడు. సూరమ్మపిన్ని గారు వంట రుచి చూస్తుంటే కార్డైటు మాట నా కడుపులో ఎక్కడో అడుగున పడిపోయిందని నేనూ వొప్పుకు తీరాలి. అమ్మదగ్గరికి నేనొచ్చిన ఈ పదేళ్లే చెన్నపట్టపు అయ్యరు వంట తప్ప మరో రుచి యెరుగును. నాన్న శ్రీనాథుడే కాశీఖండంలోని కృష్ణదేవరాయలు "అముక్తమాల్యద" లోంచీ పద్యాలు చదివి వినిపించి తెలుగు రుచులు గురించి మంచి ఉత్సాహంగా కబుర్లు చెబుతూంటారు. గాని ఇంతవరకూ విని సంతోషించమే అయింది. అనుభవించలేదు. సూరమ్మపిన్నిగారు చేసిన గుత్తివంకాయ కూర, కందముక్కలు వేసి ఆవపెట్టిన బచ్చలకూర్రసం, గుమ్మడికాయ ముక్కలు వేసి చేసిన తెలగపిండి కూర. నక్కదోసకాయ ఊరబిండి వడియాలు - ఇవన్నీ నాకు కొత్త రుచులే. విందు కెళ్ళొచ్చిన మర్నాడు సూరమ్మపిన్నిగారి వంట గురించి రాత్రి భోజనం దగ్గరచెప్పాను. వొక్కక్క వస్తువు గురించీ నేను చెబుతూంటే, నాన్న లొట్టలు వేయడం ఇహ నేను చెప్పలేను. "భలే" "శభాష్" "భేష్" "వః!" "వహా!" - ఇవీ ఆయన ఆశ్చర్యార్థకాలు. సూరమ్మపిన్నిగారు చేసిన ఆవడలు గురించి చెబుతూ, చెప్పాను ఆవిడే చెప్పిన కథ.

"అమ్మడూ, ఆవడలంటే గ్యాపకం వొచ్చింది, ఓ మాటు యావైందనుకున్నావ్? ఆ రోజుల్లో అచ్చమ్మక్కా నేనూ వాళ్ళింటా వీళ్ళింటా వంటకి వెళ్తుండేవాళ్ళం. ఆనాడు మారెళ్ళ నరసయ్యగారింట పెద్ద లౌక్యవిందు. ఆ ఊళ్ళోకల్లా పెద్ద ప్లీడరు నరసయ్యగారు. లక్షాధికారి. మెయిన్ రోడ్డు మీద హవేలీ అంత ఇల్లు. ఏదో జమీందారి కేసు నడుస్తూందట కోర్టులో. చెన్నాపట్టం నుంచి వచ్చారట. పేరు మోసిన ఐకోర్టు వకీళ్ళు ఆరవ్వాళ్లు. ఇటుపక్క అరవ వకీలుగారు అటుపక్క అరవ వకీలుగారు బండెడు పుస్తకాలు గరిశెడు దస్త్రాలతో పాటు వాళ్ళవెంట వాళ్ళ వంట అయ్యర్లని కూడా తెచ్చుకున్నారట - ఏవనుకున్నావో? వాళ్ళ ఉప్మాలకీ, వాళ్ళ కాఫీలకినీ! ఆ వేళ రాత్రి ఓ ముప్పైమంది బ్రాహ్మణ ప్లీడర్లకి బ్రామ్మణ ఉద్యోగస్తులకీ, విందు బొబ్బట్లూపరవాణ్ణం ఆవడ - పిండివంట. ఆవడ పెరుగులో బాగా నానాలని మద్దిన్నాళే ఆవడలు చెయ్యడానికి దిగాం. మాకు సాయంచేస్తాం అని గుండార్లు యెగ్గట్టు కొచ్చారు వంటయ్యర్లిద్దరూ. "తైరువడ" చెయ్యాలన్నారు. ఆవడ చేస్తానంది అచ్చమ్మ పిన్ని. చినికి చినికి గాలివానైనట్టు, మాటమీది మాటలేచి రాద్ధాంతమైంది. అమ్మడూ, ఇంటిల్లాలు సింహాద్రమ్మగారు మొగుణ్ణి తగువు తీర్చమంది. సూరమ్మగారు వంటింటి వసారాలో కొచ్చి వ్యాజ్యం యేమిటని అడిగారు. అచ్చమ్మక్క అర్జీ పిటీషన్లో అంశాలు చెప్పింది. "పంతులుగారూ! 'తైరువడ' అరవ వంట. పెరుగులో నానిన గారె. "ఆవడ" చేసి ఆవపెట్టి పెరుగులో నానిన గారె ఆవడ తెలుగు వంట అని అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు చెప్పింది ప్లీడరుగారితో. సూరయ్యగారు తీర్పు చెప్పారు. "మనం అరవ పెద్దల్ని పిల్చి విందుచేస్తున్నాం. అందుకని వాళ్ళ కిష్టమైన పిండివంటచేసి పెడితేనే మర్యాద. "తైరువడే" చెయ్యండి!" అన్నాడాయన. మరి అచ్చమ్మక్కకి యేమిటి తోచిందో; "సూరయ్య బాబుగారూ! వచ్చింది అరవలైనా విందు తెలుగింట గనక తెలుగు పిండివంట చెయ్యడమే న్యాయం, మేం తెలుగువంట చేస్తాం, అరవ్వంట చెయ్యం. భవిడిపాటి వాళ్ళ జట్టుని పిలిపించి మీచేతవొచ్చిన వంటలు చేయించుకోండి. సెలవు!" అని గిరుక్కున తిరిగి, మూల పెట్టుకున్న నా గోపుల పంచె, తన జావారు పంచె చంకబెట్టుకుని 'రావే', సూరమ్మా!' అని నన్ను రెక్కపట్టుకుని వీధిలోకి లాక్కుపోయింది. అమ్మడూ, ఆ కోపం కోపం మంచిరాజు వారి సందు చేరు కున్నాక్కాని చల్లార్లేదు. యావనుకూన్నావో, ఆ సందులో, భవిడిపాటి వాళ్ళింటికెళ్ళీ "నారాయణ బాబూ!" అని వొళ్ళ గావు కేకపెట్టి పిలిచింది. "మాటా మాటా పట్టింపొచ్చి వో జట్టీ తెచ్చుకున్నాం మారెళ్ళ వారింట. వంట చెయ్యమని మేంవొచ్చేశాం. లౌక్యవిందు. ఇవిగో ఆయనిచ్చిన బయానా ఇర్వై రూపాయిలూ కాక" అంటూ కొంగు ముడివిప్పి నావి ఐదు. మొత్తం పాతిక అద్వన్సు తీసుకుని మీరు వాళ్ళింట వంటకెళ్ళి ఈ పాళంగానే వంటకి దిగాలి, సువ్వెళ్ళకపోతే నన్ను చంపుకు తిన్నట్టే" అంటూ నారాయణ్ణి వాడితమ్ముణ్ణి మారెళ్ళ వాళ్ళింటికి తోలింది. అచ్చమ్మక్కంటే యేవనుకున్నావో, మరి!" అంది సూరమ్మ పిన్ని.

కథ వినేసరికి నాన్న, భోజనం చేస్తున్న వాడల్లా చెంగున లేచి, "జై, ఆంధ్ర! జై ఆంధ్ర! అంటూ కేకేశారు. అమ్మ యెంచేతో. ఎప్పుడూ లేనిది, ఈ వేళ కొంచెం కోపంగా వుంది.

నాకు తెలుసు అమ్మ మనసులో పెనుతుపాను రేగుతూంది. అమ్మగుండె రణరంగ వైందనినే నెరుగుదును. దేశంలో వొహపక్క నెహ్రూ సామ్రాజ్యవాద వ్యతిరేకత, ఈ పక్క 'క్విట్టిండియా' విధ్వంస చర్యలు అపక్క భూదహనానికి ఉత్సాహం. అటుపక్క కమ్యూనిస్టుల "ప్రజాయుద్ధ" నినాదాలు, ఇటుప్రక్క గవర్నమెంటువాళ్ళ దమనకాండ - అమ్మ మనసు యెటూ తేల్చుకోలేక విలవిలలాడిపోతూంది. ఈ చిత్త క్షోభే పైకి పెల్లుబికిందనుకుంటాను.

- ఇంకా వుంది.

కేంద్ర పాలిత ప్రాంతాల్లో అతి చిన్నది ఏది ?



- ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా 21 (ఎ) నిబంధనల్లో చేర్చారు ? - **86వ రాజ్యాంగ సవరణ 21(ఎ)**
- గరీబీ హఠావో నినాదాన్ని ఎవరు చేశారు ? - **ఇందిరాగాంధీ**
- మహిళా సాధికారతకు సంబంధించి జాతీయ విధానాన్ని ఏ సంవత్సరంలో రూపొందించారు ? - **2006 సంవత్సరంలో**
- సిటిజన్ చార్టర్ పద్ధతిని ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు ? - **1997 సంవత్సరంలో**
- అత్యంత ముఖ్యమైన కేబినెట్ కమిటీ ఏది ? **1 రాజకీయ వ్యవహారాల కమిటీ**
- 'జై విజ్ఞాన్' నినాదాన్ని ఎవరు చేశారు ? - **అటల్ బిహారీ వాజ్‌పేయి**
- రాజ్యసభలో ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు ఎవరు ? - **గులాంనబీ ఆజాద్**
- కాంగ్రెస్ పార్టీ ఎన్నో లోక్‌సభలో అధిక సీట్లు సాధించింది ? - **8వ లోక్‌సభ**
- నెహ్రూ జూలాజికల్ పార్కు ఎక్కడ ఉంది ? - **హైదరాబాద్**
- శ్వేతవిప్లవ పితామహుడు అని ఎవరిని అంటారు ? - **జె.కె.కురియన్**
- ఐక్యరాజ్యసమితి శతాబ్ది వృక్షంగా ఏ వృక్షాన్ని ప్రకటించింది ? - **వేపచెట్టు**
- బోన్సాయ్ అనేది ఏ దేశపు చెట్లు పెంచే సాంప్రదాయ కళ ? - **జపాన్**
- జయలలిత పార్టీ (ఏఐఏడీఎంకే) ఎన్నికల గుర్తు ఏది ? - **రెండాకులు**
- 'క్రిస్మస్ ఐలాండ్' అని ఏ దేశాన్ని అంటారు ? - **ఆస్ట్రేలియా**
- 'ఇంక్విలాబ్ జిందాబాద్' ఎవరి నినాదం ? - **భగత్‌సింగ్**
- భూదానోద్యమాన్ని ఎవరు ప్రారంభించారు ? - **ఆచార్య వినోబాభావే**
- 'రూఫ్ ఆఫ్ ద వరల్డ్' అని ఏ దేశాన్ని అంటారు ? - **టిబెట్**
- ఎమర్జెన్సీ తరువాత 1977లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించింది ఎవరు ? - **మొరార్జీ దేశాయ్**
- రాజ్యసభ సభ్యుడి పదవీకాలం ఎన్ని సంవత్సరాలు ? - **ఆరు సంవత్సరాలు**
- కేంద్రపాలిత ప్రాంతాల్లో అతి చిన్నది ఏది ? - **లక్ష ద్వీప్**
- స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ ఉపయోగించిన ఆయుధం ఏది ? - **అహింస**
- ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యధికంగా 28 పతకాలు సాధించిన క్రీడాకారుడు ఎవరు ? - **మైకేల్ ఫెల్ప్స్**
- ప్రపంచ యువజన దినోత్సవాన్ని ఏరోజు నిర్వహిస్తారు ? - **ఆగస్టు 12**
- 2016 ఆగస్టు 16న మరణించిన గురుదయాళ్‌సింగ్ ఏ రంగంలో సుప్రసిద్ధుడు ? - **సాహిత్యం**
- తమిళరత్న - 2016 అవార్డు గ్రహీత ఎవరు ? - **సినీ సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్**
- 2016 రియో ఒలింపిక్స్‌లో 58 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించిన భారత మహిళా రెజ్లర్ ఎవరు ? - **సాక్షి మాలిక్**
- 2016 రియో ఒలింపిక్స్‌లో పురుషుల టెన్నిస్ సింగిల్స్‌లో స్వర్ణం సాధించిన ఆటగాడు ఎవరు ? - **ఆండీ ముర్రే (బ్రిటన్)**
- అంతరిక్షం నుంచి భూమిపైకి సమాచార మార్పిడికి ఉపయోగపడే 'క్వాంటం కమ్యూనికేషన్ శాటిలైట్'ను ఇటీవల ప్రయోగించిన తొలి దేశం ఏది ? - **చైనా**
- తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏ ప్రాంతంలో ప్రత్యేక పార్కును ఏర్పాటు చేయబోతోంది ? - **సుల్తాన్‌పూర్ (మెదక్)**
- ఒలింపిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో హ్యాట్రిక్ స్వర్ణాలు సాధించిన ఆటగాడు ఎవరు ? - **ఉసేన్ బోల్ట్**
- థెరిస్సామే ఇటీవల ఏ దేశ నూతన ప్రధానిగా నియమితులయ్యారు ? - **బ్రిటన్**
- మంజులా చెల్లూర్ ఇటీవల ఏ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు ? - **ముంబయి**
- ఒలింపిక్స్ చరిత్రలో భారత్‌కు లభించిన రెజ్లింగ్ పతకాలు ఎన్ని ? - **5**
- దేశంలోనే తొలి గ్రీన్‌రైలు కారిడార్ (114 కి.మి. పొడవు)ను ప్రారంభించిన రాష్ట్రం ఏది ? - **తమిళనాడు**
- ఆస్ట్రేలియా ఓపెన్ స్క్వాష్ ఛాంపియన్ 2016 విజేత ఎవరు ? - **దీపికా పల్లికల్**
- 2016లో 8వ బ్రిక్స్ సమావేశాన్ని ఏ నగరంలో నిర్వహించారు ? - **న్యూఢిల్లీ**
- మణిపూర్ రాష్ట్ర గవర్నర్ ఎవరు ? - **నజ్మా హైప్తుల్లా**
- పండిత్ దీన్‌దయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ ఎక్కడ ఉంది ?- **గాంధీనగర్ (గుజరాత్)**
- ఆగస్టు 10వ తేదీ ప్రాముఖ్యం ఏమిటి ? - **జీవ ఇంధన దినోత్సవం**
- ఒలింపిక్స్‌లో మహిళల బ్యాడ్మింటన్‌లో రజితం సాధించిన తొలి భారత ప్లేయర్ ఎవరు ? - **పూసర్ల వెంకట సింధు**
- 'సంసద్ ఆదర్శ్‌గ్రామ్ యోజన'లో భాగంగా సచిన్ టెండూల్కర్ దత్తత తీసుకున్న గ్రామం ఏది ? - **దోంజ (మహారాష్ట్ర)**
- 2013 నవంబర్ 19న ప్రారంభించిన భారతీయ మహిళా బ్యాంక్‌ను ఏ బ్యాంక్‌లో విలీనం చేయడానికి కేంద్రం నిర్ణయించింది ? - **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
- ఎ.పి.జె. అబ్దుల్ కలాం- 2016 అవార్డు గ్రహీత ఎవరు ? - **పి.షణ్ముగం**
- నేరగాళ్లను పట్టుకోవడానికి ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రం ఏది ? - **మహారాష్ట్ర**
- నేల పొరల్లో విస్తారంగా దొరికే లోహం ఏది ? - **అల్యూమినియం**
- బ్యాటరీలు ఎక్కువ కాలం పనిచేయడానికి ఉపయోగించే లోహం ఏది ? - **లిథియం**
- ఇళ్లలో ఉపయోగించే ఎలక్ట్రిక్ వైర్లలో వాడే లోహం ఏది ? - **కాపర్**
- కంప్యూటర్లు, ఎంపీ 3 ప్లేయర్లలో ఉపయోగించే బలమైన అయస్కాంతాల తయారీలో వాడే లోహం ఏది ? - **నియోడిమియం**
- ప్రపంచ వాణిజ్య సంస్థ 11వ మంత్రుల సమావేశం ఇటీవల ఏ దేశంలో జరిగింది ? - **అర్జెంటీనా**
- డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని నెలకొల్పనున్న నగరం ఏది ? - **కోయంబత్తూర్ (తమిళనాడు)**

విశాలాంధ్ర ప్రజ్ఞ

సింథటిక్ హార్స్‌పాక్స్ వైరస్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు

కెనడాకు చెందిన శాస్త్రవేత్తలు ఇటీవల ఆవిష్కరించిన ఓ కృత్రిమ వైరస్ (సింథటిక్ హార్స్ పాక్స్ వైరస్) తట్టు, పొంగు, దద్దు వంటి మశూచి సంబంధ వ్యాధులకు మరింత శక్తివమంతమైన టీకాను కనుగొనేందుకు ఉపకరించే అవకాశం ఉంది. ఓ కృత్రిమ డీఎన్ఏను ప్రజారోగ్య సాధన దిశగా ఎలా ఉపయోగించుకోవచ్చనే దానికి ఈ కృత్రిమ వైరస్ ఓ ఉదాహరణ కావచ్చు. ఇప్పటికే వెలుగులోకి తెచ్చి ఉన్న జన్యు క్రమాన్నీ, సంపూర్ణంగా రసాయనిక ప్రక్రియల ద్వారా తయారుచేసిన డీఎన్ఏ భాగాలను ఉపయోగించి పూర్తిగా కృత్రిమంగా ఈ వైరస్‌ను తయారుచేశారు. మశూచి సంబంధ ఇన్‌ఫెక్షన్ ఉన్న ఎలుకలపై ఈ కృత్రిమ వైరస్‌ను ప్రయోగించి పరీక్షించారు. ఫలితం అత్యంత ఆశాజనకంగా ఉన్నట్లు అల్‌బెర్టా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డేవిడ్ ఇవాన్స్ తెలిపారు.

చంద్రుడిపై స్థావరం ఏర్పాటులో చైనా ముందడుగు



చంద్రుడిపై వాతావరణ పరిస్థితులను పోలిన ప్రత్యేకమైన ప్రయోగశాలలో నలుగురు ఔత్సాహికులు 200 రోజులు విజయవంతంగా గడిపారు. బీజింగ్‌లోని బీహంగ్ విశ్వవిద్యాలయం ఆవరణలో నెలకొల్పిన 'చంద్రభవంతి' అరే ప్రయోగశాలలో 160 చదరపు మీటర్ల క్యాబిన్‌లో ఈ విద్యార్థులు జీవించారు. బయటినుంచి ఎలాంటి వనరులు అందజేయకున్నా వారి వ్యర్థాలతో కిణ్వప్రక్రియలో తయారుచేసిన జీవ ఎరువులతో కూరగాయలు, పంటలు పండించుకుని బతకడం విశేషం. 2022 నాటికి ఇతర గ్రహాలపై నివసించడానికి అనువుగా ఒక్క స్థావరాన్నయినా నెలకొల్పాలనే ఉద్దేశంతో చైనా ప్రభుత్వం ప్రయోగాల కోసం వేలకోట్ల రూపాయలు వ్యయం చేస్తోంది.

పాలలోని ఓ రకం బాక్టీరియాతో కీళ్లవాతం



పాలు తాగితే ఎముకలు బలంగా ఉంటాయన్న విశ్వాసం నేపథ్యంలో ఓ అధ్యయనం అందుకు విరుద్ధమైన హెచ్చరిక చేస్తోంది. పాలల్లో ఉండే ఓ రకమైన బాక్టీరియా మూలంగా కీళ్ల నొప్పులు వచ్చే అవకాశం లేకపోలేదని అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ ఫ్లోరిడా' (యూసీఎస్) పరిశోధకులు పేర్కొన్నారు. జన్యుపరంగా కీళ్లవాతం సంక్రమించే లక్షణాలు ఉన్నవారిలో పాలలోని 'ఎంఏపీ' అనే బ్యాక్టీరియా ఆ సమస్యను ప్రేరేపిస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఏ వయసులోనైనా వారికి సమస్య తలెత్తవచ్చు. కాళ్లూ, చేతుల్లో విపరీతమైన నొప్పులతో బాధపడవచ్చు. ముఖ్యంగా 40-60 ఏళ్ల వయసువారికి ఈ సమస్య విపరీతం కావచ్చని పరిశోధకులు వెల్లడించారు. 'ఎంఏపీ' బ్యాక్టీరియా పూరిత పాలను స్వీకరిస్తే.. ఈ సమస్య తలెత్తుతుందని వారు తెలిపారు. కీళ్లవాతం, నొప్పులతో బాధపడుతున్న వందమందిని ఎంపిక చేసుకుని అధ్యయనం నిర్వహించారు. వారిలో దాదాపు 80శాతం మందిలో ఏంఏపీ బ్యాక్టీరియాను కనుగొన్నట్లు వారు వివరించారు.

సైన్స్ టెక్నాలజీ తాజా సమాచారం



అరుణాచల్ ప్రదేశ్‌లో కొత్త కప్పజాతి వెలుగులోకి

అరుణాచల్‌ప్రదేశ్‌లోని లోయర్ సబాన్సిరి జిల్లాలో శాస్త్రవేత్తలు సరికొత్త కప్ప జాతిని కనుగొన్నారు. 'ఒడొరానా అరుణాచలెన్సిస్'గా దానికి నామకరణం చేశారు. సాధారణంగా ఏటా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య వర్షాకాలంలో మాత్రమే ఈ కప్పలు కనిపిస్తాయని.. పొడి వాతావరణం ఉన్నప్పుడు కనిపించవని శాస్త్రవేత్తలు తెలిపారు. హరితవర్ణంలోని ఈ కప్పలు సాధారణ కప్పల పరిమాణంలోనే ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుతానికి అరుణాచల్‌ప్రదేశ్‌లోని టాలే లోయ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం (డబ్ల్యూఎల్‌ఎస్)లోనే ఈ కప్పల సంచారాన్ని గుర్తించినట్లు జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. వాస్తవానికి 'ఒడొరానా'లో 50కి పైగా జాతుల కప్పలు ఉన్నాయని తెలిపింది.



512 ఏళ్ల నాటి గ్రీన్‌లాండ్ షార్కు గుర్తింపు

ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో సజీవంగా ఉన్న 512 ఏళ్లనాటి గ్రీన్‌లాండ్ షార్కును డెన్మార్క్‌కు చెందిన జూలియస్ నీల్సన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం గుర్తించింది. బతికి ఉన్న సరీసృపాల్లో అతిపురాతనమైనదిగా భావిస్తున్న 18 అడుగుల పొడవున్న షార్కు, 1505లో జన్మించింది. ఇది ఏడాదికి సెంటీమీటరు మాత్రమే పెరిగింది. దీని కందర కణజాలం, ఎముకలు, డీఎన్ఏలను విశ్లేషిస్తే వందల ఏళ్లుగా చోటుచేసుకున్న కాలుష్యం, వాతావరణ మార్పుల గురించి కొత్త విషయాలు తెలిసే అవకాశం ఉంది. కెనడా నుంచి నార్వే వరకు గల అట్లాంటిక్ సముద్రం, స్కాట్లాండ్‌లోని సముద్ర జలాల్లో బాగా లోతున గ్రీన్‌లాండ్ షార్కులు నివాసం ఉంటాయి.

అల్జీమర్స్‌కు పసుపు దివ్యౌషధం



జ్ఞాపకశక్తిని పెంపొందించడంలో పసుపు ఎంతో ఉపకరిస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా అల్జీమర్స్‌కు ఇది చక్కని విరుగుడని అమెరికన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పసుపు సమృద్ధిగా ఉండే 'కుర్కుమిన్'కు వాపును తగ్గించే గుణాలు ఉన్నట్లు ఇదివరకే రుజువైంది. అయితే మతిమరుపు సమస్యకూ చక్కని విరుగుడని తాజాగా రుజువైనట్లు వారు వెల్లడించారు. శాస్త్రవేత్తలు తొలుత 50-90 ఏళ్ల వయసున్న, స్వల్ప మతిమరుపుతో ఇబ్బందిపడుతున్న 40 మందిని ఎంపిక చేసుకుని, వారిపై పసుపు ప్రభావాన్ని అధ్యయనం చేశారు. మొదట వారి రక్తంలో కుర్కుమిన్ శాతాన్ని నమోదు చేశారు. వారి మెదడులో జ్ఞాపకశక్తిని ప్రభావితం చేసే అమిలాయిడ్, ప్రోటీన్ శాతాన్ని కూడా 'పెట్' స్కానింగ్ ద్వారా పరీక్షించారు. అనంతరం వారందరికీ కూడా 18 నెలలపాటు క్రమం తప్పకుండా ప్రతిరోజూ 90 మిల్లీగ్రాముల కుర్కుమిన్‌ను ఇచ్చారు. ఆ తర్వాత నిర్వహించిన పరీక్షల్లో వారి మతిమరుపు సమస్య గణనీయంగా తగ్గినట్లు వెల్లడైంది.

ఒక్క మందుతో రెండు వ్యాధులు నయం

'హెపటైటిస్-సి'ని నయం చేయడానికి వాడుతున్న మందు, జికా వైరస్ సంక్రమించిన వారికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. జికా వైరస్ సంక్రమించిన నాడీ కణాలకు ఎలాంటి హాని కలుగకుండా చేయడానికి ఈ మందు ఉపయోగపడిందని తేలింది. కొత్తగా వ్యాధి సంక్రమణను సైతం నిరోధించగలిగిందని గుర్తించారు. ఇప్పటివరకు జికా వైరస్‌ను అడ్డుకోవడానికి టీకా కనుగొనడానికే ఎక్కువగా ప్రయోగాలు జరుగుతున్నాయని అమెరికాలోని కాలిఫోర్నియా- శాన్‌డియాగో విశ్వవిద్యాలయానికి చెందిన అలిస్సాన్ మ్యూట్రీ పేర్కొన్నారు. దీని వ్యాప్తిని అరికట్టడానికి అనుసరించాల్సిన వ్యూహాల పైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. హెపటైటిస్-సీ వ్యాధిగ్రస్తుల చికిత్సకు వాడుతున్న 'సొఫొస్‌బువిర్'పై జరిపిన పరిశోధన పూర్తి వివరాలు 'సైంటిఫిక్ రిపోర్ట్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

విటమిన్ డీ 3తో గుండెకు రక్ష

దెబ్బతిన్న గుండె కణజాలాన్ని బాగుచేసే శక్తి విటమిన్ డీ3కి ఉందని తాజా పరిశోధనలో తేలింది. అమెరికాలోని ఒహైయో స్టేట్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. మనపై సూర్యకాంతి పడినప్పుడు సహజంగానే శరీరం ఈ విటమిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఎముకలు గట్టిపడేందుకు ఇది తోడ్పడుతుందని ఇదివరకటి పరిశోధనల్లోనే రుజువైంది. ప్రస్తుతం గుండె పనితీరు మీద ఈ విటమిన్ చూపే ప్రభావంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. దీనికోసం వెంట్రుక కంటే వెయ్యి రెట్లు తక్కువ మందంగల సూక్ష్మ నానోసెన్సర్‌లను ఉపయోగించారు. దీంతో రక్త సరఫరాలో కీలకంగా పనిచేసే, రక్తం గడ్డకట్టకుండా చూసే నైట్రిక్ ఆక్సైడ్ (ఎన్‌వో) అణువులను ఈ విటమిన్ చక్కగా ప్రేరేపించగలుగుతున్నటు తేలింది. అంతేకాదు గుండె కణజాలంపై ఒత్తిడిని తగ్గించేందుకు ఇది తోడ్పడుతున్నట్లు పరిశోధకులు కనిపెట్టారు. ఈ విటమిన్ లోపంతో గుండెపోటు రాకపోయినా.. హృద్రోగ ముప్పు పెరుగుతుందని పరిశోధనలో పాలుపంచుకుంటున్న టెడూస్ మలిన్స్కీ తెలిపారు.

మెదడు పేస్‌మేకర్లతో అల్జీమర్స్ దూరం

అల్జీమర్స్ లక్షణాలను ప్రత్యేక మెదడు పేస్‌మేకర్ ఇంప్లాంట్లతో తగ్గించుకోవచ్చని తాజా పరిశోధనలో తేలింది. అమెరికాలోని ఒహైయో స్టేట్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. గుండె వేగం గతి తప్పితే ఆపరేషన్ల ద్వారా పేస్‌మేకర్లు అమర్చుకునే విషయం తెలిసిందే. ఇలానే మెదడు ప్రేరేపించే 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్)' పేస్‌మేకర్‌ను పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీన్ని అల్జీమర్స్ బాధితుల మెదడు ముందుభాగంలో శస్త్ర చికిత్స ద్వారా అమర్చారు. చిక్కు ముడులను విప్పడం, సమస్యలను పరిష్కరించడం, రోజు వారీ ప్రణాళికలు, నిర్ణయాలు తీసుకోవడం లాంటి అంశాలు మెదడులోని ఈ భాగంతో ముడిపడి ఉంటాయి. తాజా పేస్‌మేకర్లు దీన్ని చక్కగా ప్రేరేపించగలుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ప్రవర్తన, మేధోపరమైన, విధులకు సంబంధించిన సామర్థ్యాన్ని మెరుగుపరచగలుగుతున్నట్లు కనిపెట్టారు. అయితే నిర్ణాయక సామర్థ్యంపై ఇవి ఎలాంటి ప్రభావాన్నీ చూప లేకపోతున్నాయని పరిశోధనలో పాలు పంచు కున్న డగ్లస్ సార్కే తెలిపారు.

విస్తరణకు బీఎస్ఎన్ఎల్ పెట్టుబడులు

ఢిల్లీ: ప్రముఖ ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ విస్తరణకు గాను 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 4,300 కోట్లు, సంస్థ చేపట్టబోయే టెలికాం ప్రాజెక్టుల కోసం మరో రూ. 5,000 కోట్ల నుంచి రూ.6,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ రూ. 4,300 కోట్లు పూర్తిగా మొబైల్ నెట్‌వర్క్ విస్తరణ, బ్రాడ్‌బ్యాండ్ అప్‌గ్రేడ్, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు అనుపమ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. భారత్ నెట్, స్పెక్ట్రం విస్తరణ, అండమాన్ దీవులను కలుపుతూ ఏర్పాటు చేసే ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్, ఈశాన్య రాష్ట్రాల్లో చేపట్టబోయే ప్రభుత్వ టెలికాం ప్రాజెక్టుల కోసం రూ. 5,000 కోట్ల నుంచి రూ.6,000 కోట్లు ఉపయోగించనున్నట్లు ఆయన తెలిపారు. లక్షద్వీప్, అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలను కలుపుతూ నూతన ప్రాజెక్టులు సైతం బీఎస్ఎన్ఎల్ చేపట్టబోయే ప్రాజెక్టుల జాబితాలో ఉన్నాయి. 'ప్రైవేటు ఆపరేటర్లకు దీటుగా ప్రభుత్వం పెద్ద ఎత్తున కనెక్టివిటీ ప్రాజెక్టులను చేపడుతోంది. ఈ ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం తరపున బీఎస్ఎన్ఎల్ ఒక సాధనంగా వ్యవహరిస్తోంది' అని ఆయన అన్నారు. మరోవైపు 3జీ సేవలు అందించేందుకు గాను 12వేల టవర్లు, 4జీ సేవల కల్పనకు 10 వేల టవర్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు శ్రీవాస్తవ వెల్లడించారు.

దేశీయ తయారీ రంగానికే

మేక్ ఇన్ ఇండియా పోటు



- పరాయి దేశాల వైపు దేశీయ టీవీ ఉత్పాదక పరిశ్రమ చూపు
- ప్యానెల్స్‌పై 15 శాతం, ఓపెన్ సెల్ తదితర భాగాలపై 10 శాతం దిగుమతి సుంకం
- ఇక్కడ తయారు చేయడం కంటే.. దిగుమతులే ఉత్తమమన్న భావన

న్యూఢిల్లీ: కొండ నాలుక్కి మందేస్తే.. ఉన్న నాలుకూడింది అన్నట్లుగా.. మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించేందుకు విదేశీ దిగుమతులపై కేంద్రం విధిస్తున్న పన్నులు.. దేశీయ తయారీ రంగానికే ఎసరు పెడుతున్నాయి. భారతీయ టెలివిజన్ పరిశ్రమ పరిస్థితి ఇప్పుడిలాగే ఉంది మరి. టీవీ ప్యానెల్స్, విడి భాగాల దిగుమతులపై నరేంద్ర మోదీ సర్కారు విధించిన పన్నులు.. ఆయా దేశీయ టీవీ ఉత్పాదక సంస్థల చూపును విదేశాలకు మళ్లిస్తున్నాయి. ప్యానెల్స్‌పై 15 శాతం, ఓపెన్ సెల్ వంటి ఇతరత్రా అనుబంధ భాగాలపై 10 శాతం చొప్పున దిగుమతి సుంకాలను పెంచుతున్నట్లు వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను గత నెలారంభంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే వివిధ మోడళ్ల ధరల పెంపును ప్రకటించిన దాదాపు అన్ని కంపెనీలు.. దేశంలో టీవీలు తయారు చేయడంకన్నా, విదేశాల నుంచి మొత్తం తయారైన టీవీలనే దిగుమతి చేసుకుంటే నయమన్న అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుండటం గమనార్హం. నిజానికి గతేడాది డిసెంబర్‌లో ఇలా మొత్తంగా విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి చేసుకునే టీవీలపై వేస్తున్న పన్నును 10 శాతం నుంచి 20 శాతానికి కేంద్రం పెంచింది. అయితే ఇదంతగా టెలివిజన్ పరిశ్రమను ప్రభావితం చేయలేదు. దీనికి కారణం సామ్‌సంగ్, పానసోనిక్ మినహా చాలా సంస్థలు దేశీయంగానే టీవీలను తయారు చేస్తుండటం, ప్యానెల్స్, ఇతరత్రా భాగాల విదేశీ దిగుమతులపై పన్నులు లేకపోవడమే. అయితే వీటిపైనా పన్నులు పడుతుండటంతో.. ఇక టీవీల దిగుమతే మంచిదన్న నిర్ణయానికి దేశీయ మార్కెట్‌లో భారీ వాటా కలిగిన ఎల్‌జీ, సోనీ వంటి సంస్థలూ వస్తున్నాయి. కాంట్రాక్టు తయారీదారులైన డిక్సన్, సూపర్ ప్లాస్ట్రోనిక్స్ సంస్థలూ ఇదే అభిప్రాయంలో ఉన్నాయి. వాస్తవానికి ప్యానెల్స్, ఇతరత్రా అనుబంధ భాగాల తయారీ ఇప్పుడు భారత్‌లో లేదని, కాబట్టి వాటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం అనివార్యమని ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని పన్నులు తగ్గించాలంటూ ప్రభుత్వానికి సమర్పించిన విజ్ఞాపన పత్రంలోనూ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లియెన్సెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (సీఈఏఎంఏ) పేర్కొన్నది. పన్నుల భారం ధరల పెరుగు దలకూ దారి తీస్తుందని, తద్వారా మార్కెట్‌లో టీవీ కొనుగోళ్లపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని సీఈఏ ఎంఏ అధ్యక్షుడు మనీశ్ శర్మ అంటున్నారు. పన్నులతో దేశీయంగా తయారీని ఆపేద్దామనే నిర్ణయానికి కంపెనీలు వస్తున్నాయన్నారు. కాగా, దేశంలో టీవీల తయారీని ప్రముఖ సంస్థలు నిలిపివేస్తే వేలాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడినట్లే. స్థానిక ఉత్పాదక రంగానికీ దెబ్బే. దేశీయంగా తయారీ రంగాన్ని బలోపేతం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన మంచిదే అయినా.. ఇలా భారీ సుంకాలను వేయడం తగదని, ముఖ్యంగా తయారీ వ్యవస్థ పూర్తి స్థాయిలో విస్తరించని ప్రస్తుత పరిస్థితుల్లో అస్సలు శ్రేయస్కరం కాదన్న అభిప్రాయాలు పరిశ్రమ వర్గాల నుంచి సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశంలో ప్యానెల్స్ తయారీ ప్లాంట్లు లేవని, ఒకవేళ ఎవరైనా ప్లాంట్ ఏర్పాటుకు ముందు కొచ్చినా.. ప్యానెల్స్ మార్కెట్‌లో అందుబాటులోకి రావా లంటే కనీసం మూడేండ్ల సమయమైనా పడుతుందని కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరర్స్ చెబుతున్నారు. అప్పటిదాకా పన్నులు చెల్లిస్తూ పోవాల్సిందేనా? అని ప్రశ్నిస్తున్నారు. అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూప్.. 10 బిలియన్ డాలర్ల (రూ.65,000 కోట్లు) పెట్టుబడితో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నప్పటికీ.. ఇప్పట్లో ప్యానెల్స్ అందే అవకాశాల్లేవు. కాగా, ప్రభుత్వ నిర్ణయంతో ఎల్ఈడీ టీవీల ధర 5-6 శాతం పెరుగనున్నదని పానసోనిక్ ఇండియా కార్యకలాపాలకూ నేతృత్వం వహిస్తున్న మనీశ్ శర్మ చెప్పారు. ఇదే స్థాయిలో పెంపుంటుందని బీపీఎల్, సాన్యోలు తెలుపగా, 11 శాతం ధరలు పెరుగుతాయన్న సంకేతాల్ని కొడాక్ బ్రాండ్ ఇచ్చింది. నిరుడు డిసెంబర్‌లో వేసిన పన్నుతో 2-3 శాతం ధరలను సామ్‌సంగ్ ఇప్పటికే పెంచేసింది. మొత్తానికి ఈ పన్నుల భారం మేక్ ఇన్ ఇండియా సంకల్పానికి విఘాతమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. వచ్చే నెల 1 నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు అమల్లోకి వస్తుండటంతో.. ఈ లోపు ఈ ఆందోళనలపై మోదీ సర్కారు స్పందిస్తుందా? అనేది వేచిచూడాల్సిందే.

ఉంగరం విలువే 10 కోట్లు!

- నీరవ్ మోడీ నివాసంలో ఈడీ విస్తృత సోదాలు
- రూ.26 కోట్ల విలువైన ఆభరణాలు, వాచీలు, పెయింటింగ్‌లు స్వాధీనం



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిగిన రూ.13,540 కోట్ల భారీ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి కొరడా ఝుళిపించింది. ఈ కేసులో దర్యాప్తు వేగాన్ని పెంచిన ఈడీ తాజాగా నీరవ్‌కు చెందిన మరో రూ.26 కోట్లకుపైగా విలువైన ఆస్తులను ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) బృందంతో కలసి ముంబైలోని నీరవ్ నివాసమైన సముద్ర మహల్‌లో గురువారం నుంచి శనివారం ఉదయం వరకు సోదాలు నిర్వహించి రూ.15 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.1.4 కోట్ల విలువచేసే ఖరీదైన చేతి గడియారాలతో పాటు ఎంఎఫ్ హుస్సేన్, కేకే హెబ్బార్, అమృత్ సెర్గిల్ లాంటి చిత్రకారులు గీసిన రూ.10 కోట్ల విలువచేసే పెయింటింగ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారి వివరించారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాల్లో ఒక వజ్రపు ఉంగరం విలువే రూ.10 కోట్ల వరకూ ఉంటుందని ఆయన తెలిపారు. పీఎన్‌బీ కుంభకోణంలో నీరవ్‌తో పాటు ఆయన మామ, గీతాంజలి గ్రూపు అధినేత మెహుల్ చోక్సీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేర్వేరు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా ఈడీ ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి వజ్రాలు, రత్నాలు, బంగారం, ఇతర విలువైన లోహాలతో తయారు చేసిన అనేక ఆభరణాలతో పాటు నీరవ్, చోక్సీ గ్రూపులకు చెందిన రూ.7,638 కోట్ల స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నది. పీఎన్‌బీ కుంభకోణం వెలుగులోకి రావడానికి దాదాపు నెల రోజుల ముందుగానే (జనవరి లోనే) చోక్సీ, నీరవ్, ఆయన కుటుంబ సభ్యులు భారత్ నుంచి పారిపోవడంతో వారిని స్వదేశానికి రప్పించేందుకు అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ ఈడీ, సీబీఐ ఇప్పటికే పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ వారు ముఖం చాటేస్తున్నారు. తమ పాస్‌పోర్టులను ప్రభుత్వం రద్దు చేసిందని, అలాగే భద్రతా పరమైన కారణాలు, సీబీఐ చర్యల వలన తాము భారత్‌కు రాలేకపోతున్నామని నీరవ్, చోక్సీ చెప్పుకొస్తున్నారు.

లైబీరియాలో భారత మహిళా

శాంతి దళాల కృషికి అభినందన

ఐరాస : లైబీరియాలో భారతదేశ మహిళా శాంతి దళాల కృషిని ఐక్యరాజ్య సమితి అభినందించింది. ఐరాస తరపున భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనా, నైజీరియా, ఘనా, ఇథియోపియా, ఉక్రెయిన్, స్వీడన్, ఐర్లాండ్, అమెరికా మహిళా శాంతి దళాలు తమకు అప్పగించిన లక్ష్యాన్ని విజయవంతంగా నెరవేర్చిన సందర్భంగా అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. ఆ దేశంలో మహిళా శాంతి దళాలు పోలీసు అధికారులుగా ఉత్తేజకరమైన పాత్ర నిర్వహించాయి. 2003లో ఐరాస మహిళా శాంతి దళాల బృందాన్ని భద్రతా మండలి ఏర్పాటు చేసింది. 15 ఏళ్ల పాటు ఈ దళాలు అక్కడ తమ కర్తవ్యాన్ని నిర్వహించాయి. ఈ ఏడాది మార్చికి వీరికి అప్పగించిన లక్ష్యం పరిపూర్తి అవుతుంది. లైబీరియా సమాజంలో శాంతి, ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడంలో ఈ దళాలు ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించాయి. ఈ సందర్భంగా మన్రోవియా నగరంలో ఈ నెల 22వ తేదీన అభినందన సమావేశం నిర్వహించారు. దేశాధ్యక్షుడు జార్జి వియహ్, ఐరాస డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జనరల్ అమీనా మహమ్మద్ మాట్లాడుతూ, ఐరాస మిషన్‌కు అప్పగించిన బాధ్యతను సమర్థతతో నిర్వహించిందని కొనియాడారు. పైన పేర్కొన్న దేశాలతో పాటు పలు డజన్ల దేశాల నుంచి మహిళా శాంతి బృందాలను నియమించారు. శాంతి దళాలలో భారతదేశానికి చెందిన 125 మంది మహిళలు పాల్గొన్నారు. వీరు లైబీరియా మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. పలువురు ఆ దేశ మహిళలు పోలీసు దళాలలో పాల్గొని సేవలు అందిస్తున్నారు. భారత మహిళా శాంతి దళం మొదటి సారిగా 2007లో లైబీరియాలో తమ కర్తవ్యాన్ని ప్రారంభించి 2016 వరకు పనిచేసింది. భారత బృందం లైబీరియా చేరుకున్న తరువాతనే అక్కడి మహిళలు పోలీసు బలగాల్లోకి నాలుగు రెట్లు ఎక్కువగా చేరి పనిచేస్తున్నారు.

అమీనా మహమ్మద్ మాట్లాడుతూ, అనేక నెలలు, సంవత్సరాలు లైబీరియాలో శాంతి, సుస్థిరత నెలకొనేందుకు అవిరళ కృషి చేశారని అన్నారు. లక్ష మందికి పైగా తిరుగుబాటు దళాలను నిరాయుధులను చేసి కోట్లాది మంది పౌరులను రక్షించారు. భద్రతా వ్యవస్థను, ఇతర సంస్థల నిర్మాణాన్ని చేపట్టి మానవీయ కోణంలో సహాయాన్ని మహిళా బృందాలు అందించాయని అమినా అన్నారు. తమ దేశానికి అందించిన సేవలకుగానూ లైబీరియా నేత వియహ్ మహిళా దళాలకు అభినందనలు తెలిపారు.



నగదు నిల్వలు లేని డెబిట్ కార్డులపై

చార్జీల మోత

ఒక్కో లావాదేవీపై రూ.17-25 వసూలు చేస్తున్న బ్యాంకులు

ముంబై: ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తుంటే మరోవైపు బ్యాంకులు మాత్రం క్రెడిట్ కార్డులపై చార్జీల మోత మోగిస్తున్నాయి. అకౌంట్‌లో డబ్బులు లేకపోయిన డ్రా చేయడానికి ప్రయత్నిస్తే అందుకు తగిన చార్జీలు చెల్లించక తప్పదని బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. కనీస నగదు నిల్వలు లేని డెబిట్ కార్డుల ఒక్కో లావాదేవీపై రూ.17 నుంచి రూ.25 వరకు బ్యాంకులు చార్జీలు విధిస్తున్నాయి. జీఎస్టీని అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) అయితే ఏటీఎం లేదా పాయింట్ ఆఫ్ సేల్(పీవోఎస్) టర్మినల్ వద్ద స్వైపింగ్ ఫెయిల్ అయిన లావాదేవీపై రూ.17 చొప్పున చార్జీ విధిస్తున్నది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్‌లు రూ.25 విధిస్తున్నాయి. ఈ చార్జీల విధింపుపై ఐఐటీ-బాంబే ప్రొఫెసర్ అశిష్ దాస్ అభ్యంతరాలను వ్యక్తంచేశారు. కేంద్రం ఒకవైపు రాయితీలు ప్రకటిస్తున్నప్పటికీ, మరోవైపు బ్యాంకులు మాత్రం జేబులకు చిల్లులు పెడుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రస్తుత సిస్టమ్ డిజిటల్ రంగానికి వ్యతిరేకంగా ఉన్నదని(ఫీజు వసూలు), దీంతో సామాన్య ప్రజలు వారి వేతనంలో ఎలా పొదుపు చేసుకోగలుగుతారని ఆయన ప్రశ్నించారు.

జైల్లో ఖైదీలు ఎక్కువయ్యారని వదిలేశారు



జింబాబ్వే: సత్ప్రవర్తన కారణంగా గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఖైదీలకు క్షమాభిక్ష పెట్టడం మన దగ్గర చూస్తుంటాం. కానీ జైళ్లన్నీ ఖైదీలతో నిండిపోయి ఇరుకుగా మారాయని 3000మందికి క్షమాభిక్ష పెట్టిన సంఘటన మాత్రం జింబాబ్వేలో జరిగింది. జింబాబ్వే అధ్యక్షుడు ఎమర్సన్ మాంగాగ్వా జైళ్లన్నీ ఖైదీలతో కిటకిటలాడుతున్నాయని ఈ నిర్ణయం తీసుకున్నారు. జీవిత ఖైదును అనుభవిస్తున్న మహిళలను మినహాయించి మిగతా మహిళా ఖైదీలు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారు, జువెనైల్ ఖైదీలు విడుదలైన వారిలో ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు, 60 సంవత్సరాలు పైబడిన ఖైదీలూ ఇందులో ఉన్నారు. రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు వీరికి క్షమాభిక్ష పెట్టారని జింబాబ్వే ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. 'ఖైదీలు ఎక్కువడంతో ఇరుకుగా మారిన జైళ్లను కొంతమేర ఖాళీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని అందులో తెలిపారు. 3000మందిని విడుదల చేయడంతో ఆ దేశంలో ఖైదీల సంఖ్య 17వేలకు చేరుకుంది. హత్య, దేశద్రోహం, అత్యాచారం, కార్‌జాకింగ్, దోపిడీ వంటి నేరాల కింద శిక్ష పడిన వారికి ఈ క్షమాభిక్ష లభించలేదు.

కష్టాల్లో ఫేస్‌బుక్

- దూరమవుతున్న వ్యాపారం
- డాటా లీకేజీ వ్యవహారంతో ప్రకటనల్ని నిలిపివేస్తున్న ప్రముఖ సంస్థలు



న్యూయార్క్:యూజర్ డాటా లీకుల అంశం.. ఫేస్‌బుక్‌ను తీవ్రంగానే ప్రభావితం చేస్తున్నది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి అనుబంధంగా పనిచేసిన రాజకీయ కన్సల్టింగ్ సంస్థ కేంబ్రిడ్జ్ అనలిటి కాకు 5 కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం చిక్కిందన్న దానిపై ప్రస్తుతం పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమ వుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఫేస్‌బుక్‌తో పలు సంస్థలు తమ వ్యాపార సంబంధాలను తెంచుకుంటున్నాయి. మొజిల్లా, టెస్లా, స్పేస్ ఎక్స్ తదితర ప్రముఖ కంపెనీలు ఈ సోషల్ మీడియా దిగ్గజానికి దూరంగా జరుగుతున్నాయి. అయితే ఇది శాశ్వ తం కాకపోవచ్చన్న సంకేతాలిస్తుండటం ఫేస్‌బుక్‌కు కాస్త ఊరటనిస్తుండగా, అయినప్పటికీ ఈ వివాదం కారణంగా ఫేస్‌బుక్‌కు మాత్రం భారీ నష్టమే వాటిల్లుతున్నది. ఫేస్‌బుక్‌తో అనుబంధానికి మేము కాస్త విరామం ఇచ్చాం అని మొజిల్లా తెలిపింది. అయితే ఫేస్‌బుక్‌లో వ్యాపార పరమైన ప్రకటనలకే దూరంగా ఉంటామని, ఫేస్‌బుక్ పేజీపై పోస్టింగ్‌ల విషయంలో కాదని చెప్పింది. యూజర్ల డాటాను రక్షించేలా సమర్థవంతమైన చర్యలను తీసుకుంటే, వ్యక్తిగత సమాచార భద్రతను మరింతగా కట్టుదిట్టం చేస్తే వ్యాపార ప్రకటనలను పునరుద్ధరించే యోచన చేస్తామన్నది. ఫైర్‌ఫాక్స్ వెబ్ బ్రౌజర్‌ను సృష్టించినది మొజిల్లానేనన్న సంగతి విదితమే. జర్మనీకి చెందిన కామర్జ్‌బ్యాంక్ కూడా ఫేస్‌బుక్ అడ్వర్‌టైజ్‌మెంట్లను పక్కనబెట్టింది. స్పీకర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ సోనోస్ సైతం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియా నుంచి వ్యాపార ప్రకటనల్ని విరమించుకుంటున్నట్లు పేర్కొన్నది. ఫేస్‌బుక్ సైట్ల నుంచి తప్పుకుంటున్నట్లు, ఖాతాలను తొలగిస్తున్నట్లు టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల సీఈవో ఎలన్ మస్క్ చెప్పారు.

లక్షల కోట్ల సంపద ఆవిరి : ఈ ఏడాది ప్రపంచ కుబేరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. దాదాపు గడిచిన ఈ రెండు నెలల్లోనే టాప్-500 సంపన్నులు రూ.28,34,000 కోట్ల (436 బిలియన్ డాలర్ల)ను కోల్పోయారు. వీరిలో ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ సంపద అత్యధికంగా రూ.67 వేల కోట్లు (10.3 బిలియన్ డాలర్లు) హరించుకుపోయింది. అంతర్జాతీయ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం, ఇటీవలి డేటా లీకేజీ వ్యవహారం మధ్య జూకర్‌బర్గ్.. బ్లూంబర్గ్ బిలియనీర్స్ సూచీలో మూడు స్థానాలు దిగజారారు.

4వ స్థానం నుంచి 7వ స్థానానికి పడిపోయారు. కేవలం డేటా లీక్ వార్తలతోనే స్టాక్ మార్కెట్‌లో ఫేస్‌బుక్ షేర్ విలువ 14 శాతం నష్టపోయింది.డేటా లీకేజీపై స్పందిస్తూ ఇప్పటికే జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పగా, విచారణలో భాగంగా ఆయనకు సమన్లు అందుతున్న విషయం తెలిసిందే. ఇక జనవరి 26 నుంచి ఇప్పటిదాకా ప్రపంచంలోని 500 మంది కుబేరుల సంపద 436 బిలియన్ డాలర్లు కరిగిపోతే.. ఈ ఒక్క వారమే 181 బిలియన్ డాలర్లు తరిగిపోవడం గమనార్హం. ఒరాకిల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన లర్రీ ఎల్లిసన్ 7 బిలియన్ డాలర్లు చేజార్చుకోగా, బెర్క్‌షైర్ హాథవే చైర్మన్ వారెన్ బఫెట్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, అల్ఫాబెట్ సీఈవో లర్రీ పేజ్‌లు 17 బిలియన్ డాలర్లను వదులుకోవాల్సి వచ్చింది. కాగా, ఈ 500 మంది సంపన్నుల మొత్తం సంపద 5.2 లక్షల కోట్ల డాలర్లుగా ఉంటుందని బ్లూంబర్గ్ అంచనా.



లగ్జరీ వీకెండ్ ఫెస్ట్‌కు 'బెంజ్‌మహావీర్' ఆతిథ్యం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా వున్న మెర్సిడెస్ -బెంజ్ మహావీర్ మోటర్స్ రెండు రోజుల పాటు నిర్వహించే లగ్జరీ వీకెండ్ ఫెస్ట్‌కు ఆతిథ్యమిచ్చింది. మెర్సిడెస్ బెంజ్ మహావీర్ మోటర్స్ నిర్వహిస్తున్న వార్షిక లగ్జరీ వీకెండ్ ఫెస్ట్ రెండవ ఎడిషన్ ఇది. ఈ ఫెస్ట్‌లో విలాసవంతమైన బ్రాండ్లు అస్మితా మార్వా, కనాలీ, ఎంటర్‌టైన్‌మెంట్ స్టోర్, గుస్సీ, ఫెర్రాగమో, ఎంపోరియో ఆర్మానీ, ఎక్స్‌బాక్స్, పీఎస్4, ఐపోన్‌ఎక్స్, శాంసంగ్‌ఎస్9 ప్రదర్శించనున్నారు. అస్మితా మార్వా తన నూతన సమ్మర్ కలెక్షన్ 18ను ట్రంక్‌షోలో ప్రదర్శించారు. రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్, సస్టెయినబుల్ ఫ్యాషన్‌తో అందరినీ అకర్షించింది.రెండు దశాబ్దాలుగా 4500 మంది వినియోగదారులతో మెర్సిడెస్ బెంజ్ మహావీర్ మోటర్స్ నగరంలో తమ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

కమ్డ్ కే యుని-గేజ్ పరీక్షకు వర్సిటీల గుర్తింపు



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: కమ్డ్ కే యుని-గేజ్ ఏకీకృత ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షా విధానానికి 150కి మించిన విద్య సంస్థలు, 25 యూనిర్సిటీలు గుర్తింపు నిచ్చాయని ఎరా ఫౌండేషన్ సీఈఓ మురళీధర్ తెలిపారు. లక్ష మందికి పైగా విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తూ దేశంలో అతిపెద్ద బహుళ విశ్వ విద్యాలయాల ప్రైవేట్ ఇంజినీరింగ్ పరీక్షగా ఇది మారిందన్నారు. కామన్ ఎంట్రన్స్ పరీక్షకు దేశంలో 100 ప్రైవేట్ యూనివర్సిటీల, 300 కళాశాలలకు నిర్వహించడమే తమ ధ్యేయమన్నారు. 2020 నాటికీ ఈ విధంగా 50 వేల ఇంజినీరింగ్ సీట్లను విద్యార్థులకు అందించడమే తమ ధ్యేయమన్నారు.


మడతబెట్టే ఐఫోన్

ముంబై: ఐఫోన్.. ఆ పేరుకు, ఫోన్లకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అందుకే యాపిల్ నుంచి ఒక కొత్త మోడల్ విడుదలవుతుందంటే చాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుంటారు గ్యాడ్జెట్ ప్రియులు. ఇక మార్కెట్లోకి వచ్చిందంటే హాట్‌కేక్‌ల్లా అమ్ముడవుతాయి. తాజాగా యాపిల్ ఓ సరికొత్త ప్రయత్నం చేసేందుకు సిద్ధమైంది. ఆసియా పార్ట్‌నర్ ఎల్‌జీ డిస్‌ప్లేతో కలిసి మడతబెట్టే ఐఫోన్‌ను తీసుకురానున్నట్లు టెక్ వర్గాల సమాచారం. అయితే ఈ వార్తకు సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. ఈ మడతబెట్టే ఐఫోన్‌ను 2020లో విడుదల చేసేందుకు యాపిల్ ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. ఈ మేరకు అంతర్జాతీయ టెక్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ మోడల్ కోసం ప్రత్యేక నిపుణల బృందాన్ని కూడా కేటాయించినట్లు సమాచారం. అయితే దీనిపై అటు యాపిల్ నుంచిగానీ.. ఇటు ఎల్‌జీ నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఎల్‌జీ డిస్‌ప్లేతో కలిసి తాము కొత్త డిజైన్ కోసం పనిచేస్తున్నట్లు గతేడాది యాపిల్ ప్రకటించింది.



శరణార్థుల బహిష్కరణపై ఇజ్రాయిల్‌లో నిరసన

జెరూసలెం:ఇజ్రాయిల్‌లోకి ప్రవేశించిన వేలాది మంది శరణార్థులను బహిష్కరించాలని ముఖ్యంగా సెంట్రల్ టెలీఅవీవ్ నుంచి శరణార్థులను బయటకు పంపాలని ప్రభుత్వం చేసిన నిర్ణయంపై వేలాది మంది నిరసన ప్రదర్శన జరిపారు. ఈ నిరసన ప్రదర్శనలో 20వేల మందికిపైగా పాల్గొన్నట్టు మీడియా తెలిపింది. ప్రదర్శనలో శరణార్థులు కూడా పాల్గొన్నారు. మేమంతా మానవులమే అంటూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ పౌరుల రక్తానికి, తమ రక్తానికి తేడా ఏమి లేదంటూ శరణార్థులు నినదించారు. ఎరిట్రియా, సూడాన్ దేశాల నుంచి శరణార్థులు ఎక్కువగా ఇజ్రాయిల్ చేరుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాన్ని ఈ నెల ప్రారంభంలో దేశ సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. ప్రభుత్వం ఈ నెల 26వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెలారంభంలో మాట్లాడుతూ అక్రమంగా దేశం లో ప్రవేశించిన శరణార్థులు తమంతట తాముగా దేశాన్ని వదిలివెళ్లిపోవాలని లేదంటే జైళ్లలో ఉండవలసి వస్తుందని ప్రకటించారు. చివరకు బలవంతంగా దేశం నుంచి వంపివేస్తామని అన్నారు. ఇజ్రాయిల్, ఈజిప్టు సరిహద్దులో విద్యుత్ కంచెను నిర్మించామని లేకపోతే ప్రవాహంలాగా శరణార్థులు దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారని అన్నారు. దేశంలోకి ఇంత వరకు 42వేల మంది శరణార్థులు వచ్చినట్టుగా ఆంతరంగిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2007 నుంచే దేశంలోకి శరణార్థుల రాక ప్రారంభమైంది. యూదుయేతరులు శరణార్థులుగా వచ్చి ఇజ్రాయిల్ సమాజాన్ని నాశనం చేస్తారని ఆరోపించారు. శరణార్థులు అక్రమ చొరబాటు దారులని దుయ్యబట్టారు.



తుపాకి సంస్కృతి అంతానికి

అమెరికాలో 800 చోట్ల ప్రదర్శనలు

వాషింగ్టన్:తుపాకులను నియంత్రించి విద్యాలయాలకు మరింత రక్షణ కల్పించాలని, తుపాకి హింసను పూర్తిగా అరికట్టాలని కోరుతూ వాషింగ్టన్ డీసీతో సహా 800 ప్రాంతాలలో విద్యార్థులు నిరసన ప్రదర్శనలు నిర్వహిం చారు. వాంషింగ్టన్ డీసీలో అనేక పదుల వేల మంది నిర సన ప్రదర్శన జరిపారు. కాల్పులు పునరావృతం కారాదు, తదుపరి నేనే బలికావాలా? అని నినాదాలు చేస్తూ ప్రదర్శనకారులు ఇక్కడ పెన్సిల్వేనియా అవెన్యూలో చేరారు. ఈ ప్రాంతం క్యాపిటల్ హిల్‌ను, వైట్‌హౌస్‌ను సంధానం చేస్తుంది. మా ప్రాణాల భద్రత కోసం ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామని ప్రదర్శకులు నినదించారు. ఫిబ్రవరి 14న ఫ్లోరిడాలోని పార్క్‌లాండ్ హైస్కూల్‌లో 19 ఏళ్ల నికోలస్ క్రజ్ కాల్పులు జరిపి 17 మంది విద్యార్థులను పొట్టనబెట్టుకున్న తరువాత దేశవ్యాప్తంగా ట్రంప్ ప్రభుత్వంపై ఆగ్రహం పెల్లుబికింది. తుపాకి సంస్కృతిని నిలువరించాలన్న డిమాండు అపారంగా పెరిగిపోయింది. వాషింగ్టన్‌లోనే కాక అమెరికాలోని 800 ప్రాంతాలలో ఇలాంటి నిరసన ప్రదర్శనలు జరిగాయి. నిరసన ర్యాలీ లు జరిగిన నగరాలలో లాస్ ఏంజెల్స్, బోస్టన్, ఫిలడ ల్ఫియా, న్యూయార్క్, పార్క్‌ల్యాండ్ ఉన్నాయి. న్యూయార్క్‌లో వేలాది మంది యువతీ యువకులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, వణికిస్తున్న చలిలోనూ ప్రదర్శన జరిపారు. తక్షణం కాంగ్రెస్ తపాకి సంస్కృతిని నియంత్రించే చట్టాలు చేయాలని నినాదాలు చేశారు. చికాగోలో వేలాది మంది యూనియన్ పార్కు వద్ద చేరి ర్యాలీ నిర్వ హించారు. ఇక్కడ ఉష్ణోగ్రత 2డిగ్రీల సెల్సెస్‌కు పడిపో యింది. ర్యాలీనుద్దేశించి అనేక మంది విద్యార్థులు ప్రసంగించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోనూ వేలాది మంది విద్యార్థులు ర్యాలీ జరిపారు. బర్లింగ్‌గమి నగరంలో విద్యార్థులు తుపాకులు వద్దని నినాదాలు చేశారు.



వేసవిలో వీటిని తినకుంటే మంచిది

వేసవిలో కొన్ని పదార్థాలు నోరూరించినా వీలైనంతవరకు తగు మోతాదులోనే తీసుకోవాలి. లేదంటే కడుపు ఉబ్బరంతో పాటు అజీర్ణం వంటి సమస్యలూ ఎదురుకావచ్చు. వాటిని అధిగమించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటంటే...

- ఎండలు పెరిగే క్రమంలో రోజువారీ తీసుకునే ఆహారంలో కారం, మసాలాల మోతాదును చాలా వరకు తగ్గించాలి. ఇవి శరీరంలోని వేడిని పెంచి జీవక్రియ రేటు మందగించడానికి కారణమవుతాయి.

- మాంసాహారం కూడా అతిగా తినకూడదు. చికెన్, మటన్.... వంటివి ఈ కాలంలో జీర్ణ సంబంధ సమస్యల్ని పెంచుతాయి. అరుగుదల మందగించడం, విరేచనాలు, మలబద్ధకం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి.

- వేసవిలో ప్రధానంగా బాధించేది డీహైడ్రేషన్. నీళ్లు ఎక్కువగా తీసుకున్నప్పటికీ కాఫీ, టీల మోతాదును తగ్గించుకోవాలి. వీటిని అతిగా తీసుకోవడం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ ఎదురుకావచ్చు. శరీరం కూడా తేమని కోల్పోయి నిర్జీవంగా మారుతుంది.

- నూనెలో వేయించినవి తగ్గించాలి. వేపుళ్లు, ఫ్రెంచ్ ఫ్రైస్, ఆలూ చిప్స్ వంటివి వాటిని దూరంగా ఉంచాలి. ముఖ్యంగా ప్రయాణాల సమయంలో వీటి జోలికి వెళ్లకూడదు. లేదంటే వికారం, అతిగా దాహం వేయడం వంటివి తప్పవు.

- జంక్ ఫుడ్ కూడా ఈ కాలంలో మంచిది కాదు. ఇందులో అధికంగా కేలరీలు ఉండడం వల్ల బరువు పెరిగే అవకాశం ఎక్కువ. పైగా పొట్ట ఉబ్బరం, గ్యాస్ వంటివి ఎదురవుతాయి.



ఇంటివైద్యంగా పనిచేసే బొప్పాయి





సాధారణంగా చాలామంది పిల్లలు చాక్లెట్లు, ఐస్ క్రీం లాంటివి తినటానికి ఇష్టపడతారు. ఇవి ఆరోగ్యానికి చాలా హానికరం. వీటివల్ల తరచుగా జలుబు, దగ్గు, జ్వరం లాంటివి వస్తూ ఉంటాయి. కనుక పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే వారికి పండ్లను తినటం అలవాటు చేయాలి. ఏ సీజన్‌లో దొరికే పండును ఆ సీజన్లో పిల్లలకు పెట్టడం వల్ల వారికి అన్ని రకాల విటమిన్స్ అందుతాయి. దీనివలన పిల్లలు చదువులోను, ఆట పాటలలోను ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. మరి ముఖ్యంగా బొప్పాయిలో చాలా రకాల ఔషధ గుణాలు ఉన్నాయి.

అవి ఏమిటంటే.. బొప్పాయి పండు ఇంట్లో ఉంటే ఇంటిల్లిపాదికీ గృహవైద్యంగా పనిచేస్తుంది. ఎలా అంటే బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్లు భారీగా ఉంటాయి. ఇవి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. ప్రోటీన్లను జీర్ణం చేసే పపాయిన్ అనే ఎంజైము బొప్పాయిలో సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల భోజనం తర్వాత నాలుగు బొప్పాయి ముక్కలు తింటే అది కడుపులో ఏ విధమైన ఇబ్బంది కలగకుండా చూస్తుంది. ఇది మాంసాన్ని కూడా త్వరగా అరిగేలా చేస్తుంది. బొప్పాయిలో ఎ, బి, సి, ఇ విటమిన్లతో పాటు ఖనిజాలు, ఫ్లేవనాయిడ్స్ వంటి మరెన్నో పోషకాలు ఉంటాయి.

కొలెస్ట్రాల్‌ని తగ్గించడం ద్వారా ఇది గుండె జబ్బులను నివారిస్తుంది. ఇది నరాల బలహీనతలను తగ్గించే మంచి టానిక్ కూడా. క్యాల్షియం, పాస్ఫరస్ ఐరన్, మెగ్నీషియం, సోడియం, పొటాషియం, గంధకం, క్లోరిన్ వంటి పోషకాలు తగు మోతాదులో ఉండటం వల్ల బొప్పాయి పలు శారీరక రుగ్మతలకు అడ్డుకట్ట వేయగలుగుతుంది. కంటి చూపుకు మేలు చేసే విటమిన్ ఎ, ఇలు కూడా బొప్పాయిలో ఉంటాయి.

పచ్చి ఉల్లిపాయతో

షుగర్ వ్యాధి అదుపులో..

ప్రస్తుత కాలంలో చాలామంది షుగర్ వ్యాధితో అనేక రకాలైన ఇబ్బందులు పడుతున్నారు. మందులు వాడుతున్నా తీసుకునే ఆహారం సరియైనది కాకపోవడం వల్ల షుగర్ వ్యాధి పెరిగి పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తోంది. మందులతో పాటు కొన్ని ఆహార నియమాలు పాటించడం వల్ల షుగర్ వ్యాధిని కంట్రోల్ చేసుకోవచ్చు. ఈ వ్యాధిని మనం ఇంట్లో రోజూ వాడే పచ్చి ఉల్లిపాయతోనే కంట్రోల్ చేసుకోవచ్చు. అదెలాగో ఇప్పుడు చూద్దాం.




- రోజుకి 50 గ్రాముల పచ్చి ఉల్లిపాయను ఖచ్చితంగా తినాలి. 50 గ్రాములు ఒకేసారి తినలేకపోతే ఉదయం కొద్దిగా, మధ్యాహ్నం కొద్దిగా, సాయంత్రం కొద్దిగా తింటూ ఉండాలి.
- షుగర్ వ్యాధి ఎక్కువగా ఉన్నవారు ప్రతిరోజు ఖచ్చితంగా ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకుంటారు. ఇన్సులిన్‌కి బదులు 50 గ్రాముల పచ్చి ఉల్లిపాయను ప్రతిరోజు తినడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. 50 గ్రాముల పచ్చి ఉల్లిపాయ 20 యూనిట్ల ఇన్సులిన్‌తో సమానం.
- ఏడు రోజులు క్రమంతప్పకుండా ఈ పచ్చి ఉల్లిపాయను తినడం వల్ల బాగా ఎక్కువగా ఉన్న షుగర్ లెవల్ కంట్రోల్ అవుతుంది.
- పచ్చి ఉల్లిపాయతో పచ్చి పులుసు చేసుకుని అన్నంలో కలుపుకుని తిన్నా కూడా షుగర్ కంట్రోల్ అవుతుంది.

గుండె నొప్పి రాకుండా కాపాడే జీలకర్ర



కడుపులో వికారంగా ఉండి పుల్లని తేపులతో బాధపడేవారు కొంచెం జీలకర్రను నమిలి రసం మింగితే ఉపశమనం కలుగుతుంది. కడుపులో నులిపురుగులను నివారిస్తుంది. దీనిని తరచూ నమిలి రసం మింగుతుంటే కడుపులో ఉన్న నులిపురుగులను నివారించడమే కాదు, ఉదర సంబంధ వ్యాధులు కూడా తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జీలకర్రను కషాయంగా కాచి తాగుతుంటే ఎలర్జీ వల్ల కలిగే బాధలు తగ్గుతాయి. నల్ల జీలకర్ర కషాయాన్ని సేవిస్తే షుగర్, బీపీని అదుపులో ఉంచుతుంది. గుండె నొప్పులు రాకుండా కాపాడుతుంది.

డయేరియాతో బాధపడేవారు ఒక టీస్పూన్ జీలకర్ర నీటితో తీసుకుని ఒక టీస్పూన్ కొత్తిమీర, రసం, జీలకర్ర, చిటికెడు ఉప్పు కలిపి తీసుకుంటుంటే డయేరియా తగ్గుతుంది. భోజనం తర్వాత ఇలా రెండు సార్లు తీసుకోవాలి. నల్ల జీలకర్ర మూలశంకకు మంచి మందు. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు నల్లజీలకర్రను వేయించి మగ్గిన అరటిపండుతో తీసుకుంటే నిద్రలేమి సమస్య పరిష్కారం అవుతుంది.



విశాలాంధ్ర సినిమా

సి. కళ్యాణ్ నిర్మాతగా బాలయ్య కొత్త సినిమా

బాలకృష్ణ, తేజ కాంబినేషన్ లో రూపొందే ఎన్టీఆర్ బయోపిక్ సినిమా ఈ నెల 29 న రామకృష్ణ స్టూడియోలో ప్రారంభం కానుంది. కీరవాణి. ఈ సినిమాకు సంగీతం అందించబోతున్నాడు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. నటీనటుల ఎంపిక జరుగుతోంది. ఈ సినిమాతో పాటు బాలయ్య మరో సినిమా చెయ్యబోతున్నాడు. బాలయ్యతో జై సింహ సినిమాను సి. కళ్యాణ్ నిర్మించిన విషయం తెలిసిదే. మరోసారి బాలయ్యతో మూవీ నిర్మించ బోతున్నాడు. వివి.వినాయక్ ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడు. స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్న ఈ సినిమా మే 27 న ప్రారంభం కానుందని మీడియాతో సి.కళ్యాణ్ చెప్పారు. గతంలో వినాయక్, బాలయ్య కాంబినేషన్ లో చెన్నకేశవ రెడ్డి సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. సి.కళ్యాణ్ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అమెరికా టూర్‌కు నాగ చైతన్య, సమంత!

నాగ చైతన్య, సమంత జంట పెళ్లయ్యాక పెద్దగా ఎటూ వెళ్లింది లేదు. అప్పటి నుంచి వరుస సినిమా షూటింగ్స్‌తో బిజీబిజీగా ఉన్నారు. పెళ్లయ్యాక ఇద్దరికీ చేతినిండా ప్రాజెక్ట్స్ వచ్చి పడ్డాయి. ప్రస్తుతం సామ్ తనకు సంబంధించిన మూడు సినిమాలు రంగస్థలం, ఇరంబు తిరై, మహానటి షూటింగ్‌లను పూర్తి చేసుకుని కాస్త రిలాక్స్ అవుతోంది. చైతు మాత్రం షూటింగ్స్‌తో బిజీగానే ఉన్నాడు. ఇవి కాక వీరిద్దరూ కలిసి రెండు సినిమాలకు సైన్ చేసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి మల్టీస్టారర్ అయితే.. మరొకటి వీరిద్దరూ లీడ్ రోల్ పోషిస్తున్న సినిమా. ఈ వరుస సినిమాలు, బిజీ లైఫ్‌తో బోర్ కొట్టిందేమో తెలీదు కానీ ఇద్దరూ తమ షూటింగ్స్‌కి ఓ రెండు వారాలపాటు బ్రేక్ ఇచ్చి యూఎస్‌లో విశ్రాంతి తీసుకునేందుకు వెళ్దామని ప్లాన్ చేసుకున్నట్టు సమాచారం.

'భరత్ అనే నేను' మొదటి పాట విడుదల



సూపర్‌స్టార్ మహేష్, సూపర్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమతి డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై స్టార్ ప్రొడ్యూసర్ దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న భారీ చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా, ఈ చిత్రంలోని మొదటి పాటను ఆదివారం ఉదయం 10 గంటలకు విడుదల చేశారు. 'విరచిస్తా నేడే నవశకం.. నినదిస్తా నిత్యం జనహితం.. నలుపెరుగని సేవే అభిమతం.. కష్టం ఏదైనా సమ్మతం,..భరత్ అనే నేను.. హామీ ఇస్తున్నాను.. బాధ్యుడ్నై ఉంటాను.. ఆఫ్ ద పీపుల్, బై ద పీపుల్, ఫర్ ద పీపుల్ ప్రతినిధిగా.. దిస్ ఈజ్ మి' అంటూ రామజోగయ్య శాస్త్రి రాసిన అద్భుతమైన సాహిత్యానికి దేవిశ్రీ ప్రసాద్ వీనుల విందైన సంగీతం తోడైంది. సంగీతం, సాహిత్యం సమపాళ్లలో కుదిరిన ఈ పాటను డేవిడ్ సైమన్ అంతే అద్భుతంగా ఆలపించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్, విజన్ ఆఫ్ భరత్ టీజర్‌లకు మంచి వస్తోంది. ఈరోజు విడుదలైన మొదటి పాటతో సినిమాపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఉన్న అంచనాలు రెట్టింపు అయ్యాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా 'భరత్ అనే నేను' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

సూపర్‌స్టార్ మహేష్, హీరోయిన్ కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్‌ల తోపాటు ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈ చిత్రానికి ఈ చిత్రానికి సంగీతం : దేవిశ్రీప్రసాద్, పాటలు : రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీ : రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, ఎడిటింగ్ : శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ : శ్రీమతి డి.పార్వతి, నిర్మాత : దానయ్య డి.వి.వి., దర్శకత్వం : కొరటాల శివ.



'ఇంతలో ఎన్నెన్ని వింతలో' ఏప్రిల్ 6న విడుదల

హరహర చలన చిత్ర సమర్పణలో ఎస్ శ్రీకాంత్ రెడ్డి, రామమోహనరావు ఇప్పిలి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. ఈ చిత్రానికి హీరో హీరోయిన్లు నందు, సౌమ్య వేంగోపాల్, పూజ రామచంద్రన్ కాగా ..దర్శకుడు వరప్రసాద్ వరికూటి. ఈ చిత్రం అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకొని ఏప్రిల్ 6న విడుదలకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు చిత్ర యూనిట్.

ఈ సందర్భంగా నిర్మాత రామమోహనరావు మాట్లాడుతూ 'ఇటీవలే ఈ చిత్ర పాటలు ఎఫ్ ఎమ్ ద్వారా విడుదలయ్యాయి.. 3పాటలను అందరూ అభినందిస్తున్నారు.. నలుగురి మధ్య ఉత్కంఠభరితంగా సాగే కథతో సినిమా చాలా బాగా వచ్చింది.. ఆడియోన్స్‌కు ఫ్రెష్ గా ఫీల్ కలుగుతుంది' అన్నారు.

అనంతరం దర్శకుడు వరప్రసాద్ వరికూటి మాట్లాడుతూ 'ఇది నా మొదటి చిత్రం. సినిమా మొదలు పెట్టినప్పుడు ఎలాంటి కాంఫిడెన్స్‌తో అయితే ఉన్నామో అదే కాంఫిడెన్స్ తో ఇప్పటికీ వున్నాము.

కథ, స్క్రీన్ ప్లే ఈ చిత్రంలో హైలెట్స్‌గా నిలబడతాయి. ఆరోగ్యకరమైన గార్డెన్ నుంచి ఒక ఫ్రూట్ బయటకు వస్తే ఎలా ఫీల్ అవుతారో ఆ ఫ్రెష్ ఫీల్‌ను సినిమా చూస్తున్నప్రేక్షకులు అనుభవిస్తారు. నాకు మంచి ప్రొడక్షన్ దొరికింది.. వెల్ టెక్నీషియన్స్‌తో పాటు పవర్ ఫుల్ ఆర్టిస్ట్స్ ను నాకు అందించారు నిర్మాతలు.. ప్రేక్షకునికి కావాల్సినవన్నీ ఈ సినిమాలో ఉన్నాయి. అందుకే తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుందని భావిస్తున్నా' అన్నారు.

'నవమి' సందర్భంగా 'శ్రీనివాస కళ్యాణం' టీజర్!



సతీష్ వేగేశ్న దర్శకత్వంలో నితిన్ నటిస్తున్న 'శ్రీనివాస కళ్యాణం' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ప్రస్తుతం అమలాపురం సమీపంలో నితిన్, నందిత శ్వేతాలతో పాటు మరికొందరు నటీనటులపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు యూనిట్. అయితే ప్రారంభం రోజున మోషన్ పోస్టర్స్ కూడిన టీజర్‌ను విడుదల చేసి ఆశ్చర్యపరిచిన మేకర్స్.. ప్రస్తుతం మరో టీజర్ ను విడుదల చేసే ప్రయత్నంలో ఉన్నారట. 'శ్రీ రామనవమి' సందర్భంగా మోషన్ పోస్టర్స్ తో కూడిన మరో టీజర్‌ని సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేయబోతున్నారని తెలుస్తోంది.

'శతమానం భవతి' సూపర్ హిట్ తర్వాత దిల్ రాజు -సతీష్ వేగేశ్న కాంబినేషన్‌లో కుటుంబ కథా చిత్రంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నితిన్ సరసన రాశి ఖన్నా హీరోయిన్ గా నటిస్తోంది. నందిత శ్వేతా ఓ ముఖ్యపాత్రలో నటిస్తోంది. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీత దర్శకుడు.

వెంకటేష్, వరుణ్ తేజ్ మల్టీస్టారర్..

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్, వరుణ్ తేజ్ నటించబోతున్న వార్త గత కొంత కాలంగా వినిపిస్తోంది. శ్రీరామనవమి సందర్భంగా ప్రాజెక్ట్ ను అధికారికంగా అనౌన్స్ చేశారు. ఎఫ్ 2 పేరుతో ఈ సినిమా రూపొందనుంది. దిల్ రాజు నిర్మించబోతున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. వెంకటేష్ ప్రస్తుతం తేజ దర్శకత్వంలో నటిస్తున్నాడు. ఈ సినిమా తరువాత అనిల్ రావిపూడి సినిమా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు బాబి దర్శకత్వంలో మరో మల్టి స్టారర్ సినిమాలో నటించబోతున్నాడు. ఈ సినిమాలో నాగ చైతన్య మరో హీరోగా నటిస్తున్నాడు. ఫ్యామిలి ఎంటర్టైనర్‌గా తెరకెక్క బోతున్న ఈ సినిమాను త్వరలో ప్రకటించ నున్నారు. అనిల్ రావిపూడి సినిమా వినోదభరితంగా ఉండబోతోందని సమాచారం.

ఛల్ మోహన్ రంగ శాటిలైట్ రైట్స్ జీ తెలుగుకు..



ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెల్ జీ తెలుగు., నితిన్ నటించిన ఛల్ మోహన్ రంగ మూవీ శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా శాటిలైట్ రైట్స్‌ను 4 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటైన ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుకను కూడా ప్రత్యక్ష ప్రసారం చేసింది జీ తెలుగు. నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటించిన సినిమా ఛల్ మోహన్ రంగ. వీళ్లిద్దరి కాంబోలో రెండో సినిమా ఇది. కృష్ణ చైతన్య ఈ సినిమాకు దర్శకత్వం వహించగా, మణిశర్మ సంగీతం అందించాడు. శ్రేష్ట్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్లపై తెరకెక్కిన ఈ సినిమాకు త్రివిక్రమ్ కథ అందించాడు. ఏప్రిల్ 5న థియేటర్లలోకి రానుంది.



'నీది నాది ఒకే కథ' రీమేక్‌లో ధనుష్

తెలుగులో మంచి విజయాలు సాధించిన సినిమాలు తమిళ్‌లో రీమేక్ అవుతుంటాయి. తాజాగా వేణు ఉడుగుల దర్శకత్వంలో వచ్చిన నీది నాది ఒకే కథ సినిమా గత శుక్రవారం విడుదలై మంచి విజయం సాధించింది. సురేష్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ సినిమాకు నాగేశ్వరరెడ్డి బొంతల ఎడిటర్‌గా పనిచేశారు. తాజా సమాచారం మేరకు ఈ సినిమాను తమిళ్‌లో నిర్మాత కాలైపులి దాస్ రీమేక్ చెయ్యబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను నిర్మాత చెన్నైలో చూసినట్లు సమాచారం. ధనుష్ అయితే ఈ సినిమాకు బాగుంటాడని భావించి, ఆయనను నిర్మాత సంప్రదించినట్లు తెలుస్తోంది. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. నీది నాది ఒకే కథ విడుదల తరువాత శ్రీ విష్ణుకు మంచి పేరు రావడమే కాకుండా నటుడిగా మంచి గుర్తింపు లభించింది.

భారత్‌లో జైలుపక్షులు తక్కువే!

న్యూఢిల్లీ: అభివృద్ధి సూచిలో, సంతోషకర దేశాల జాబితాలో భారత్ వెనుకబడి ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా తక్కువ మంది జైలు జీవితం గడుపుతున్న వారి జాబితాలో మాత్రం ముందంజలో ఉన్నది. భారత్‌లో ప్రతి లక్ష మంది జనాభాకు 33 మంది మాత్రమే జైలు జీవితం గడుపుతున్నారు. 666 మందితో అమెరికా మొదటిస్థానంలో ఉన్నది. రష్యాలో 410 మంది, బ్రెజిల్‌లో 323 మంది జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో ఎక్కువ మంది జైలు జీవితం గడుపుతున్నారన్న విషయంపై ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్రిమినల్ పాలసీ రిసెర్చ్(ఐసీపీఆర్) అధ్యయనం చేపట్టింది. మొత్తం 205 దేశాల్లో ఈ అధ్యయనం జరుపగా అందులో భారత్ 86 వ స్థానంలో నిలిచింది.

ఐసీపీఆర్ నివేదికలోని కీలకాంశాలు..

- భారత్‌లో జైలు జీవితం గడుపుతున్నవారి సంఖ్య పొరుగు దేశాల కంటే చాలా తక్కువగా ఉన్నది. ప్రతి లక్ష మంది జనాభాకు చైనాలో 118 మంది, శ్రీలంకలో 78 మంది, నేపాల్‌లో 65 మంది, బంగ్లాదేశ్‌లో 48 మంది, పాకిస్థాన్‌లో 44 మంది జైలులో ఉన్నారు.
- ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఖైదీలను కలిగి ఉన్న దేశాల జాబితాలోనూ అమెరికా మొదటిస్థానంలో ఉంది. ఆ దేశంలో 21,45,100 మంది జైలు జీవితం గడుపుతున్నారు. తర్వాత స్థానాల్లో చైనా 16,49,804 మంది, బ్రెజిల్ 6,72,722 ఉన్నాయి. భారత్ 4,19,623 మంది ఖైదీలతో ఐదోస్థానంలో నిలిచింది.
- భారత్‌లో జైలు జీవితం గడుపుతున్నవారంతా శిక్ష పడిన ఖైదీలు కాదు. దాదాపు 67.2శాతం మంది విచారణను ఎదుర్కొంటున్నారు. అదే అమెరికాలో 20.3శాతం మంది, బ్రెజిల్‌లో 36.2శాతం మంది విచారణను ఎదుర్కొంటున్నారు.
- భారత్‌లో జైళ్ల సామర్థ్యానికి మించి ఖైదీలు ఉంటున్నారు. వాస్తవ సామర్థ్యం కన్నా దాదాపు 114శాతం మంది ఎక్కువగా ఉంటున్నారు. అదే అమెరికాలో అయితే 104 శాతం మంది అధికంగా ఉన్నారు.
- ప్రిజన్స్ స్టాటిస్టిక్స్ ఇండియా 2015 నివేదిక ప్రకారం సామర్థ్యానికి మించి ఎక్కువ మంది ఖైదీలు ఉంటున్న రాష్ట్రాల జాబితాలో దాద్రానగర్ హవేలీ మొదటిస్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ ఉన్నాయి.

బుడ్గాంలో ఉగ్రవాది హతం



శ్రీనగర్ : కాశ్మీర్‌లోని బుడ్గాం ఎన్‌కౌంటర్‌లో లష్కర్-ఇ- తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన మిలిటెంట్‌ను మట్టుబెట్టామని పోలీసులు వెల్లడించారు. బీర్వా జిల్లాలోని అరిజాల్ ఖాన్‌మొహల్లాను అష్టదిగ్బంధనం చేయగా తప్పించుకు పోవాలని పోలీసులపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతుం డగా ఉగ్రవాదిని హతం చేశామన్నారు. మృతిచెందిన ఉగ్రవాదిని షఫత్ హుస్సేన్ వనీగా గుర్తించారు. 2017లో ఎల్ఈటీలో చేరారని పోలీసులు వెల్లడించారు.

బీఎంసీ అవినీతిపై ప్రభుత్వ విచారణ



ముంబై : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఉద్యోగులు, అధికారులపై విచారణ జరపాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. 2001 మంది బీఎంసీ ఉద్యోగులపై దర్యాప్తు పెండింగ్‌లో ఉందని అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. 1000 ఫైళ్లను కావాలనే అధికారులు వేరేచోటుకు తరలించారని బీఎంసీ కార్పొరేటర్లు రాష్ట్ర ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫైళ్లు కనబడక పోవడంతో దర్యాప్తు నత్తనడకన జరుగుతోందని అధికారి తెలిపారు.

ప్రభుత్వ పరీక్షల విశ్వసనీయతకు చర్యలేంటి..?

ఎస్ఎస్‌సీని కోరిన పార్లమెంటరీ ప్యానెల్

Staff Selection Commission (SSC) Recruitment

న్యూఢిల్లీ : వివిధ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పరీక్షల విషయంలో విశ్వసనీయతను కాపాడటానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటో వివరించాలని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)ని పార్లమెంటరీ ప్యానెల్ కోరింది. వేర్వేరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపికకు పరీక్షలు నిర్వహించే ఎస్ఎస్‌సీ గత ఐదు సంవత్సరాలలో పూర్తిగా లేదా పాక్షికంగా తొమ్మిది పరీక్షలను రద్దు చేసింది. కామన్ గ్రాడ్యుయేట్ లెవెల్(టైర్-3) పరీక్ష 2017కు సంబంధించిన ఆరోపణలపై ఇటీవల ఒక సీబీఐ దర్యాప్తునకు సిఫార్సు చేసింది. 'అటువంటి పరీక్షల రద్దు అభ్యర్థులు, ప్రభుత్వానికి చెందిన వనరులు, ప్రయత్నాలు పూర్తిగా వ్యర్థమవడమే. అలాగే సాధారణ ప్రజల దృష్టిలో కమిషన్ ప్రతిష్ట మసకబారడమే' అని న్యాయం, చట్టం, వ్యక్తిగత, ప్రజా సమస్యలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సంబంధిత విభాగం పేర్కొంది. ఇటీవల తన నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. పరీక్షార్థులు తమ విలువైన సమయాన్ని, కృషిని కోల్పోతారని వివరించింది. 'మరోవైపు కమిషన్ సమయం, డబ్బును నష్టపోతోంది. అభ్యర్థుల నియామకాల కోసం అనేక విభాగాలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు, సాంకేతిక అవాంతరాలు లేకుండా పరీక్షల ప్రక్రియ జరపాలని కమిషన్ సిఫార్సు చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియకు సంబంధించిన విశ్వసనీయతను కాపాడాలని కమిటీ అభిప్రాయ పడింది. సాధారణ ప్రజల, ప్రత్యేకించి పరీక్షార్థులలో విశ్వాసాన్ని పెంపొందించేలా నిర్వహణ ఉండాలని నివేదిక వివరించింది. కాగా పరీక్షల నిర్వహణ కోసం సమాచార, సాంకేతిక సదుపాయాలు, ఆన్‌లైన్‌లో నిర్వహణకు ప్రైవేటు సంస్థలు, ల్యాబ్‌లు, సాంకేతిక సేవల ఏర్పాటుదారుల నుంచి సేవలు పొందుతారు. ఈ విషయంలో కమిషన్ నిశితంగా పర్యవేక్షించాలి. ఇన్విజిలేషన్, పర్యవేక్షకుల సామర్థ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద ప్రభుత్వాధికారుల సంఖ్య తగిన విధంగా ఉండాలని ప్యానెల్ సూచించింది. పరీక్షల నిర్వహణలో అవకతవకలు లేకుండా ప్రభుత్వ సంస్థలు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం ఆడిట్ చేయాలని పేర్కొంది.

బీజేపీ పతనానికి నాంది

- గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఫలితాలు దేశానికి సందేశం
- 2019లో కాషాయ పార్టీ ఓటమి ఖాయం
- సీఎం, డిప్యూటీ సీఎంను ఓడించడం తేలికకాదు
- బీజేపీపై ప్రజాగ్రహానికి నిదర్శనమే ఫలితాలు
- పీటీఐ ఇంటర్వ్యూలో అఖిలేష్ యాదవ్



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీ పతనానికి నాంది అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టంచేశారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ ఉపపోరులో ఎస్‌పీ విజయం తమ కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమనే సంకేతాన్ని దేశవ్యాప్తంగా ఈ ఫలితం పంపిందని అఖిలేష్ అభిప్రాయపడ్డారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఫలితాలు బీజేపీ పతనాన్ని తేటతెల్లం చేశాయన్నారు. ఈ రెండు లోక్‌సభ నియోజకవర్గాలు, ప్రత్యేకించి గోరఖ్‌పూర్ బీజేపీకి కంచుకోట. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు తిరుగులేని మెజారిటీతో విజయం సాధించారు. ఇప్పుడు సీఎంగా ఉండగానే ఆయన ఆ స్థానాన్ని నిలుపుకోలేకపోయారు. ఫూల్‌పూర్ సైతం ఉపముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య ప్రాతినిధ్యం వహించినదే. 'ఇది అతిపెద్ద విజయమని స్పష్టంగా చెప్పగలను. ఎందుకంటే... ఇది మా విజయమే కాదు...ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రిని ఓడించడం. బీజేపీ తరపున విస్తృతంగా ప్రచారం చేసిన యోగీ సైతం తన సొంత నియోజకవర్గాన్ని కాపాడుకోలేకపోయారు. దేశానికే ఇదో సంకేతం. ప్రజల్లోనూ, మా పార్టీ కార్యకర్తల్లోనూ ఈ విజయం ఓ నమ్మకాన్ని కలిగించింది. వచ్చే ఎన్నికల్లో గోరక్‌పూర్, ఫూల్‌పూర్ ఫలితాలే దేశవ్యాప్తంగా ప్రతిబింబిస్తాయి' అని ఆదివారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అఖిలేష్ స్పష్టంచేశారు. రాజ్యసభ ఎన్నికల్లో ఎస్‌పీ మద్దతిచ్చిన బీఎస్‌పీ అభ్యర్థి భూమారావు అంబేద్కరు ఓటమిపై స్పందిస్తూ...ధనబలం, అధికార దుర్వినియోగానికి పాల్పడిన బీజేపీ నిజస్వరూపం ఈ ఎన్నికల్లో బహిర్గతమైందని మాజీ సీఎం చెప్పారు. ఓ దళితుడి ఎన్నికకు వ్యతిరేకంగా బీజేపీ భారీ కుట్రకు తెరతీసిందని అఖిలేష్ విమర్శించారు. ఎస్‌పీ-బీఎస్‌పీ ఐక్యత వచ్చే ఎన్నికల్లో మరింత పటిష్టమంతంగా ఉంటుందన్నారు. మాయావతికి ధన్యవాదాలు తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఎస్‌పీ వ్యూహమేమిటని ప్రశ్నించగా బూత్ మేనేజ్‌మెంటుతో పాటు అన్ని గ్రామాలకు వెళ్లాలని, ప్రజలతో మమేకం కావాలని పార్టీ కార్యకర్తలకు చెప్పామన్నారు. 'నేను, మా నాయకులు, కార్యకర్తలు అన్ని గ్రామాలు, ప్రతి ఒక్కరినీ కలుస్తాం. నా హయాంలో ప్రారంభించిన కార్యక్రమాల గురించి తెలియజేస్తాం. బీజేపీ హయాంలో జరుగుతున్న పనులు, అభివృద్ధి కార్యక్రమాలను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరతాం. బీజేపీ చెప్పలేనన్ని హామీలు గుప్పించింది. ఒక్కటీ పరిపూర్తి చేయలేదు. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఉప ఎన్నికల్లో ఆ ఆగ్రహాన్ని చూపించారు' అని అఖిలేష్ చెప్పారు. పోలింగ్ శాతం తగ్గడమే తమ ఓటమికి కారణమని బీజేపీ చెబుతోంది గదా అని అడుగగా ఓటర్లు ఎక్కువగా వచ్చి ఉంటే తమ మెజారిటీ ఇంకా భారీగా పెరిగి ఉండేదని, బీజేపీ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని నిందించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తన భార్య డింపుల్ యాదవ్ పోటీ చేయడం లేదని అఖిలేష్ స్పష్టంచేశారు. 2019 ఎన్నికల పొత్తులు, కాంగ్రెస్‌తో ఎస్‌పీ సంబంధాల గురించి ప్రస్తావిస్తూ ఎన్నికలు దగ్గరకు వచ్చినప్పుడే దీనిపై ఓ స్పష్టత వస్తుందని, ఇప్పుడే వీటి గురించి చెప్పడం తొందరపాటు అవుతుందని అఖిలేష్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌తో తమ బంధం బాగానే ఉందన్నారు. ఇది కొనసాగుతుందని భావిస్తున్నానన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ, తాము రాష్ట్రంలో చాలా బలంగా ఉన్నాం. పొత్తులు, అవగాహనకు సంబంధించి కసరత్తు జరుగుతోందన్నారు. సరైన సమయంలో నాయకుడిని నిర్ణయిస్తామన్నారు. ఎన్నికల ఫలితాలపై మీ నాన్న ములాయం సింగ్ యాదవ్ స్పందన ఏమిటని అడుగగా ఇద్దరు యువకులు విజయం సాధించినందుకు ఆయన చాలా సంతోషంగా ఉన్నారని, తామందరినీ ఆయన ఆశీర్వదించారని అఖిలేష్ చెప్పారు. బీజేపీ ప్రభుత్వం పనితీరుపై స్పందిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు. ఎన్‌కౌంటర్లు పెరిగాయన్నారు. ఇవి రాజకీయ ఎన్‌కౌంటర్లని నిందించారు. ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్న వారికి తాను ఒక్కటే చెప్పగలను. ఇప్పుడు కావచ్చు... తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కావచ్చు. కచ్చితంగా వారు విచారణను ఎదుర్కోవాల్సిందే. ఎన్‌కౌంటర్ల నుంచి మాత్రం వారు తప్పించుకోలేరని అఖిలేష్ స్పష్టమైన హెచ్చరిక చేశారు. మతతత్వం, కులతత్వాన్ని వ్యాప్తి చేయడం ద్వారా బీజేపీ సమాజాన్ని ధ్వంసం చేస్తోందని నిశితంగా విమర్శించారు. ఆర్‌జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ గురించి ప్రస్తావిస్తూ... ఆయన తమ బంధువు మాత్రమే కాదని, పెద్ద నాయ కుడని, బీహారులో మతోన్మాద శక్తులను తరిమికొట్టిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. లాలును కలవడానికి ఇటీవలే కిరణ్మయి నందాను తాను పంపానని చెప్పారు.

ఎన్‌కౌంటర్‌లో నేరస్తుడు ఖతం



షహారాపూర్, ఘజియాబాద్ : ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన నేరస్తుడు సలీంను హతం చేశారు. అతనిపై రూ. 25 వేల బహుమతి ఉందని, ఈ ఘటనలో సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. రైతునుంచి రూ. 1లక్ష దోచుకున్నారని శనివారం అర్ధరాత్రి సమా చారం అందడంతో గాలింపు చర్యలు చేపట్టగా సలీం పోలీసులపైకి కాల్పులు జరపడంతో అందుకు ప్రతిగా స్పందిం చాల్సి వచ్చిందన్నారు. రైతు సొమ్మును తిరిగి స్వాధీనం చేసుకున్నామన్నారు.

స్వర్ణదేవాలయంలో మన్మోహన్‌సింగ్ ప్రార్థనలు



అమృతసర్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దంపతులు ఆదివారం స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి ఆయనను గర్భగుడిలోకి తీసుకువెళ్లి పూజలు జరిపించారు. సిక్కు మతగ్రంథాలు, ఉలెన్ శాలువా, గుడి పటాలను అధికారులు వారికి అందించారు. శ్రీ హరమందర్ సాహిబ్ ఆశీస్సులు నాపై ఉన్నాయని భావిస్తున్నానని మన్మోహన్ ఆలయ పుస్తకంలో రాశారు. దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత హిందూ కాలేజీ పూర్వవిద్యార్థుల సమావేశంలో ఆయన శనివారం పాల్గొన్నారు.

సీఎంబీని తప్ప దేనిని అంగీకరించం : డీఎంకే



ఇరోడ్ : కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు (సీఎంబీ) ఏర్పాటును తప్ప మిగతా వేటికి తాము ఆమోదం తెలపబోమని డీఎంకే ఆదివారం తేల్చి చెప్పింది. అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల నివారణ కోసం కేంద్రం చట్టబద్ధంగా పీఎంబీని ఏర్పాటు చేయాలని రెండు రోజుల డీఎంకే సమావేశాల్లో ప్రత్యేక తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈవిషయంపై పోరాడాలన్నారు. కేంద్రం సూపర్ వైజరీ బోర్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తోందని దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమన్నారు.

అంబేద్కర్‌నూ ఎగతాళి చేశారు

- పేదలు కలలు సాకారం చేసుకోవచ్చని నిరూపించాడు
- ప్రధాని నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ : భీమ్‌రావ్ అంబేద్కర్‌ను అనేక మంది ప్రజలు ఎగతాళి చేశారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం విమర్శించారు. దళిత కుటుంబానికి చెందిన వ్యక్తిని ముందుకు సాగనీయకుండా మోకాలడ్డే ప్రయత్నాలు చేసి విఫలమయ్యారని అన్నారు. కానీ పేదలు, వెనుకబడిన వారికి చెందిన 'కొత్త భారతదేశం' విభిన్నమైనదని ఆయన గుర్తు చేశారు. 'మన్ కీ బాత్' నెలవారీ రేడియో కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ ఒక వ్యక్తి ధనిక లేదా ప్రముఖ కుటుంబంలో జన్మించాల్సిన అవసరం లేదని అంబేద్కర్ విజయవంతంగా నిరూపించాడని ప్రధాని మోడీ అన్నారు. కానీ భారతదేశంలో పేద కుటుంబాలలో జన్మించిన వారు కూడా లక్ష్యాల్లో విజయం సాధించడం ద్వారా తమ కలల సాకారానికి ధైర్యం చేయవచ్చన్నారు. అందుకు అంబేద్కర్ తత్వాన్ని ఒక ఉదాహరణగా చెప్పారు. అంబేద్కర్ జయంత్యుత్సవం పురస్కరించుకుని ఏప్రిల్ 14 నుంచి మే 5వ తేదీ వరకు 'గ్రామ-స్వరాజ్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. ప్రచారం భాగంగా దేశమంతటా గ్రామాభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయంపై వేర్వేరు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 'ఈ ప్రచారంలో మీరంతా భాగస్వాములు కావాలని కోరుతున్నా' అని ప్రధాని పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం అంబేద్కర్ కొత్త ఉద్యోగాల సృష్టికి, అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లేందుకు భారత పారిశ్రామికీకరణ గుర్తించి మాట్లాడారని వివరించారు. 'ఈరోజు, అంబేద్కర్ కలలు కన్న భారత్ ఒక పారిశ్రామిక సూపర్ పవర్‌గా మేక్ ఇన్ ఇండియా ప్రచారంలో విజయవంతంగా ముందుకు సాగుతుంది' అని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి కేవలం నగరాలలోనే సాధ్యమవుతుందన్నారు. 'అంబేద్కర్‌కు స్వయం సమృద్ధిపై అత్యంత విశ్వాసం ఉంది. నేటి మన ద్రవ్య విధానం, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా ఇన్షియేటివ్‌లు మన యువ ఆవిష్కర్తలకు. యువ పారిశ్రామికవేత్తలకు ఆధారంగా ఉంటాయి' అని మోడీ వివరించారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పోర్టులు, జల మార్గాలను కలిగి ఉండాలన్న ఆలోచనలో అంబేద్కర్ పాత్ర పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఫెడరలిజం గురించి అంబేద్కర్ మాట్లాడేవారని, దేశ ఉన్నతి కోసం కేంద్ర, రాష్ట్రాలు కలిసి పని చేయడమే ఫెడరలిజమేనని పేర్కొన్నారన్నారు. 'ఈరోజు, మేము పాలనకు సంబంధించిన అన్ని అంశాలలో కో-ఆపరేటివ్ ఫెడరలిజంను అవలంభించడం ద్వారా ముందుకు సాగుతున్నాం. అలాగే పోటీ కో-ఆపరేటివ్ ఫెడరలిజంను అవలంభిస్తున్నాం' అని మోడీ చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ముఖ్యమైన అంశాలైన వ్యవసాయం, రైతును గుర్తించేందుకు మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి, రామ్‌మనోహర్ లోహియా, చరణ్ సింగ్, దేవీలాల్ వంటి నాయకుల పాత్ర ఎనలేనిదని ప్రధాని పేర్కొన్నారు.

17,685 మందికి ఒక డాక్టరే..

పాట్నా: బీహార్‌లో 17,685 మందికి ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి మంగళ్ పాండే అసెంబ్లీలో చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రీయ జనతా దళ్ నేత అఖ్తారుల్ ఇస్లాం షాహీన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతి వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలని సూచించిన ప్రామాణికత మేరకు డాక్టర్ల- జనాభా నిష్పత్తి గురించి తెలపాలని పాండేను షాహీన్ కోరారు. దేశంలో డాక్టరు, జనాభా సగటు నిష్పత్తి 1:11,097గా ఉంటే బీహార్‌లో 1: 17,685గా ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం మెడికల్ కాలేజీల్లో ఉన్న వారితో కలిపి మొత్తం 6,830 మంది డాక్టర్లు ఉన్నారని వెల్లడించారు. దేశంలో అధికారికంగా 10 లక్షల మంది డాక్టర్లు ఉండగా బీహార్‌లో 40,043మంది మాత్రమే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పాండే చెప్పారు.

సమగ్ర చట్టం అవసరం

సేంద్రియ ఆహార ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ

కోల్‌కతా: దేశంలో సేంద్రియ ఆహార ఉత్పత్తుల కోసం సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని ఎఫ్ఎస్ఎస్ఏఐ (భారత ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల సంస్థ) ఉద్ఘాటించింది. సేంద్రియ ఆహార ఉత్పత్తులకు సంబంధించి ప్రస్తుతం వ్యవసాయ మంత్రిత్వ శాఖ, అపెడా (అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) వేర్వేరు మార్గదర్శకాలను కలిగి ఉన్నాయి. వీటి స్థానంలో సమగ్రమైన ఒకే చట్టాన్ని అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ చైర్మన్ ఆశిష్ బహుగుణ తెలిపారు. కోల్‌కతాలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ.. సేంద్రియ ఆహార ఉత్పత్తులకు సంబంధించి తాము ఇప్పటికే ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించామని. వివిధ భాగస్వాముల అభిప్రాయాలను స్వీకరించేందుకు ముసాయిదాను ఎఫ్ఎస్ఎస్ఏఐ వెబ్‌సైట్‌లో ఉంచామని చెప్పారు.

సీఎంబీ కోసం దినకరన్ నిరశన



తంజావూర్: కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు (సీఎంబీ) ఏర్పాటుకోసం టీటీవీ దినకరన్ ఆదివారం నిరాహారదీక్ష చేశారు. అమ్మమక్కల్ మున్నేట్ర కజగం (ఏఎంఎంకే) పార్టీతరపున తన అనుచరులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రసిద్ధ రైతు నాయకుడు పీఆర్ పాండియన్ ఆయనతో పాల్గొన్నారు. సీఎంబీ ఏర్పాటు కోసం తమిళ ప్రజలంతా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. మిథేన్ , హైడ్రోకార్బన్ ప్రాజెక్టులతో కావేరీ డెల్టా అంతా ఎడారిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు



పుదుచ్చేరి: పుదుచ్చేరిలో ఈ ఏడాది మొదటి అసెం బ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కాను న్నాయి. 30 మంది సభ్యులున్న అసెంబ్లీ 2018 సమావే శాలు ఉదయం 9.30 గంటలకు లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ఉపన్యాసంతో మొదల వుతాయి. ఈ సభల్లో 2018-19 నిధులు- కెటాయింపులపై వోట్ ఆన్ ఎకౌంట్ బిల్లుకు ఆమోద ముద్రను కోరతారు. ఏప్రిల్‌లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవే శపెడతారు. సోమవారం నుంచి 3 రోజులపాటు ఈ సమావేశాలు జరుగుతాయి.

మత్తుకు కళ్లెం

- ఐదేళ్లలో 300శాతం పెరిగిన మాదకద్రవ్యాల సీజ్‌లు, 2017లో 3.6లక్షల కేజీలు స్వాధీనం
- ఆంధ్రప్రదేశ్‌లో 78,767 కేజీల గంజాయి పట్టివేత
- చరస్ స్మగ్లింగ్‌లో యూపీ నం.1
- ఎన్‌సీబీ నివేదికలో వెల్లడి




న్యూఢిల్లీ : ఐదేళ్లలో దేశంలో భారీస్థాయిలో మాదక ద్రవ్యాలు పట్టుబడినట్టు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) తాజా నివేదిక వెల్లడించింది. ఓపియమ్ (నల్లమందు), హెరయిన్, కెనాబిస్ (గంజాయి) వంటి మత్తు పదార్థాల స్వాధీనాలు ఈ కాలంలో 300శాతం మేర పెరిగినట్టు తెలిపింది. ఒక్క 2017లో దాదాపు 3.6లక్షల కేజీల డ్రగ్స్ సీజ్ అయినట్టు పేర్కొంది. 2,551 కేజీల ఓపియం (హెరాయిన్ తయరీకి ఉపయోగ పడుతుంది), 2146 కేజీల హెరయిన్, 3,52,379 కేజీల కెనాబిస్ (గంజాయి), 3,218 కేజీల హషీష్ (చరస్ / గంజాయి గుగ్గిలం), 69 కేజీల కొకెయిన్ (ముఖ్యంగా పశ్చిమ ఆఫ్రికా నుంచి భారత్‌కు స్మగ్లింగ్ అయ్యే పార్టీ డ్రగ్)లను దేశానికి చెందిన యాంటీ నార్కోటిక్ ఏజెన్సీలు సీజ్ చేసినట్టు నివేదిక వెల్లడించింది. 2013 నాటి నుంచి ఇంత భారీ స్థాయిలో మాదకద్రవ్యాలు పట్టుబడడం ఇదే తొలిసారిగా పేర్కొంది. గతేడాదిలో మొత్తం 3.60 లక్షల కేజీల మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. 2016లో 3.01లక్షల కేజీలు, 2015లో ఒకలక్ష కేజీలు, 2014లో 1.1లక్ష కేజీలు, 2013లో లక్ష కేజీలను స్వాధీనం చేసుకొన్నట్టు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) నివేదిక వివరించింది. అన్ని రాష్ట్రాలు, ఏజెన్సీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించిన తాజా నివేదికను కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం విడుదల చేశారు. దేశంలో అక్రమంగా జరిగే మాదక ద్రవ్యాల రవాణాను నివారించే కేంద్ర సంస్థ ఎన్‌సీబీ హోం వ్యవహారాల శాఖ (ఎంహెచ్ఏ) ఆధీనంలో పనిచేస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఏజెన్సీలు, పోలీసులు, కేంద్ర శాఖలు పనిచేస్తున్నాయి. డ్రగ్స్ స్మగ్లింగ్‌కు చెక్ పెట్టేందుకు ఎన్‌సీబీ అధికారులు శాయాశక్తులా ప్రయత్నిస్తున్నారు. డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. మాదకద్రవ్యాలపై యువతలో అవగాహనను పెంచుతున్నారు. అయితే, ఈ ఐదేళ్లలోనే కాదు అంతకుముందు కూడా భారీ స్థాయిలో మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయని, 2017తో పోల్చితే వాటి విలువ చాలా ఎక్కువని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. గతేడాదిలో పంజాబ్ నుంచి 505.86 కేజీల ఓపియం పట్టుబడగా రాజస్థాన్ నుంచి 426.95 కేజీలు పట్టుబడింది. గుజరాత్‌లో 1,017 కేజీలు, పంజాబ్‌లో 406కేజీల హెరయిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 78,767 కేజీల గంజాయి పట్టుబడగా ఒడిశాలో 55,875 కేజీలను సీజ్ చేశారు. 702 కేజీల హషీష్ (చరస్)తో ఉత్తరప్రదేశ్ నెం.1గా నిలవగా, మధ్యప్రదేశ్‌లో 625 కేజీలు పట్టుబడింది. దేశ రాజధాని ఢిల్లీలో 30కేజీలు, మహారాష్ట్రలో 21.83 కేజీల కొకెయిన్ లభ్యమైంది. 2017లో స్మగ్లింగ్, అక్రమంగా మాదకద్రవ్యాల రవాణా జరిగిన పద్ధతుల గురించీ ఈ నివేదిక వివరించింది. మణిపూర్, జార్ఖండ్, బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి భారీ ఎత్తున ఓపియం (నల్లమందు) ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలించబడుతుండగా, పంజాబ్, జమ్మూ కాశ్మీర్‌లలోని భారత్-పాకిస్థాన్ సరిహద్దు గుండా హెరాయిన్ స్మగ్లింగ్ జరుగుతోందని పేర్కొంది. జమ్మూకాశ్మీర్ నుంచి మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, గుజరాత్‌లకు చరస్ ట్రాఫికింగ్ జరుగుతోందని, నేపాల్ నుంచి కూడా భారత్‌కు చరస్ అక్రమంగా చేరుతోందని నివేదిక తెలిపింది. కొకెయిన్ ఎక్కువగా విమానాశ్రయాలలోనే పట్టుబడుతున్నట్టు వెల్లడించింది. పార్సిళ్ల రూపేణ లేదా కాస్మెటిక్స్, గృహోపకరణాలు, పుస్తకాలు, ఆహార పదార్థాలు, బట్టలలో దాచి కొకెయిన్‌ను తరలిస్తూ విదేశీయులు పట్టుబడిన సంఘటనలు కోకొల్లలు ఉన్నాయని నివేదిక స్పష్టంచేసింది. దేశంలోని వివిధ సంస్థల ఆధ్వర్యంలో గతేడాదిలో 7602 ఎకరాల పాపీ (నల్లమందు) తోట, 8,515 ఎకరాల గంజాయి తోట నాశనం చేయబడినట్టు తెలిపింది. మొత్తం మీద 2013 నాటి నుంచి చూస్తే 2017లోనే అత్యధికంగా మాదకద్రవ్యాలు పట్టుబడినట్టు ఎన్‌సీబీ నివేదిక స్పష్టంచేసింది.

కేన్సర్.. అలవాట్లు మార్చుకోండి




అగర్తలా : కేన్సర్ బారిన పడే అలవాట్లను మార్చుకోవాలని త్రిపుర ఆరోగ్యశాఖ మంత్రి సుదీప్‌రాయ్ బర్మన్ ప్రజలను కోరారు. ప్రతిఏడాది రాష్ట్రంలో 2,500 మంది కేన్సర్ బాధితులు నమోదవుతున్నారని, రాష్ట్రంలోని 40 శాతం మంది కేన్సర్ బాధితులేనన్నారు. పొగాకు నమలడం, లేదా పొగతాగడం వల్ల రాష్ట్రంలో మహిళా కేన్సర్ బాధితులు అంతకంతకు పెరుగుతున్నారన్నారు. ఈశాన్య రాష్ట్రాలన్నింటిలోనూ త్రిపురలో అత్యధికంగా కేన్సర్ బాధితులు ఉన్నారు.

ఎయిమ్స్ కోసం ఎమ్మెల్యేల వాగ్వాదం



అహ్మదాబాద్ : గుజరాత్‌కు ఎయిమ్స్ మంజూరు చేసి ఏడాది అయినప్పటికీ ఎయిమ్స్ నెలకొల్పే విషయంలో రెండు ప్రాంతాల ఎమ్మెల్యేలకు మధ్య వాగ్వాదం కొనసాగుతూనే ఉంది. సౌరాష్ట్ర ఎమ్మెల్యేలు వడోదరలో ఆసుపత్రి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తు గురువారం అసెంబ్లీలో నిరసన చేపట్టారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ రెండు ప్రాంతాల ఎమ్మెల్యేలను హెచ్చరించారు. 2017-18 బడ్జెట్‌లో ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఏర్పాటు ను ప్రకటించారు.

అసెంబ్లీ సమావేశ పని దినాలపై కాంగ్రెస్ ఫైర్



భోపాల్ : మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశ దినాలు ఏడాదికేడాది తగ్గుతున్నాయని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఫైర్ అయింది. ఏడాదికి కేవలం 30 రోజులు మాత్రమే నిర్వహిస్తున్నారని, అందునా సభను అడ్డుకుంటూ ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చలు చేపట్టడంలేదన్నారు. ప్రతిపక్షాన్ని ఎదుర్కోలేకే అధికార పార్టీ ఈ చర్యలకు పాల్పడుతోందన్నారు. మూడు దశాబ్దాల నుంచి క్రమంగా అసెంబ్లీ సమావేశాల దినాలు తగ్గుతున్నాయని అసెంబ్లీ నిర్వహణా సమాచారం తెలుపుతోంది.



సంక్షేమం పేదలకు చేరేలా న్యాయసేవలు

విశాలాంధ్ర- నెల్లూరు బ్యూరో : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూరేలా చేయడం కోసం జాతీయ న్యాయ సేవా సంస్థలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి పి.వి.బి. రాంబాబు అన్నారు. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆదివారం రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ సేవల శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అసంఘటితరంగ కార్మికుల మధ్య న్యాయసేవాధికార సంస్థ వారధిలా పనిచేస్తుందన్నారు. హక్కులు, బాధ్యతలపై రాజ్యాంగంలోని చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేందుకు అవసరమైన న్యాయ సహాయం చేస్తుందన్నారు. సంయుక్త కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పేదలకు న్యాయ సహకారం ఎంతో అవసరమన్నారు. తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి నోడల్ ఆఫీసరుగా వ్యవహరించిన కార్యక్రమంలో న్యాయ సేవా సలహా సంఘం కార్యదర్శి పి.జె. సుధ, సంయుక్త కలెక్టరు - 2 వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మైనర్ బాలిక అపహరణ కేసులో ముగ్గురు అరెస్టు



విశాలాంధ్ర - గుంటూరు క్రైం : మైనర్ బాలికను మాయమాటలతో లోబర్చుకుని కిడ్నాప్ చేసిన కేసులో తాపీ కార్మికుడు చల్లంగుల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌తో పాటు సహకరించిన అతని తల్లిదండ్రులను అరెస్టు చేసినట్లు గుంటూరు తూర్పు మండల డీఎస్పీ కండె శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మైనర్ కిడ్నాప్ కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. వెంకటేశ్వర్లు తండ్రి కొండలు గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలో తాపీ పనిచేస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రం మేడ్చల్‌కు చెందిన లక్ష్మితో కొండలు, లక్ష్మి 15 సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు ఆరు నెలల క్రితం గుంటూరు ఆర్.అగ్రహారంలో ఒక ఇంటి నిర్మాణ పనికి వచ్చాడు. ఆ ప్రాంతంలోని మైనర్ బాలికకు ప్రేమపేరుతో మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలో వెంకటేష్‌తో పాటు అతని మారుతల్లి లక్ష్మి కూడా మైనర్ బాలిక చదువుకుంటున్న స్కూల్ వద్దకు వెళ్తూ తన కుమారుడిని ప్రేమిస్తే బాగా చూసుకుంటామని నమ్మబలికేది. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీన మైనర్ బాలికను తీసుకుని వెంకటేష్, తండ్రి కొండలు, మారుతల్లి లక్ష్మి కలిసి కృష్ణా జిల్లా నిడమానూరుకు మకాం మార్చారు. బాలిక తన కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు కూడా ఫోన్ అందుబాటులో లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. నిడమానూరులో వారు నివాసం ఉంటున్న ఇంటి సమీపంలోని స్నేహితురాలి ఫోన్ నుంచి బాలిక తన తల్లిదండ్రులతో మాట్లాడింది. పసిగట్టిన వెంకటేశ్వర్లు, అతని తండ్రి కొండలు పోలీసులు అదుపులోకి తీసుకుంటారన్న భయంతో రెండు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలోని శంషాబాద్‌కు మకాం మార్చారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు శంషాబాద్‌లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మైనర్ బాలికను వీరి చెర నుంచి విడిపించారు. బాలికకు వైద్య పరీక్షల అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో లాలాపేట సీఐ మురళీకృష్ణ, ఎస్సై కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రియల్టర్‌పై తుపాకీతో కాల్పులు



విశాలాంధ్ర-విజయనగరం క్రైం : విజయనగరం పట్టణంలో శనివారం రాత్రి రియల్ ఎస్టేటు వ్యాపారి నమ్మి అప్పలరాజుపై బొత్స మోహన్ తుపాకీతో కాల్పులకు తెగబడటం కలకలం రేపింది. తీవ్రంగా గాయపడిన అప్పలరాజు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరివురి మధ్య ఆర్థిక లావాదేవీలు ఈ హత్యాయత్నానికి కారణాలుగా తెలుస్తోంది. విశాఖ జిల్లా భీమిలి మండలం సంగివలస గ్రామానికి చెందిన నమ్మి అప్పలరాజు కొంతకాలంగా విజయనగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో 2016లో విశాఖ జిల్లా పీఎం పాలేనికి చెందిన బొత్స మోహన్ రూ.18 లక్షలను అప్పలరాజుకు ఇచ్చి రియల్ ఎస్టేటు వ్యాపారంలో భాగస్వామిగా చేరాడు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా వ్యాపార గొడవలు జరుగుతున్నాయి. దీంతో నిందితుడు మోహన్ ముందస్తు ప్రణాళికతో శనివారం రాత్రి ఓ ద్విచక్రవాహనంపై వచ్చి రియల్ ఎస్టేట్ కార్యాలయంలోని అప్పలరాజుపై వెంట తెచ్చుకున్న తుపాకీతో ఐదు రౌండ్లు కాల్పులు జరిపి పరారయ్యాడు. కాల్పులు శబ్దం విన్న ఆ కార్యాలయంలోని సూపర్‌వైజర్ ఘటనా స్థలానికి వచ్చేలోపే అప్పలరాజు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. హుటాహుటిన అప్పలరాజును స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం విశాఖ కేర్ ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ జి.పాలరాజు ఘటనా స్థలిని పరిశీలించారు. ఐదు ప్రత్యేక పోలీసు బృందాలతో కేసు దర్యాప్తు ప్రారంభించారు.

'ప్రత్యేక హోదా బాధ్యత కేంద్రానిదే'



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీల తోపాటు ప్రత్యేక హోదా అయిదు కోట్ల ఆంధ్రుల హక్కుగా భావించి తక్షణం కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ ఫ్లోర్ లీడర్ గాదె శ్రీనివాసులు నాయుడు డిమాండ్ చేశారు. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర శాఖ పిలుపుతో ఏపీకి ప్రత్యేక హోదా, ఇతర హామీల అమలు కోరుతూ ఆదివారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఉపాధ్యాయులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్షను ప్రారంభించిన ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ దేశంలో అనేకసార్లు రాష్ట్రాల విభజన సమయంలో రెండు రాష్ట్రాలకు సరి న్యాయం ఉండేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను మాత్రం అన్యాయంగా విభజించారన్నారు. విభజన కోరుకున్న తెలంగాణకు రాజధానితో పాటు రూ.27 వేల కోట్లు మిగులు బడ్జెట్ కేటాయించారని, విభజనను వ్యతిరేకించిన ఆంధ్రాకు మాత్రం రాజధాని లేకుండా రూ.16 వేల కోట్లు లోటు బడ్జెట్‌తో పంపడం దారుణమన్నారు. రాష్ట్రం నష్టపోతున్నట్లు గుర్తించిన అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా, లోటు బడ్జెట్ భర్తీతో పాటు పోలవరం ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర నిధులతో పూర్తి చేయాలని నిర్ణయించిందన్నారు. వాటిని అమలు చేయాల్సిన ప్రస్తుత మోదీ ప్రభుత్వం ఆంధ్రుల పట్ల వివక్ష చూపుతుందన్నారు. 4 ఏళ్లు గడిచినా ప్రత్యేక హోదా విషయంలో 14వ ఆర్థిక సంఘం ఒప్పుకోవడం లేదని చెప్పడం కుట్రలో భాగమే అన్నారు. రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాలకు అతీతంగా పీఆర్టీయూ త్వరలో ప్రత్యేక హోదా సాధన కోసం ప్రత్యేక ఉద్యమం నిర్వహించబోతున్నదన్నారు. నిరసనలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం నారాయణరావు, కృష్ణాజిల్లా అధ్యక్షులు డి. శ్రీను, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళు, గౌరవాధ్యక్షులు కె. నగేష్, రాష్ట్ర కౌన్సిలర్ కె. సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినీనటుడు శివాజీపై పోలీసులకు ఫిర్యాదు



విశాలాంధ్ర - విజయవాడ : భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు శివాజీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ విజయవాడ నగరశాఖ ప్రతినిధులు ఆదివారం సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి తోట శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రిని శివాజీ ఈడియట్ అని తిట్టడం దేశ ప్రతిష్టను మంటగలపడమేనని, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి కాళేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వాసా పల్లవరాజు, నగర కార్యదర్శి వై విజయలక్ష్మి, ఎస్సీ మోర్చా నగర అధ్యక్షుడు వై శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అమిత్‌షా లేఖ అవాస్తవాలమయం



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా సీఎంకు రాసిన లేఖలో అన్నీ అవాస్తవాలే పేర్కొన్నారని రాష్ట్ర సాంఘిక గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. గుంటూరులో ఉన్న రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ లేఖ రాష్ట్ర ప్రజలను అవమానించే విధంగా, అభివృద్ధిపై విషం చిమ్మేలా ఉందన్నారు. ఇంత కాలం కేవలం రాష్ట్రప్రయోజనాల కోసమే ఎన్డీఏతో కలిసి ఉన్నామన్నారు. గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వలన టీడీపీకి ఓట్లు శాతం తగ్గి పదిహేను సీట్లు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కనీసం కౌన్సిలర్‌గా కూడా గెలవలేని సోము వీర్రాజును ఎమ్మెల్సీని చేశామని, అలాగే ఎన్నో నామినేటెడ్ పదవులను ఇచ్చామన్నారు. రాజధానికి రూ.1,500 కోట్లు ఇచ్చి, రూ.2,500 కోట్లు ఇచ్చామని అవాస్తవాలు చెబుతున్నారని విమర్శించారు. టీడీపీ అవిశ్వాసం పెడితే దేశంలో ఎక్కడాలేని స్పందన వచ్చిందన్నారు. వైసీపీ అవిశ్వాసానికి కనీసం మద్దతు కూడా రాలేదని ఆనంద్‌బాబు అన్నారు.

రగులుతున్న రావిగుంటపల్లి

- కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ వద్దంటూ నిరసన గళం
- ప్రత్యక్ష పోరాటాలకు సమాయత్తం

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : అత్యంత ప్రమాదకర వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా కొత్త ఉత్పత్తుల తయారీ కోసం నెల్లూరు జిల్లా రాపూరు మండలం రావిగుంటపల్లి గ్రామంలో రాంకీ గ్రూపునకు చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ప్రజల ఆరోగ్యాలకు పెనుముప్పు తలపెట్టే ఈ పరిశ్రమ జనావాసాల మధ్య వద్దంటూ స్థానికుల నిరసనల నడుమ పనులు మొదలు కావడంతో మరోసారి నాలుగు గ్రామాల ప్రజలు పోరాటాలకు సమాయత్తమవుతున్నారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లోని పరిశ్రమల నుంచి వచ్చే ప్రమాదకర వ్యర్థాలు, మున్సిపాలిటీల్లో సేకరించే చెత్తను ఇక్కడకు తరలించనున్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ కంపెనీలోని నిరుపయోగ వస్తువులు, వాడేసిన ఆయిల్, పాత బ్యాటరీలు, పాత పేపర్, ప్లాస్టిక్ తదితర వ్యర్థాల రీసైక్లింగ్, చెత్త నుంచి విద్యుత్ తయారీ వంటి మూడు ప్రక్రియలు ఈ ఫ్యాక్టరీలో చేపట్టనున్నారు. ఈ పరిశ్రమ స్థాపనకు 48 ఎకరాల ఈనాం భూములను బెంగుళూరు వేస్ట్ మేనేజిమెంట్ ఫ్యాక్టరీ పేరుతో ఇక్కడ కొనుగోలు చేశారు. 2016 జూన్ 31వ తేదీన కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణను పూర్తి చేశారు. పరిశ్రమ నెలకొల్పితే ఉద్యోగ అవకాశాలతోపాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అధికారులు, కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో పబ్లిక్ హియరింగ్ మినిట్సు పేపర్లలో కొందరు నిరక్షరాస్యులతో సంతకాలు పెట్టించుకున్నారు. ఇదే సమయంలో బొజనపల్లి, రావిగుంటపల్లి, వీరాయపాళెం, పులిగిలపాడు గ్రామాలకు చెందిన కొందరు విద్యావంతులు, యువకులు ఇప్పటికే ఈ ప్రాంత క్రషర్లతో నీరు కలుషితమై అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఈ పరిశ్రమ కూడా పెడితే కాలుష్యం దెబ్బకు ఇక్కడ జీవించలేమంటూ నిరసన తెలిపారు. కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ ఇక్కడ వద్దంటూ ముక్తకంఠంతో నినదించారు. పరిశ్రమ వస్తే స్థానికులకు ఉపాధి దొరుకుతుందని అనుకున్నాననీ, దీనివల్ల వచ్చే ప్రమాదాలు తెలిసిన తర్వాత వ్యతిరేకిస్తున్నట్టు రాపూరు తహశీల్దారుకు రాతపూర్వకంగా గ్రామ సర్పంచ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో నాలుగు గ్రామాల ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను కలిసి తమ గోడు వెళ్ళబోసుకున్నా ఫలితంలేదని, ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టలేదని వాపోతున్నారు.

జనం ఆందోళనకు కారణాలివి..

కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ నెలకొల్పుతున్న ప్రాంతానికి కిలోమీటరు దూరంలో వీరాయపాలెం, రావిగుంటపల్లి, పులిగిలపాడు గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలు కిలోమీటరు దూరంలోనే.. గత 60 ఏళ్ళుగా కుష్టురోగుల పునరావాస కాలనీ కూతవేటు దూరంలోనే ఉంది. ఈ ఫ్యాక్టరీలో నిల్వ చేసే వ్యర్థాలతో 20 కిలోమీటర్ల వరకు రేడియేషన్ ప్రభావం ఉంటుందని నిపుణుల హెచ్చరిక ఈ ప్రాంత ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. రోజుకు సగటున 600 లారీలు రాకపోకలు సాగించాల్సి వస్తే రోడ్డు ప్రమాదాల్లో ఎంతమంది ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుందోనని భయం వెంటాడుతోంది. ఫార్మా కంపెనీల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలను ఇక్కడ భూమిలో నిల్వ చేస్తే వీటి నుంచి వెలువడే రేడియో ధార్మిక అణువులు భూగర్భ జలాల్లోనూ, వాతావరణంలోనూ కలిసి కలుషితమవుతుందనేది వీరి భయం. శ్వాసకోశ వ్యాధులతో ఊపిరితిత్తులు దెబ్బతినడంతోపాటు మొత్తం నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతూ నరాల, కండరాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు..

ఇప్పటికే క్రషర్లతో అవస్థలు

ఈ గ్రామాల పరిసరాల్లో ఇప్పటికే 5 మెటల్ క్రషర్లు కొనసాగుతున్నాయి. వీటి నుంచి వెలువడే దుమ్ము ఈ ప్రాంత పంటలు, చెట్లు, గ్రామాలను ముంచేస్తోంది. క్వారీల్లో బ్లాస్టింగుల ధాటికి ఇళ్ళు, భవనాల గోడలు బీటలువారుతున్నాయి. భూమి కంపిస్తుండడంతో ఈ ప్రాంతవాసులు అనుక్షణం భయంతో బతుకుతున్నారు. 60, 70 అడుగుల లోతు రిగ్గులు వేసి పేలుడు పదార్థాలతో పేల్చడంతో భూగర్భజలాల్లోకి అమోనియం, యూరియా వంటి రసాయనాలు వెళ్ళి తాగునీరు కలుషితం అవుతున్నాయి. ఈ కారణాలతో ఒక్క పులిగిలపాడు గ్రామంలోనే గత ఏడాది 20 మంది విష జ్వరాల బారినపడి చనిపోయారు. రావిగుంటపల్లిలో మరో ఆరుగురు చనిపోగా, ఒకే కుటుంబంలో అక్కా చెల్లెళ్ళు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో 6 జిల్లాల పరిశ్రమల నుంచి ప్రమాదకర వ్యర్థాలను ఇక్కడకు తరలిస్తే తామంతా ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



యువ రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-గూడూరు : కర్నూలుజిల్లా గూడూరు పట్టణంలో గొల్ల నడిపి హనుమంతు కుమారుడు గొల్ల సురేష్ (25) అప్పుల బాధతో పురుగుల మందుతాగి ఆదివారం మృతి చెందాడు. గొల్ల సురేష్ తనకున్న ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేసేవాడు. అదనంగా మూడెకరాలు గుత్తకు తీసుకుని రూ. 2లక్షలు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పుచేసి శనగ పంట సాగు చేసినా నష్టం రావడంతోపాటు గిట్టుబాటు ధర రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్సపొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం మృతి చెందాడు. మృతుడికి డోన్‌మండలం వెంకటరాయపల్లెకు చెందిన ఈశ్వరమ్మతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. మృతునికి 9నెలల కుమారుడు ఉన్నాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజా కుల్లాయప్ప కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్ డ్రైవర్ నిద్రమత్తు ముంచింది

- తమిళనాడు ఆర్టీసీ బస్సు బోల్తా
- డ్రైవర్‌తోపాటు ప్రయాణికుడు మృతి
- చిత్తూరు జిల్లాలో ఘటన




విశాలాంధ్ర - తిరుపతి క్రైం : బస్సు డ్రైవర్ నిద్రమత్తు ప్రయాణికుల ప్రాణాలకు పెనుముప్పు తెచ్చిపెట్టింది. డ్రైవర్ కునుకు తీయడంతో స్టీరింగ్ అదుపుతప్పిన బస్సు కల్వర్టును ఢీకొట్టి బోల్తా కొట్టిన ప్రమాదంలో డ్రైవర్‌తోపాటు మరో ప్రయాణికుడు మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలంలోని పాతకాల్వ వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. సేలం నుంచి తిరుపతి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు మరికాసేపట్లో గమ్యస్థానానికి చేరుకుంటుదని ప్రయాణికులు అనుకుంటున్న సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో కళ్లు మూశాడు. అతివేగంగా వస్తున్న బస్సు తెల్లవారుజామున 150 బైపాస్ రోడ్డులోని వకుళామాత ఆలయం ఎదుట అదుపు తప్పి రోడ్డుపై పల్టీ కొట్టి రోడ్డుపక్కన తిరగబడింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ వెంగంపట్టికి చెందిన వెంకటాచలం (37), తమిళనాడు రాష్ట్రం పెరంబూర్‌కు చెందిన ప్రయాణికుడు సుందరం (26) అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులోని ప్రయాణికుల్లో 15 మంది గాయపడ్డారు. బస్సులోని ప్రయాణికుని కథనం ప్రకారం సేలం డిపోకి చెందిన తమిళనాడు బస్సు శనివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో సేలం నుంచి తిరుపతి బయలుదేరింది. ఉదయం 2.45 గంటలకు వేలూరు చేరుకున్న తర్వాత అక్కడ మరికొంత మంది ప్రయాణికులను ఎక్కించుకొని 3 గంటలకు బయలుదేరింది. అప్పటికే డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నందున చిత్తూరు-పూతలపట్టు మార్గంలో ఓ హోటల్‌లో టీ కూడా తాగారు. ఆ సమయంలో బస్సులో 25 నుంచి 30 మంది ప్రయాణికులు ఉన్నారు. వకుళామాత ఆలయం వద్దకు వచ్చేసరికి డ్రైవర్ కళ్లు మూతపడటంతో బస్సు రోడ్ కల్వర్టును ఢీకొని పల్టీ కొట్టడంతో 50 అడుగుల దూరం వెళ్ళి రోడ్డు పక్కన తలకిందులుగా పడిపోయింది. డ్రైవర్‌తో సహా మరో ప్రయాణికుడు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ప్రయాణికురాలు సరోజనమ్మ చేయి విరిగింది. మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులోంచి బయట పడిన ప్రయాణికులు కొందరు ఆ మార్గంలో వస్తున్న వాహనాల్లో వెళ్ళిపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎం.ఆర్.పల్లి పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా కూలీల ఆటో బోల్తా




విశాలాంధ్ర-జగ్గయ్యపేట : కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు మండలంలోని సుబ్బాయిగూడెం వద్ద ఆదివారం ఉదయం వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 13 మందిలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామానికి చెందిన మహిళా కూలీలు ఆదివారం వత్సవాయి మండలం రేగులగడ్డ వద్ద పొలం పనులకు ఆటోలో బయలుదేరారు. సుబ్బాయిగూడెం వద్ద ఆటో టైర్‌కు పంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమాచారం అందుకున్న పెనుగంచిప్రోలు ఎస్సై అవినాష్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 అందు బాటులో లేకపోవటంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను తన జీపులోనే జగ్గయ్యపేట ప్రభుత్వా సుపత్రికి తరలించారు. వీరిలో ఆరుగురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు. స్వల్పంగా గాయపడిన ఏడుగురికి ప్రాథమిక చికిత్స చేశారు. స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ప్రభుత్వాసుపత్రిలోని క్షతగాత్రులను పరామర్శించారు.



యునెస్కోకు లేపాక్షి నివేదిక

విశాలాంధ్ర-లేపాక్షి : లేపాక్షి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు యునెస్కో గుర్తింపు కోసం నివేదిక పంపినట్లు హిందూపురం ఎంఎల్ఏ బాలకృష్ణ తెలిపారు. ప్రపంచ శిల్పకళా క్షేత్రం అనంతపురంజిల్లా లేపాక్షి ఏకశిల నంది ఉత్సవాల్లో ఆదివారం సైకిల్ ర్యాలీ మొదటి ఘట్టంగా ప్రారంభమైంది. కొడికొండ చెక్‌పోస్టు నుండి సైకిల్ ర్యాలీగా లేపాక్షి నంది విగ్రహం వరకు బాలకృష్ణ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నంది విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన సభాస్థలిపై నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ భాషా సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోకూడదనే ఉద్దేశంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. లేపాక్షి ఆలయంలో శిల్పకళ, చిత్రలేఖనలు అద్భుతంగా ఉన్నాయని, 108 శైవ క్షేత్రాల్లో లేపాక్షి ఆలయం ఒకటన్నారు. 2016లో లేపాక్షి ఉత్సవాలు ఘనంగా నిర్వహించామని, ప్రస్తుతం జరిగే ఉత్సవాలు మరింత వైభవంగా జరిగే విధంగా చూడాలని, దీనికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా హిందూపురం మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ.194 కోట్లతో పైప్‌లైన్ ద్వారా నీరిస్తామన్నారు. ఉత్సవాల రోజున హంద్రీనీవా నీటితో లేపాక్షి చెరువుని నింపి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా జలహారతి నిర్వహిస్తామన్నారు. పార్లమెంట్ సభ్యులు నిమ్మలకిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే రంగనాయకులు, గ్రంథాలయ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, రీజినల్ డైరెక్టర్ గోపాల్, ఐసీడీఎస్ వెంకటేశం, డీఈఓ జనార్ధనాచార్యులు, ఆర్డీఓ రామ్మూర్తి, డీఎస్పీ కరీముల్లా షరీఫ్, ఎంపీపీ హనోక్, జెడ్పీటీసీ ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ జయప్ప, ఎంపీటీసీలు చలపతి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



గిరిజనుడిపై ఖాకీ జులుం

విశాలాంధ్ర-సాలూరు : పోలీసు అధికారి అకారణంగా ఓ గిరిజనుడిని చావబాదిన ఘటన విజయనగరం జిల్లా పాచిపెంట మండలం కొండతాడు గ్రామంలో అలజడి రేపింది. బాధితుని భార్య గంగమ్మ కథనం ప్రకారం.. కొండతాడు గ్రామంలోని మెట్టభూముల విషయంలో కొద్దిరోజులుగా గిరిజనులు, పెత్తందార్లకు మధ్య గొడవ జరుగుతుంది. గిరిజనులకు అండగా ఇటీవల సీపీఐ నాయకులు పోరాటం నిర్వహించారు. ఈ నేపథ్యంలో బాధితుడు సుర్రి అప్పలస్వామి ఆదివారం సాయంత్రం పశువులతో ఆ వివాదాస్పద భూముల్లో ఉండగా పాచిపెంట ఎస్సై ఘటనా స్థలానికి చేరుకున్నారు. పాతివున్న ఎర్రజెండాలను చూసి అప్పలస్వామితో వాగ్వివాదానికి దిగాడు. ఈ జెండాలను ఎవరు పాతారు అన్న విషయంపై ఇరువురి మధ్య వాదన జరిగింది. తనకు తెలియదని అప్పలస్వామి ఎంత చెప్పినా పట్టించుకోని ఎస్సై ఆవేశంతో ఊగిపోతూ మెడపై, వీపుపై లాఠీతో చావబాదాడు. తీవ్రంగా గాయపడిన అప్పలస్వామిని గ్రామ మాజీసర్పంచ్ సీతయ్య సహకారంతో స్థానిక ఆసుపత్రిలో చేర్పించినట్టు భార్య గంగమ్మ తెలిపారు. ఎస్సైపై తక్షణ చర్యలు తీసుకోకపోతే గిరిజన సంఘాలతో కలిసి ప్రత్యేక ఆందోళనకు పూనుకుంటామని గ్రామ పెద్దలు హెచ్చరించారు. దీనిపై సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

ఏళ్ల తరబడి పరిహారం పెండింగ్

- ఏనుగుల విధ్వంసంతో రైతులకు భారీ నష్టం
- ప్రభుత్వశాఖల సమన్వయలోపంతో అందని సాయం

విశాలాంధ్రబ్యూరో - శ్రీకాకుళం : ఏనుగులకు అడవుల్లో ఆహారం దొరక్క ఆవాసం కోసం పంటలు, ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనల్లో నష్టపోయిన మొత్తాన్ని లెక్కగట్టి బాధితులకు ఇచ్చేయమని ప్రభుత్వం చెబుతున్నా బాధితుల దరిచేరని అయోమయ పరిస్థితి. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి రూ.10 లక్షలను అటవీశాఖ అకౌంట్‌లో జమచేసింది. గత నాలుగేళ్లలో ఏనుగుల కారణంగా 250 హెక్టార్లలో పంటలు, తోటలకు నష్టం వాటిల్లితే కేవలం 3 హెక్టార్లలో పంటకు మాత్రమే నేటికి పరిహారం ఇచ్చారు. అదికూడా వారం రోజుల క్రితం కంచిలి మండలానికి చెందిన ఇద్దరు రైతులకు రూ.15 వేలు చెల్లించారు. ఇలా నష్టపోయిన కేసుల సంఖ్య 135గా నమోదైతే కేవలం రెండు కేసులు మాత్రమే ఇప్పటివరకూ పరిష్కరించడం విమర్శలకు దారితీస్తోంది.

ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తే వ్యవసాయశాఖ లేదా ఉద్యానవనశాఖ అధికారులు నష్టాన్ని లెక్కిస్తాయి. రెవెన్యూశాఖ ధృవీకరిస్తుంది. ఈ దస్త్రం అటవీశాఖ వద్దకు చేరిన తర్వాత బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. అటవీశాఖ మినహా మిగిలిన శాఖలన్నీ ఈ విషయాన్ని పక్కన పెట్టేశాయి. నిధులు మూలుగుతున్నా నష్టపోయిన రైతులకు చెల్లించలేని దుస్థితి నెలకొంది. పంట నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదనే ప్రచారం ఏనుగులు తిరుగుతున్న పది మండలాల్లోనూ బలంగా నాటుకుపోయింది. దీంతో ఏనుగులను అడ్డుకునేందుకు బాణాసంచా కాల్చుతూ, కాగడాలు వెలిగిస్తుండటంతో అవి ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకూ ఏనుగుల దాడిలో పదకొండుమంది మృతిచెందారు. ఇంకా మరిన్ని ప్రాణాలు గాలిలో కలిసిపోతాయేమోనని భయపడటం తప్ప దీనిపై మార్పు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి.

ఏనుగుల నుంచి దూరంగా ఉండండి

ఏనుగులకు దూరంగా వుండాలంటూ అటవీశాఖ ఆధ్వర్యంలో రేంజర్లు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది కొద్దిరోజులుగా గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లోని గ్రామస్తులతో మాట్లాడుతున్నారు. ట్రాకర్లను నియమించారు. వీరు నిత్యం ఏనుగుల కదలిక సమాచారాన్ని అధికారులకు, ఆయా గ్రామాల ప్రజలకు అందిస్తుంటారు. వీరఘట్టం, సీతంపేట, కొత్తూరులో ఇవి ప్రస్తుతం సంచరిస్తున్నప్పటికీ మరో ఎనిమిది మండలాల్లోనూ వీటి ప్రభావం ఉంది. గ్రీన్‌మెర్సీ తదితర జంతు హింస నివారణకు ఉద్యమించే సంఘాలతో మాట్లాడి గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటుచేయాలని సూచిస్తున్నారు.



మత్తు వదలరా..?

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మద్యం సేవించి వాహనాలు నడపరాదని పోలీసులు ఎన్ని విధాలుగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నా యువతో ఎలాంటి మార్పు రావడం లేదు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించడం లేదా కోర్టులో హాజరుపర్చడం, కొన్ని సార్లు జైలుశిక్షలు పడుతున్నా యువత తీరు మారడం లేదు. దీంతో అసలు ఏం చేస్తే వీరు మత్తు వీడుతారనే విషయం పోలీసులకు సవాల్‌గా మారింది. కొంతకాలంగా మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడ్డ వారిలో పురుషులతో పాటు మహిళల సంఖ్య కూడా పెరుగుతుండడంతో వారు తలల పట్టుకుంటున్నారు. ఇటీవల ఇద్దరు మహిళలు మద్యం తాగి వాహనం నడిపి ముందుగా వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. శనివారం జూబ్లీహిల్స్‌లో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా 76మందిని పోలీసులు అరెస్టు చేశారు. 40 కార్లు, 35 బైక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

త్వరలో ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు సర్వీసులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మేకిన్ ఇండియా పథకం కింద హైదరాబాద్‌లో ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు రవాణా శాఖ మంత్రి పి.మహేందరరెడ్డి తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎలక్ట్రికల్ బస్ సర్వీసులను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. అధికారపక్ష సభ్యుడు పాటూరి సుధాకరరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. సెప్టెంబర్ నుంచి ఎలక్ట్రికల్ బస్సులను నగరంలో తిరుగుతాయన్నారు. మొదటి దశలో 40 ఏసీ ఎలక్ట్రికల్ బస్సులను, రెండో దశలో 60 బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఆపరేటర్‌ను నియమించడానికి టెండర్లను పిలవగా 5 సంస్థలు పాల్గొన్నాయని, మెసర్స్ సిద్ధార్థ ఇన్‌ఫ్రాటెక్ సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎల్1 బిడ్డర్‌గా నిలిచిందని మంత్రి తెలిపారు. ఆ సంస్థకు 40 బస్సులను నడపడానికి అప్పగింత లేఖ జారీచేసినట్లు వెల్లడించారు.

రైల్వేస్టేషన్లకు నవకళ

- దేశవ్యాప్తంగా 90 స్టేషన్ల ఎంపిక
- జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు ఏడు
- సంస్కృతి, చారిత్రక అంశాల మేళవింపు కొత్త అందాలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో ఏడు ప్రధాన రైల్వేస్టేషన్ల ముఖచిత్రాలు మారనున్నాయి. స్థానిక సంస్కృతి, చారిత్రాత్మక అంశాలు ప్రతిబింబిస్తాయి. దేశ వ్యాప్తంగా 600 రైల్వేస్టేషన్లను స్టేషన్ పునరభివృద్ధి కార్య క్రమంలో ప్రపంచస్థాయిలో సదుపాయాలను కల్పించాలని రైల్వేశాఖ నిర్ణయించిన విషయం తెలిసిందే. తాజాగా రైల్వే శాఖ ప్రయాణీకులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు స్టేషన్లలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 90 రైల్వేస్టేషన్లలను ఎంపిక చేసింది. రోజుకు 45వేల మంది అంతకంటే ఎక్కువ ప్రయాణీకులు రాకపోకలు సాగించే రైల్వేస్టేషన్లకు ఈ జాబితాలో చోటు కల్పించింది. దీంతో దేశంలోని అన్ని ప్రధాన రైల్వేస్టేషన్లు స్థానిక సంస్కృతి, చారిత్రక అంశాల మేళవింపుతో కనువిందు చేస్తూ ప్రయా ణీకులను స్వాగతం పలకనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, నెల్లూరు, గుం టూరు, గుంతకల్, కర్నూలు సిటీ రైల్వేస్టేషన్లను ఈ కార్య క్రమం కోసం రైల్వేశాఖ ఎంపిక చేసింది. ఈ స్టేషన్లను స్థానికంగా ప్రాముఖ్యత కలిగిన కట్టడాలు, ఆనవాళ్లు, సంస్కృతి సంప్రదాయాలు ప్రస్ఫుటమయ్యే రీతిలో ప్రధాన స్టేషన్ భవనాలను నిర్మించనుంది. ఇప్పటికే రైల్వేస్టేషన్ల పునరభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రైల్వే స్టేషన్స్ డెవలెప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఐఆర్ఎస్‌డీసీఎల్), రైల్ ల్యాండ్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ), ఐఆర్‌సీఓఎన్ ఐఎస్ఎల్ లిమిటెడ్‌తోపాటు ఆయా



రైల్వేజోన్లు, డివిజన్లు, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖలో భాగమైన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఎన్‌బీసీసీ)కి పనులను రైల్వేశాఖ అప్పగించింది. ప్రస్తుతం విజయవాడ, విశాఖపట్నం స్టేషన్లను జోనల్ రైల్వేలు అభి వృద్ధి చేస్తుండగా, తిరుపతి, నెల్లూరులను ఎన్‌బీసీసీ పర్య వేక్షిస్తోంది. అయితే కొత్తగా ఎంపికైన స్టేషన్లలో గుం టూరు, గుంతకల్, కర్నూలు సిటీలను కూడా దక్షిణ మధ్య రైల్వే నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఇదిలా ఉండగా జాబితాలో 11 స్టేషన్లతో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఏడేసి స్టేషన్లతో ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు రెండో స్థానంలో, ఆరేసి స్టేషన్లతో మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాలు రాష్ట్రాలు మూడో స్థానంలో ఉన్నాయి. దక్షిణాది పరంగా చూస్తే తమిళ నాడులో 4, కేరళలో 4, కర్ణాటకలో 3 జాబితాలో స్థానం సంపాదించాయి. తెలంగాణ, పుదుచ్చేరి మాత్రం ఒక్కో స్టేషన్‌తో సరిపెట్టుకున్నాయి.

వెంకన్న ఆలయ నమూనాతో తిరుపతి! : తిరుపతి రైల్వే స్టేషన్‌ను ప్రపంచ ప్రఖ్యాతి చెందిన తిరుమల శ్రీవేంకటే శ్వరస్వామి ఆలయ నమూనాను సమ్మిళితం చేయాలని ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్న ఎన్‌బీసీసీ భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలను చోళులు, పల్లవులు, పాండ్యులు, మౌర్య, శాతవాహన, కాకతీయ, విజయనగర రాజులు పాలించారు. జైన, బౌద్ధ మత ప్రచారకులు నడయాడారు. వర్తకం పేరుతో దేశంలో ప్రవేశించి బ్రిటీష్, ఫ్రెంచ్ పాలకులు కూడా కొన్నాళ్లు పాలన సాగించారు. విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న దుర్గమ్మను దసరా మహోత్సవాలు, భవానీదీక్షల సందర్భంగా ఏటా లక్షలాదిగా భక్తులు దర్శించుకుంటారు. పవిత్ర కృష్ణానదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజ్ నగరానికే మణిహారంగా నిలుస్తుంది.


ఇక విశాఖపట్నంజిల్లాలోని అరకు, బొర్రా గుహలను దేశవిదేశాలకు చెందిన పర్యాటకులు పెద్ద ఎత్తున సందర్శిస్తారు. అలాగే నెల్లూరులో శ్రీరంగనాథస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. కర్నూలు పేరు వినగానే కొండారెడ్డి బురుజు మదిలో మెదులుతుంది. ఇక్కడకు 18 కిలోమీటర్ల దూరంలోని కేతవరంలో రాతియుగం నాటి ఆనవాళ్లున్నాయి. ఈ జిల్లాలోని యాగంటి శైవ క్షేత్రం ఎంతో ప్రసిద్ధి. అనంతపురంజిల్లాకు చెందిన గుంతకల్ విజయనగర రాజుల ఏలుబడిలో ఉండేది. అలాగే ఇక్కడ సూఫీ గురువు హజరత్ మస్తాన్ వలి దర్గా, సెయింట్ ఆన్స్ చర్చిని ఏటా పెద్ద సంఖ్యలో సందర్శిస్తారు. వీటి ఆధారంగా ఎంపిక చేసిన నమూనాలను ఆధారంగా చేసుకొని స్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఉన్నతాధికారి తెలిపారు.

మాల్యాకు ఒక న్యాయం

విజయసాయిరెడ్డికి మరో న్యాయమా

అమిత్‌షా లేఖకు అసెంబ్లీలోనే సమాధానమిచ్చా : సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-అమరావతి : విజయ్ మాల్యాకు ఒక న్యాయం. విజయసాయిరెడ్డికి మరో న్యాయమా, ఇద్దరూ ఆర్థిక నేరస్థులే. వారి మధ్య వ్యత్యాసం ఏమిటని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విజయ్ మాల్యా దేశం వదిలి పరార య్యాడు, విజయసాయి పీఎంవోలో ఉంటున్నారు. విజయ్ మాల్యా సభ్యత్వం రద్దు చేశారు. విజయసాయి సభ్యత్వం కొనసాగిస్తున్నారు ఏమిటీ వ్యత్యాసం. కావాలనే బీజేపీ నేతలు టీడీపీపై ఆరోపణలు చేస్తున్నారని సీఎం అన్నారు. ఆదివారం ఎంపీలు, మంత్రులు, పార్టీ నేతలతో టెలికాన్ఫ రెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు. బీజేపీపై అవినీతి ఆరో పణలకు జవాబివ్వకుండా టీడీపీపై అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. బీజేపీ చేస్తున్న ఆరోపణ లను టీడీపీ నేతలు ఖండించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలన్నారు. చట్టంలో అంశాలు, పార్లమెంటు ఇచ్చిన హామీలు అమలు చేయమన్నాం. దానికి బీజేపీకి ఎందుకు అంత కోపం వస్తోందని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాకు సమానంగా ఇస్తామంటేనే ఆర్థిక సాయానికి ఒప్పుకున్నామని, హోదా ఎవరికీ ఇవ్వవద్దని ఆర్థిక సంఘం చెప్పిందని వక్రీకరించారని ఆయన పేర్కొన్నారు. ఈఏపీలకు నిధులు ఇస్తామని చెప్పి కనీసం మెమో ఇవ్వలేదు, మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదన్నారు. నాలుగేళ్లయ్యాక ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ అంటు న్నారని సీఎం చెప్పుకొచ్చారు. అమిత్ షా లేఖకు అసెంబ్లీ లోనే సమాధానం ఇచ్చాను. హోదా లేదని మనకు చెప్పి ఈశాన్య రాష్ట్రాలకు 90:10 నిధులు కొనసాగిస్తున్నారు. జీఎస్టీలో కూడా ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక లబ్ధి చేకూరుస్తున్నారని, ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చేవన్నీ ఏపీకి కూడా ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదన్నారు. తొలి



బడ్జెట్‌లోనే రెక్కలు విరిచి ఎగరమంటే ఎలా అని కేంద్రాన్ని ప్రశ్నించాను. నాలుగేళ్ల క్రితమే కేంద్రాన్ని నిలదీశానని చెప్పారు. నాలుగు బడ్జెట్‌లు చూసినా ఏపీకి న్యాయం చేయలేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులన్నింటికీ యూసీలు ఇచ్చాం. యూసీలు ఇవ్వలేదు కాబట్టే నిధులు ఆపామనడం పచ్చి అబద్ధం, దుర్మార్గమన్నారు. యూసీలు ఇవ్వలేదని రుజువు చేస్తే ఎంపీగా రాజీనామా చేస్తానని సీఎం రమేష్ సవాల్ చేశారని. లేకుంటే మీరు రాజీనామా చేస్తారా అంటే బీజేపీ ఎంపీ జీవీఎల్ వెనక్కి తగ్గారన్నారు. ఆర్థిక లోటుకు యూసీలు ఇవ్వనవసరం లేదని, వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.1050 కోట్లలో 940 కోట్లకు, అమరావతికి రూ.1000 కోట్లకు యూసీలు ఇచ్చామన్నారు. గుంటూరు, విజయవాడకు ఇచ్చిన నిధుల్లో రూ.350 కోట్లకు యూసీలు ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోరాదని, అదే సమయంలో ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజల కోసం పోరాడే ముఖ్యమంత్రి పక్షాన ఉంటారా, రాష్ట్రానికి అన్యాయం చేసే కేంద్రం పక్షాన ఉంటారా అని వివిధ పార్టీల నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు.

తాగునీటి సమస్య తీరుస్తాం : కేటీఆర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఇంటర్ కనెక్టివిటీ గ్రిడ్‌ను నిర్మిస్తున్నామ న్నారు. ఆదివారం శాసనమండలిలో ఎంఐఎం సభ్యు డు సయ్యద్ అమినుల్ హసన్ జాఫ్రీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. మొత్తం 537.24 ఎంఎల్ సామర్థ్యంతో జీహెచ్ఎంసీ ప్రాంతాల్లో 236 రిజర్వాయర్లు ఉన్నాయన్నారు. మరో 56 నూతన సర్వీసు రిజర్వాయర్లను ప్రతిపాదించా మని, ఇప్పటికే 44 రిజర్వాయర్లు పూర్తయ్యా యని, మిగిలిన 12 తుది దశలో ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అవస రమైన మౌలిక సదుపా యాలను కల్పించేందుకు ప్రధాన కూడళ్లలో నీటి నిల్వ రిజర్వాయర్లను నిర్మించడానికి ఫీడర్ మెయిన్‌లను వేయడానికి గాను ఔట్‌లెట్లు, పంపిణీ కాలువలను ఏర్పాటు చేసి నీటి సరఫరాను మెరుగుపర్చినట్లు చెప్పారు. నీటి సరఫరాను పెంచడానికి గోదావరి నది నుంచి 172 ఎంజీడీల నీటిని తీసుకోవడానికి 10 టీఎంసీల నిల్వ సామర్థ్యంగల రిజర్వాయర్ల నిర్మాణం, 172 ఎంజీడీల నీటి శుద్ధీకరణ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ఇంటర్ కనెక్టివిటీ గ్రిడ్ ద్వారా కృష్ణా, గోదావరి నీటిని కలిపి నగరంలో ఉన్న 21 లక్షల కుటుం బాలకు తాగునీరు అందిస్తామ న్నారు. నిత్యం ఒక్కో వ్యక్తికి 150 లీటర్ల నీటిని సరఫరా చేస్తా మని చెప్పారు. గోదావరి, కృష్ణా, సింగూరు, మంజీరా నుంచి 448 ఎంజీడీల నీటిని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అందులో ఎస్సీ, ఎస్టీలకు కోటా : ఉపాధి కల్పన, మున్సిపల్ షాపుల కేటా యింపు, కాంట్రాక్టు విషయ ంలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వే షన్లు అమలు చేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. మొత్తం 5228 పదవులు మంజూరు కాగా, వీటిలో 800 పద వులు ఎస్సీల కోసం కేటాయించినట్లు వెల్లడిం చారు. అధికారపక్ష సభ్యులు సభావత్ రాములు నాయక్, డి.రాజేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధాన మిచ్చారు. ఎస్టీలకు 320 పదవులకు గాను 84 మంది ఉద్యోగులు పనిచే స్తున్నారన్నారు. పట్టణ సంస్థ ల్లో 3,862 మున్సి పల్ షాపులున్నాయని, ఎస్సీ వర్గానికి 580 షాపు లకుగాను 413 కేటాయిం చామని చెప్పారు. ఎస్టీలకు 232 షాపులకుగాను 154 కేటాయించి నట్లు కేటీఆర్ చెప్పారు. పట్టణ, స్థానిక సంస్థల్లో 2120 కాంట్రాక్టులు ఉన్నాయని, ఎస్సీ వర్గానికి 284, ఎస్టీ సమాజిక వర్గానికి 127 కేటాయించి నట్లు చెప్పారు. రాములునాయక్ మాట్లాడుతూ కేటాయించిన షాపులతో పాటు మరిన్ని పెంచి ఎస్టీలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రమంతటా ఆప్టిక్ ఫైబర్ కేబుళ్లు : రాష్ట్రమంతటా ఆప్టిక్ ఫైబర్ కేబుళ్లను వేయా లని నిర్ణయించినట్లు కేటీఆర్ చెప్పారు. అతి తక్కువ ధరలతో ప్రజలకు ఇంటర్నెట్, కేబుల్ టెలివిజన్ సర్వీసులను సమకూ ర్చాలని సంకల్పించామన్నారు.

ఇంటర్నెట్, కేబుల్ టెలివిజన్ సర్వీసులను ప్రజలకు అందించేందుకు గూగుల్ కంపెనీతో ఒప్పం దం కుదుర్చుకోలేదన్నారు. అన్ని ఇళ్లతో పాటు రాష్ట్రమంతటా ఆప్టిక్ ఫైబర్ కేబుళ్లను వేయాలని నిర్ణయించామన్నారు. ఐఎస్‌పీల పోటీ వాతావరణంలో ఇంటర్నెట్ సర్వీసులను ప్రజలకు లభిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం నుండి ప్రభుత్వానికి, ప్రభుత్వం నుండి పౌరులకు సర్వీసులను సమకూ ర్చాలని యోచిస్తోన్నట్లు చెప్పారు. ప్రభాకరరావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇంట ర్నెట్ సేవలను వేగవంతం చేయాలని కోరారు.

టెట్ ఫలితాలపై భిన్నస్వరాలు

- పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదుల వెల్లువ
- 9వేలకు చేరిన అభ్యంతరాలు
- జాతా క్వాలిఫైడ్ అభ్యర్థుల ఆగ్రహం
- మార్కుల కలిపివేతపై అనుమానాలు..!

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: విద్యా, ఉద్యోగ పోటీ ప్రపంచంలో ఒక్క మార్కులో అభ్యర్థుల జయ, పరాజ యాలు ముడిపడి వుంటాయి. ఏపీ టెట్‌లోనూ ఇదే విధానం వుంది. ఇటీవల నిర్వహించిన ఏపీ టెట్-2017 ఫలితాల్లో 43శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. గత టెట్ పరీక్షల కంటే ఈ ఫలితాలు ఆశాజనకంగానే వున్నా యి. ఈ ఫలితాల్లో అర్హత సాధించని పలువురు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంపై అసంతృ ప్తులు వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ వివిధ కారణాలను, అభ్యంతరాలను చూపుతూ అధికా రులను ఆశ్రయిస్తున్నారు. అటు మార్కుల ఫిర్యాదులపై పారదర్శకంగా వుండాలని, అనవసరంగా మార్కులు కలిపితే తమ భవిష్యత్తు తారుమారవుతుందని టెట్‌లో తాజాగా అర్హత పొందిన అభ్యర్థులు వాపోతున్నారు. టెట్ బాధిత అభ్యర్థుల నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ ఆన్‌లైన్లో ఫిర్యాదుల స్వీకరణకు అధికారులు అవకాశం కల్పించారు. టెట్ మార్కులు, తప్పిదాలు, సాంకేతిక అంశాల తప్పిదాలపై అభ్యర్థుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. 13 జిల్లాల నుంచి దాదాపు 9వేల వరకూ రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇందులో మార్కులు తక్కువ వచ్చాయనే ఫిర్యాదులున్నట్లు అధికంగా వున్నట్లు తెలిసింది. బాధిత అభ్యర్థులు రాసిన టెట్ ప్రశ్న, జవాబు పత్రాలను సక్రమంగా తిలకించి, వాస్తవాలను గమనించాలని టెట్ తాజా క్వాలిఫైడ్ అభ్యర్థులు సూచిస్తు న్నారు. రాజకీయ ఒత్తిళ్లతో ఇష్టానుసారంగా మార్కులను కలిపితే... తమకు నష్టం కలుగుతుందని వాపోతున్నారు. ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) ఫలితాలపై అభ్యంత రాలు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రాష్ట్ర



ఫైల్‌ఫోటో

మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు టెట్ ఫలితాలను వెల్లడించిన విషయం విదితమే. ఈ ఫలితా ల్లోనూ, ఫైనల్ కీలోనూ మార్కుల వ్యత్యాసంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కార్యాలయానికి వేలాది మంది అభ్యర్థులు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. అభ్యంతరాలు తెలిపే వారి కోసం ఈ నెల 31వ తేదీ వరకూ ఆన్‌లైన్లో రూ.200 చెల్లించి ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పిం చారు. అభ్యర్థుల పేర్ల జాబితాను క్రోడీకరించి, వారు రాసిన ప్రశ్న పత్రం, జవాబు లను ఆన్‌లైన్లో వుంచారు. ఇప్పటివరకూ దాదాపు 9వేల వరకూ పాఠశాల విద్యా శాఖ కమిషనర్‌కు అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. ఇందులో పుట్టినతేదీ, కులాల్లో నెలకొన్న తుప్పులను మార్పు చేయాలని వివరిం చారు. ఫైనల్ కీలో మార్కులు, ఫలితాల్లో మార్కులు వేర్వే రుగా రావడంపైనా అభ్యంతరాల్ని సబ్జెక్టుల వారీగా పలువురు ఆన్‌లైన్లో అందజేశారు. ఇప్పటి వరకూ వివిధ సమస్యలపై 4వేల మంది అభ్యంతరాల్ని అధికా రులు వెల్లడించారు. అభ్యర్థుల పరీక్షల ప్రశ్నాపత్రం, జవాబు లను ఆన్‌లైన్లో పొందుపరిచారు. మిగిలిన వారి వివరాల్ని నేటి నుంచి ఆన్‌లైన్‌లో వుంచుతామని ఏపీ టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు.

టెట్ ఫలితాలపై ఆగని గందరగోళం

టెట్ ఫలితాల విడుదలతో ఈ పరీక్ష ప్రక్రియ ముగిసిందని అందరూ భావిం చారు. ఫలితాల అనంతరమూ మార్కుల్లో తప్పిదాలు రావడంపై మళ్లీ కథ మొదట కొచ్చింది. అర్హత సాధించిన వారంతా డీఎస్సీ కోచింగ్‌లో నిమగ్నమయ్యారు. మార్కులు తక్కువ వచ్చిన వారంతా ఫిర్యాదులు చేయడంలో నిమగ్నమయ్యారు. ఫిర్యాలు చేసిన అభ్యర్థులకు వారి అర్హతకు సంబంధించి ఒకటి, రెండు మార్కులు తగ్గితే.. వాటిని కలుపుతున్నారనే ప్రచా రముంది. దీంతో టెట్ అర్హతా అభ్యర్థులంతా కలవరం చెందుతున్నారు. పోటీ పరీక్షల వ్యవహారంలో పదే పదే అభ్యంతరాలు స్వీకరించడం తగదనే వాదనలున్నాయి.

అభ్యంతరాల పరిష్కారంపై పారదర్శకత వుండాలి..

టెట్‌లో ఫలితాల అభ్యంతరాలు, మార్కుల అసమాన తలపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఫిర్యాదులు స్వీకరించడంపై సర్వత్రా వ్యతిరేకత నెల కొంది. ఈ వ్యవహారమంతా ఫలితాలకు ముందే వుండా లని టెట్ అర్హతా అభ్యర్థులు సూచిస్తున్నారు. టెట్ పేపర్-1,2,3 పరీక్షలపై ప్రాథమిక కీ, తుది కీలను రెండు విడతలుగా పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. వాటిపై వచ్చిన సందేహాలకు ఫలితాలకు ముందే అధికారులు వివరణిచ్చారు. వెబ్‌సైట్‌లో బహిరంగంగా ప్రశ్నపత్రాలు, కీలను అందుబాటులో వుంచారు. ఈ వివరణలపై కొందరు సంతృప్తి చెందగా, మరికొందరు తమకు అన్యాయం కొనసాగిందని వాపోయారు.

వెయిటేజీ కోసమే తపన..

ఉపాధ్యాయ పోస్టుల ఎంపిక ప్రక్రియలో టెట్ మార్కులకు 20 మార్కుల వెయిటేజీ కల్పించడంతో ఈ మార్కులకు ప్రాధాన్యత నెలకొంది. టెట్‌లో 150 మార్కులకుగాను 20 మార్కుల వెయిటేజీ నిర్ధారించారు. ఇందులో వచ్చిన వెయి టేజీ మార్కులన్నీ డీఎస్సీ రాత పరీక్ష మార్కులకు అద నంగా కలుస్తాయి. టెట్ వెయిటేజీ, డీఎస్సీ రాత పరీక్ష మార్కులను కలిపి ఉపాధ్యాయ పోస్టులను ఎంపిక చేస్తారు. అటు టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీకి దర ఖాస్తు చేయాలనే నిబంధన్ని ప్రభుత్వం విధించింది. ఒకటి నుంచి ఐదు మార్కుల తేడాతో(కేటగిరీల వారీగా) అర్హత సాధించలేని వారంతా..వివిధ సాంకేతిక అంశాల్ని ఎత్తి చూపుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో అసమానతలు లేకుండాచూడాలని టెట్ అర్హత అభ్యర్థులు కోరుతున్నారు.

రాష్ట్ర మహాసభల జయప్రదాన్ని కోరుతూ

సీపీఐ భారీ స్కూటర్ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి రెండవ మహాసభల సందర్భంగా ఆదివారం నగరంలో భారీ స్కూటర్ ర్యాలీ జరిగింది. సీపీఐ మహాసభల విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన స్కూటర్ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. ఏప్రిల్ 1 నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్ మహానగరంలో జరగనున్న మహాసభల సందర్భంగా సీపీఐ నగర సమితి, ఆహ్వానసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటర్ ర్యాలీని పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు. ర్యాలీలో సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, హైదరాబాద్ నగర సమితి కార్యదర్శి, ఆహ్వానసంఘ ప్రధాన కార్యదర్శి ఈటీ నరసింహ, ఆహ్వానసంఘ ప్యాట్రన్ వీఎస్ బోస్ పాల్గొన్నారు. మఖ్దూంభవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, నారాయణగూడ, వైఎంసీఏ, కాచిగూడ, బర్కత్‌పురా, బాగ్‌లింగం పల్లి చౌరస్తా, నారాయణగూడ ఫ్లైఓవర్, హిమాయత్‌నగర్ వైజంక్షన్ మీదుగా తిరిగి మఖ్దూంభవన్ చేరుకుంది. సీపీఐ నాయకులు రెడ్‌షర్టులు ధరించి ద్విచక్ర వాహనాలపై అరుణ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్నారు. సీపీఐ రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి, లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి, పోరాడతాం పోరాడతాం ప్రజాసమస్యలపై పోరాడతాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో అజీజ్ పాషా, వీఎస్ బోస్, ఈటీ నరసింహ మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు రెండవ మహాసభలు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 1వ తేదీన భారీ ప్రదర్శన, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని, సభకు సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, జాతీయ కార్యదర్శులు డా.కె.నారాయణ, అతుల్‌కుమార్ అంజాన్ హాజరవుతారని తెలిపారు. 2, 3, 4 తేదీల్లో ప్రతినిధుల మహాసభ ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరుగుతుందని, నాటి మహాసభల నుంచి నేటి వరకు జరిగిన కార్యకలాపాలను సమీక్షించి భవిష్యత్తు పోరాట కార్యాచరణను ఖరారు చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న, అమలు చేస్తున్న విధానాలు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఇసుక మాఫియా, భూమాఫియా ఆగడాలు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, డబుల్ బెడ్ రూమ్, ధర్నాచౌక్ ఎత్తివేత, రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను అణచివేయడం, మతోన్మాద శక్తుల ఆగడాలు వంటి అంశాలను చర్చిస్తామని వివరించారు. స్కూటర్ ర్యాలీలో ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, ఎండీ యూసఫ్, ఎం.నర్సింహ, బి.వెంకటేష్, జి.చంద్రమోహన్‌గౌడ్, బాలయ్య యాదవ్, సలీమ్, రాజేందర్, బి.రాములుయాదవ్, చక్రి, రాకేష్ సింగ్, జి.హరినాథ్‌గౌడ్, బొడ్డుపల్లి కిషన్, ఆర్.మల్లేష్, బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, చైతన్యయాదవ్ పాల్గొన్నారు.

ఆరు బిల్లులకు తెలంగాణ మండలి ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆరు బిల్లులకు శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది. అధికార, విపక్ష సభ్యులు మద్దతు పలకడంతో ఆదివారం మండలిలో బిల్లులకు ఆమోదం లభించింది. తెలంగాణ అసైన్డ్ భూములు (సవరణ) బిల్లు-2018ని ఉపముఖ్యమంత్రి, రెవెన్యూశాఖ మంత్రి మహమూద్ అలీ ప్రవేశపెట్టారు. స్వల్ప చర్చ అనంతరం ఆమోదం పొందింది. రాష్ట్ర వ్యాప్తంగా 20,08,608 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని చెప్పారు. అసైన్డ్ భూముల చట్టసవరణ వల్ల నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరుగుతుందని, ఈ బిల్లు వల్ల అసైన్డ్ భూములను విక్రయించడానికి వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. తెలంగాణ వైద్య, వృత్తిదారుల రిజిస్ట్రేషన్ (సవరణ) బిల్లు-2018ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రవేశపెట్టారు. బీజేపీ, ఎంఐఎం, అధికార పార్టీ బిల్లును స్వాగతించి మద్దతు తెలపడంతో ఆమోదం లభించింది. తెలంగాణ న్యాయ వాదుల, గుమస్తాల సంక్షేమ నిధి (సవరణ) బిల్లు-2018, తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి (సవరణ) బిల్లు-2018ని న్యాయశాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి ప్రవేశపెట్టారు. బిల్లుకు బీజేపీ, ఎంఐఎం సభ్యులు మద్దతు పలికారు. ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు మృతిచెందితే రూ.3 లక్షలు చెల్లించేందుకు బిల్లులో వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధి కింద ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిం దని, దీనివల్ల న్యాయవాదులకు స్టైఫండ్, లైబ్రరీ నిధి అందుతుందన్నారు. పాఠశాలల్లో తెలుగు భాష బోధన, అధ్యయన బిల్లు 2018ని ఉపముఖ్య మంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెట్టారు. బీజేపీ సభ్యులు ఎం.రామచందరరావు, ఎంఐఎం సభ్యులు జాఫ్రీ, అధికారపక్ష సభ్యులు పి.సతీష్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి బిల్లును స్వాగతించారు. కడియం మాట్లాడుతూ తెలుగు భాషకు పట్టం కట్టాలన్న యోచనతోనే ఒకటి నుంచి 10వ తరగతి వరకు తప్పనిసరిగా తెలుగు భాషను అమలు చేయడం ఈ బిల్లు ఉద్దేశమని పేర్కొన్నారు. తెలుగుకు పూర్వవైభవం తేవడంతో పాటు తెలుగు భాషను చదవాలని, నేర్చుకోవాలన్న యోచనతో బిల్లు తెచ్చినట్లు వివరించారు. ఇతర భాషలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బిల్లు తెచ్చామన్నారు. ఇంగ్లీషు నేర్చుకుంటూనే తెలుగును కూడా నేర్చుకోవాలని కోరారు. సెంట్రల్ స్కూల్స్ లో త్రిభాషా సూత్రాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. తెలుగు భాషను కాపాడుకోవడం, రక్షించుకోవడం అందరి బాధ్యతని చెప్పారు. తెలంగాణ పోలీసు (పోలీసు డైరెక్టర్ జనరల్ ఎంపిక, నియామకం) బిల్లు 2018ని సీఎం కె.చంద్రశేఖరరావు పక్షాన మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కె.తారకరామారావు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు బీజేపీ, ఎంఐఎం, అధికార సభ్యులు స్వాగతించి మద్దతు పలికారు. కేటీఆర్ మాట్లాడుతూ శాంతి భద్రతలు, రాష్ట్రానికి డీజీపీని నియమించుకునే అధికారం రాష్ట్రపరిధిలో ఉంటుందన్నారు. రాష్ట్రానికి డీజీపీని నియమించాలంటే ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఎంపిక చేసి కేంద్రానికి పంపితే వారిలో ఒకరిని డీజీపీగా నియమిస్తారని పేర్కొన్నారు. డీజీపీని ఎంపిక చేసుకొని నియమించే అధికారం రాష్ట్రానికే ఉండాలన్న యోచనతో ఈ బిల్లు తెచ్చామని, ఇలాంటి బిల్లు అనేక రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులోకి వచ్చిందన్నారు.

సమన్వయంతో ముందుకు సాగేనా !



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నాయ కులను, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే వివిధ రూపాలలో కార్యక్రమాలకు శ్రీకారంచుడుతోంది. ప్రజాచైతన్య బస్సుయాత్ర మొదటి విడత ముగిసింది. ఏప్రిల్ 1 నుంచి రెండో విడత బస్సుయాత్రకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండో విడత యాత్రకు పార్టీ మరో బస్సును సిద్ధం చేసుకుంటున్నట్లుగా సమాచారం. ఎక్కడిక్కక్కడ బహిరంగసభలు నిర్వహించడంతో బస్సు యాత్ర కాస్త సభల యాత్రగా మారింది. కీలక నాయకులలో చాలా మంది కూడా మొదటి విడద యాత్రకు దూరంగా వుంటూ వచ్చారు. ఒక సమావేశానికి వచ్చిన నాయ కులు మరో సమావేశానికి కనబడలేదు. పార్టీలో కీలకంగా వున్న డీకే అరుణ, గీతారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సునితాలక్ష్మారెడ్డిలు పాల్గొనలేదు. పార్టీలో అంతర్గత విబేధాలే ఇందుకు కారణమా అని పార్టీ నాయకులు చర్చించుకున్నారు. పలు చోట్ల పార్టీలో వున్న అంతర్గత విబేధాలు సభావేది కలపై బయట పడ్డాయి. రెండో విడతలోనైనా ఇలాంటి పొరపాట్లు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈసారి నాయకులు ఎంతవరకు సమన్వయంతో ముందుకు సాగుతారో వేచి చూడాలి.

నిమ్స్‌లో మెడికో ఆత్మహత్య

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో మెడికో ఆత్మహత్య చేసుకో వడం కలకలం రేపింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన శివతేజ (31) నిమ్స్ న్యూరాలజీ విభాగంలో పీజీ చేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకొని డాక్టర్స్ క్లబ్‌కు వెళ్లిన శివతేజ తన రూంలోని బెడ్ షీట్‌తో ఉరివేసుకున్నాడు. ఈ ఘటన రాత్రి జరగడంతో ఎవ్వరూ గమనించ లేదు. అదివారం ఉదయం విషయం బయటకు వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పీజీ వైద్యుడి ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. అయితే ప్రేమ వ్యవహారం ఏమైనా వుందా లేక ఇతర కారణాలు వున్నాయా అనే వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. అమెరికాలో ఉన్న మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించామన్నారు.

క్రీడలు

అందరూ సత్తా ఉన్న ఆటగాళ్లే : ధావన్



న్యూఢిల్లీ: టీంఇండియా యువ ఆటగాళ్లతో దుర్భేద్యంగా ఉందని భారత ఓపెనర్ శిఖర్ ధావన్ అన్నాడు. యువ క్రికెటర్లు అంతర్జాతీయ టోర్నీల్లో అద్భుతంగా రాణించగలుగుతున్నారని..టోర్నీకి తగ్గట్టుగా ప్రదర్శన చేసే సత్తా వారిలో ఉందని ఈ ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్ పేర్కొన్నాడు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌నే ఉదాహరణగా తీసుకుంటే.. రోహిత్ శర్మ నాయకత్వంలో యువ టీంఇండియా కప్‌ను గెలుచుకోవడంలో యువ ఆటగాళ్లు విశేషంగా రాణించారని ధావన్ అన్నాడు. ఒకవైపు విరాట్ కోహ్లి, ఎంఎస్ ధోని, మరి కొంత సీనియర్లు అందుబాటులో లేకున్నా..యువ ఆటగాళ్లు ఈ సిరీస్‌లో సత్తా చాటడంతో ఎంతటి అంతర్జాతీయ మ్యాచ్‌లోనైనా సులభంగా రాణించగలరనే నమ్మకం వారిలో చూసినట్లు ఈ ఓపెనర్ బ్యాట్స్‌మెన్ విశ్లేషించాడు. 'మా బెంచ్ బలంగా ఉంది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టుతో శ్రీలంక, బంగ్లాదేశ్‌లను ఓడించి మరీ నిదహాస్ ట్రోఫీని ఒడిసిపట్టుకున్నాం. ఆ గెలుపు గొప్ప ప్రభావం చూపించింది. దీన్ని బట్టి మా యువ ఆటగాళ్లతో కూడిన జట్టు కూడా దృఢంగా ఉందని గట్టి సంకేతాలు పంపే అవకాశం దొరికింది. ఇక్కడి నుంచే వాళ్లు క్రమంగా వెలుగులోకి వస్తున్నారంటూ' ఈ ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్ అన్నాడు. బౌలింగ్‌లోనూ ఎన్నో మెరుగైన వనరులు ఈ సిరీస్ ద్వారా భారత్‌కు దొరికినట్లు శిఖర్ పేర్కొన్నాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఓడిపోయినా, తర్వాతి మ్యాచ్ నుంచి మెరుగైన ప్రదర్శనతో ప్రత్యర్థిని కట్టడి చేశామని అన్నాడు. ఉత్కంఠభరిత పోరాటంతో సిరీస్‌ను ముగించినట్లు.. సిరీస్‌ను బాగా ఆస్వాదించినట్లు ధావన్ చెప్పుకొచ్చాడు. ఇక ఐపీఎల్ సీజను గురించి మాట్లాడుతూ.. ఏప్రిల్ 7నుంచి ప్రారంభంకానున్న ఈ సీజన్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు. డేవిడ్ వార్నర్ లాంటి నాణ్యమైన ఆటగాడు సన్‌రైజర్స్‌కు నాయకుడిగా దొరికాడు. అతనో గొప్ప బ్యాట్స్‌మెన్. ఆస్ట్రేలియాకు మాత్రమే కాదు..ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరపున కూడా మంచి రికార్డు కలిగి ఉన్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే మా ఇద్దరిదీ(ధావన్-వార్నర్) బెస్ట్ ఓపెనింగ్ జోడీ అని పేర్కొన్నాడు.

స్టీవ్ స్మిత్‌పై వేటు



కాన్‌బెర్రా: బాల్ టాంపరింగ్ వివాదం నేపథ్యంలో స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా చర్యలు తీసుకుంది. బంతి ఆకారం దెబ్బ తీసేందుకుగాను బాన్ క్రాఫ్ట్ బాల్ టాంపరింగ్‌కు పాల్పడటంపై క్రికెట్ ఆస్ట్రేలియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే స్మిత్ తన కెప్టెన్సీ పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా పలువురు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో స్మిత్, వార్నర్‌లను కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న మూడో టెస్ట్ మ్యాచ్(మిగిలి ఉన్న రెండు రోజులు)కు ఆసీస్ జట్టు మరో ఆటగాడు టిమ్ పైన్ సారథ్య బాధ్యతలు తీసుకోనున్నాడు. స్మిత్, వార్నర్ యథావిధిగా జట్టులోనే కొనసాగుతారు. బాల్ టాంపరింగ్‌పై విచారణ చేపడుతున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) వెల్లడించింది. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రధానమంత్రి మాల్కమ్ టర్న్‌బుల్ సైతం స్పందించారు. కెప్టెన్ స్మిత్ జట్టు ప్రవర్తించిన తీరు తనను ఆశ్చర్యానికి గురి చేసిందని, దీన్ని ఆసీస్ క్రికెట్ అభిమానులు సైతం అంగీకరించబోరని ఆయన పేర్కొన్నారు. మరోవైపు యావత్ క్రీడాలోకం ఈ ఘటనపై విస్మయం వ్యక్తం చేస్తోంది. బాల్‌టాంపరింగ్‌కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఆటగాళ్లు డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ కెప్టెన్‌గా క్లార్క్..?



మెల్‌బోర్న్: అవసరమైతే మళ్లీ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్లు ఆసీస్ మాజీ సారథి మైకేల్ క్లార్క్ అన్నాడు. కేప్‌టౌన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలక మూడో టెస్ట్‌లో ఆసీస్ ఆటగాడు కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ బంతి రివర్స్ స్వింగ్ తిరిగేందుకుగానూ టాంపరింగ్‌కు పాల్పడుతూ..కెమెరా కంటికి చిక్కిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అప్రమత్తమైన క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) మైదానంలో తమ ఆటగాళ్ల ప్రవర్తనపై ఆదివారం చర్యలు తీసుకుంది. కెప్టెన్ స్టీవెన్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌ను వారి బాధ్యతల నుంచి తొలిగించి మూడో టెస్ట్ సారథిగా మరో ఆటగాడు టిమ్ పైన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉదంతం నేపథ్యంలో మాజీ సారథి మైకేల్ క్లార్క్ స్పందించాడు. ఈ విషయమై తీవ్ర ఆవేదనకు లోనై మాట్లాడాడు. 'మైదానంలో తమ సహచర ఆటగాళ్ల చేసింది క్షమించరాని తప్పుగా అభివర్ణించాడు. అదేవిధంగా స్టీవెన్ స్మిత్‌కు, సహచర ఆటగాళ్లకు తన తరపున పూర్తి సానుభూతి ప్రకటిస్తున్నట్లు' పేర్కొన్నాడు. 'స్టీవెన్ స్మిత్ చేసింది చాలా పెద్ద తప్పు అని నా మనస్సు తలుస్తోంది. కానీ ఈ సమస్యకు ఏదో ఒక మార్గం ఉంటుంది. ఆస్ట్రేలియా కెప్టెన్‌గా స్టీవెన్ స్మిత్ తిరిగి కొనసాగుతాడని' ఈ మాజీ సారథి అంటున్నాడు. ఒకవేళ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా బాధ్యతలు చేపడతారా అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా..'సరైన వ్యక్తులు వచ్చి అడిగినప్పుడు నా సమాధానం గురించి ఆలోచిస్తానంటూ' క్లార్క్ తన మనస్సులో మాట బయటపెట్టాడు. క్లార్క్ తన చివరి మ్యాచ్‌ను 2015లో ఇంగ్లండ్‌తో ఆడాడు. అప్పుడు యాషెస్ సిరీస్‌లో చివరి టెస్ట్ అనంతరం మైకేల్ క్లార్క్ క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు.

కామన్వెల్త్‌కు మరో
తెలుగమ్మాయి



హైదరాబాద్: రోజులు మారాయి... దూసుకొస్తున్న మహిళలు ప్రతి రంగంలోనూ తమదంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. బ్యాడ్మింటన్ అనగానే ప్రస్తుతం మనకి గుర్తొచ్చే పేర్లు.. పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్. వీరితో పాటే మరో తెలుగమ్మాయి రుత్విక శివానీ రాకెట్‌తో రయ్ రయ్ మంటూ దూసుకొస్తోంది. అయితే 2016 దక్షిణాసియా క్రీడల్లో సింధును ఓడించి పసిడి నెగ్గిన ఇరవై యేళ్ల రుత్విక శివాని గురించి పెద్దగా ఎవరికీ తెలీదు. భారత బ్యాడ్మింటన్‌లో సైనా, సింధుల తర్వాత ఆ స్థాయిలో మహిళల సింగిల్స్‌లో రుత్విక సత్తా చాటుతోంది. చిన్న వయసులోనే బ్యాడ్మిం టన్‌లో సంచలనాలు సృష్టించి భవిష్యత్ సింధుగా కితాబులందుకున్న ఆమె కెరీర్ గాయాల కారణంగా అనుకున్నంత గొప్పగా సాగలేదు. అయితే ఫిట్‌నెస్ మెరుగుపరుచుకొని కొన్ని రోజులుగా మంచి ప్రదర్శన చేస్తున్న రుత్విక వచ్చే నెల 4న ఆస్ట్రేలియాలో ఆరంభం కానున్న కామన్వెల్త్ క్రీడల్లో తొలిసారి పాల్గొనబోతుంది.

ఆటలో దెబ్బలు సర్వ సాధారణం

ఖమ్మానికి చెందిన రుత్విక ప్రస్తుతం గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. అకాడమీలో చేరిన కొన్నిరోజుల్లోనే ఆటలో మంచి ప్రతిభ చూపి కోచ్ గోపీతో ప్రశంసలు కూడా అందుకున్న శివాని కెరీర్ అనుకున్నట్లు సాగలేదు. దానికి కారణం గాయాలు, సమయం కలిసిరాకపోవడం. ఈ ఏడాది ఆసియా టీమ్ చాంపియన్ షిప్స్‌లో హాంకాంగ్‌తో మ్యాచ్‌లో కీలకమైన సింగిల్స్‌లో విజయం సాధించిన శివాని ఆ తర్వాత వెన్నముక గాయం తో మూడు టోర్నీలకు దూరమైంది. ఆటలో గాయాలు సహజం అంటున్న శివాని.. ప్రతి విషయాన్ని సాను కూలంగా తీసుకొని ముందుకువెళ్లాలి అని చెబుతోంది.

కొన్ని నెలల పాటు మోకాలి కారణంగా

'ఆటలో గాయాలవడం సహజం. అవి మనల్ని మానసికంగా బలంగా తయారుచేస్తాయి. మరింత కృషి చేసేందుకు అవకాశం కల్పిస్తాయి. ప్రతిదాన్ని సానుకూలంగా తీసుకొని ముందుకు వెళ్లాలి' అని శివాని అంటోంది. 2015 జాతీయ చాంపియన్‌గా నిలిచిన తర్వాత జ్వరంతో ఆమె మూడు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2016లో రష్యా ఓపెన్‌లో విజేతగా నిలిచిన తర్వాత ఆమెను మోకాలి నొప్పి వెంటాడింది. దాంతో కొన్ని నెలలు ఆటకు దూరమై అదే ఊపులో మరిన్ని టోర్నీల్లో గెలిచే అవకాశాన్ని కోల్పోయింది.

కెరీర్‌లో ఇదే పెద్ద టోర్నీ

అయినా ఎప్పుడు మనోధైర్యం కోల్పోకుండా పట్టుదలతో శ్రమించి గాయాల నుంచి కోలుకుంది. కామన్వెల్త్ క్రీడలకు ముందు సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించానని ఆమె అంటోంది. 'కామన్వెల్త్ క్రీడలు ప్రతిష్ఠాత్మకమైనవి. ఇప్పటివరకు పాల్గొనబోతున్న పెద్ద ఈవెంట్ ఇదే. దానికోసం తీవ్రంగా సాధన చేస్తున్నా. గాయాల నుంచి పూర్తిగా కోలుకున్నా. కామన్వెల్త్ క్రీడలు పెద్ద సవాల్'' అని రుత్విక పేర్కొంది.

చిన్నతనం నుంచి విజయాల పరంపరే

రుత్విక ఐదేళ్ల వయసున్నపుడు తన తండ్రితో పాటు బ్యాడ్మింటన్ కోర్టుకు వెళ్లేది. అలా తనకు ఈ ఆటపై ఆసక్తి కలిగింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ సాయ్‌లో శిక్షణ తీసుకున్న శివాని.. సబ్‌జూనియర్, జూనియర్ విభా గాల్లో జాతీయ చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత గోపీ చంద్ అకాడమీలో చేరడంతో ఆమె ఆటలో మరింత పట్టు సాధించింది. సింధుతో పోల్చడాన్ని ఎలా భావిస్తున్నారని అడిగిన ప్రశ్నకు.."అభిమానులు ప్రతి టోర్నీలోనూ మంచి ప్రదర్శన చేయాలని కోరుకుంటారు. సింధు, సైనా అందరికి ఆదర్శంగా నిలిచారు. వాళ్లే మాకు ప్రేరణ" అని ఆమె చెప్పింది.

రషీద్‌ఖాన్ అరుదైన రికార్డు!

వేగంగా 100 వికెట్లు పడగొట్టిన అఫ్గాన్ కెప్టెన్



హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఆదివారం వెస్టిండీస్‌తో జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ యువ సంచలనం రషీద్ ఖాన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 100 వికెట్లు సాధించిన బౌలర్‌గా రికార్డు నమోదు చేశాడు. 44 మ్యాచుల్లోనే రషీద్ ఖాన్ ఈ ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ 52 మ్యాచుల్లో ఈ ఘనత సాధించి ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగగా తాజా మ్యాచ్‌తో రషీద్ ఖాన్ అధిగమించాడు. 23 ఓవర్ చివరి బంతికి విండీస్ ఆటగాడు షై హోప్‌ను ఎల్బీడబ్ల్యూ చేసి 100 వికెట్ల క్లబ్‌లో చేరాడు. ముస్తాక్ (పాకిస్తాన్) 53, షేన్ బాండ్ (న్యూజిలాండ్) 54, బ్రెట్‌లీ(ఆస్ట్రేలియా) 55 మ్యాచుల్లో ఈ ఘనతను అందుకోని తరువాతి స్థానాల్లో ఉన్నారు. ఇక భారత్ నుంచి 59 మ్యాచుల్లో ఇర్ఫాన్ పఠాన్ ఈ ఫీట్‌ను సాధించి వకార్ యూనిస్(పాకిస్తాన్), మోర్కెల్(దక్షిణాఫ్రికా)లతో సమంగా 8వ స్థానంలో నిలిచాడు. ఇక రషీద్ ఖాన్ ఈ సీజన్‌లో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున బరిలోకి దిగుతున్న విషయం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో షమికి గాయాలు



న్యూఢిల్లీ: పేసర్ మహ్మద్ షమి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆదివారం ఉదయం డెహ్రాడూన్ నుంచి ఢిల్లీకి కారులో వెళుతుండగా వాహనం అదుపుతప్పింది. దాంతో షమి తలకి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతన్ని దగ్గర్లోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తలకు కుట్లు పడినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన డెహ్రాడూన్‌లో విశ్రాంతి తీసుకుంటున్నట్లు పేర్కొన్నాయి. మ్యాచ్ ఫిక్సింగ్, ఇతర మహిళలతో సంబంధాలు, హత్యాయత్నానికి పాల్పడ్డాడంటూ షమి భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అప్పుడు బీసీసీఐ షమికి కాంట్రాక్టులో స్థానం కల్పించలేదు. అనంతరం బీసీసీఐ అవినీతి నిరోధక విభాగాధికారులకు మ్యాచ్ ఫిక్సింగ్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు నిర్వహించి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం దర్యాప్తులో షమి ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేలడంతో బీసీసీఐ 'బి' గ్రేడ్ కాంట్రాక్టులో చోటు కల్పించినట్లు స్పష్టం చేశారు. దీంతో ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆడేందుకు మార్గం సుగమమైంది. వేలంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ షమిని రూ.3కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ ఫిక్సింగ్ పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేకపోవడం, బీసీసీఐ కాంట్రాక్టు దక్కడం, ఐపీఎల్‌లో ఆడటంపై షమి తాజాగా సంతోషం వ్యక్తం చేశాడు. 'ఇది పూర్తిగా కుటుంబానికి సంబంధించిన సమస్య. నాకు వ్యతిరేకంగా వచ్చిన వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు. 10-15 రోజులుగా ఎంతో మానసిక క్షోభకు గురయ్యా. ఈ రోజులన్నీ ఎంతో కఠినంగా గడిచాయి. వీలైనంత త్వరగా వీటన్నింటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నా' అని తెలిపాడు.

టీమిండియాకు మళ్లీ ఓటమి



ముంబై: ఇంగ్లండ్-భారత్ మహిళా జట్ల మధ్య ఇక్కడ జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత్ రెండు రికార్డులు సృష్టించింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. టీ20ల్లో భారత్‌కు ఇది అత్యధిక స్కోరు కాగా, ఓవరాల్‌గా రెండోది. ఓపెనర్ మిథాలీ రాజ్ 43 బంతుల్లో 7 ఫోర్లతో 53 పరుగులు చేసింది. మరో ఓపెనర్ స్మృతి మందన రెచ్చిపోయి ఆడింది. 25 బంతుల్లోనే అర్ధ సెంచరీ నమోదు చేసి అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ సాధించిన భారత బ్యాట్స్ విమెన్‌గా రికార్డు సృష్టించింది. మొత్తం 40 బంతులు ఎదుర్కొన్న మందన 12 ఫోర్లు, 2 సిక్సర్లతో 76 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 30, పూజా వస్త్రాకర్ 22 పరుగులు చేశారు. అనంతరం 199 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 18.4 బంతుల్లో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఇంగ్లండ్ ఓపెనర్ డేనియల్ వ్యాట్ భారత్ బౌలర్లకు చుక్కలు చూపించింది. 64 బంతుల్లో 15 ఫోర్లు, 5 సిక్సర్లతో 124 పరుగులు చేసింది. టామీ బ్యూమోంట్ 35 పరుగులు చేసింది. ఫలితంగా మరో 8 బంతులు మిగిలి ఉండగానే ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గతేడాది ఆస్ట్రేలియాతో జరిగిన టీ20లో 180 పరుగుల స్కోరును ఛేదించిన ఇంగ్లండ్ ఈసారి 198 పరుగుల విజయలక్ష్యాన్ని అవలీలగా అందుకుంది. సెంచరీతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించిన డేనియల్ వ్యాట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది

ఆసిస్‌పై చర్యలకు ప్రొటీస్ డిమాండు



కేప్‌టౌన్: బాల్ ట్యాంపరింగ్‌తో అప్రతిష్ఠ మూటగట్టుకున్న ఆస్ట్రేలియాపై ప్రపంచవ్యాప్తంగా విమర్శల జడివాన కురుస్తోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌లు తమ పదవులు కోల్పోయారు. తాజాగా ఈ వ్యవహారంపై దక్షిణాఫ్రికా కోచ్ ఓటిస్ గిబ్సన్ తీవ్రంగా స్పందించారు. "నేను షాకయ్యా. అసలు ఏం జరుగుతోంది? ఇంతటి దారుణాన్ని నేనెప్పుడూ చూడలేదు" అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ట్యాంపరింగ్ అనేది జట్టు నిర్ణయమని కెప్టెన్ స్మిత్ అంగీకరించాడని, కాబట్టి ఐసీసీ ఇప్పుడీ వ్యవహారాన్ని ఎలా పరిష్కరిస్తుందో చూడాలని అన్నారు. క్రికెట్ గవర్నింగ్ బాడీ ఈ విషయంలో నిర్ణయాత్మకమైన చర్య తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు గిబ్సన్ పేర్కొన్నారు. రెండు జట్ల మధ్య మైదానంలో చాలాసార్లు ద్వేషపూరిత వాతావరణం కనిపించిందన్నారు. సిరీస్ ఆరంభం నుంచే రెండు జట్ల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయని పేర్కొన్న ఆయన రెండు బలమైన జట్లు తలపడుతున్నప్పుడు బలమైన అధికారులను కూడా నియమిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. తాజా ఘటనపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్టు ఓటిస్ పేర్కొన్నారు.

బీసీసీఐ డిజిటల్ హక్కుల వేలం



హైదరాబాద్: అతి పెద్ద నెట్‌వర్క్ కలిగిన ఫేస్‌బుక్, గూగుల్‌లకు కాంపిటేషన్‌గా కొత్తగా వచ్చి అంతా తానై విస్తరిస్తోన్న జియో నెట్‌వర్క్ పెద్ద ఎదురుదెబ్బ కానుంది. వచ్చే వారం నిర్వహించనున్న బీసీసీఐ డిజిటల్ మీడియా హక్కుల వేలంలో ఫేస్‌బుక్, గూగుల్‌లతో పాటుగా జియో సైతం పాల్గొననుంది. ఈ మేరకు భారత క్రికెట్ జట్టు ఆడే మ్యాచ్‌ల డిజిటల్ హక్కులకు భారీ పోటీ నెలకొంది. ఈమేరకు వచ్చే ఐదేళ్లపాటు బీసీసీఐతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రఖ్యాత సోషల్ నెట్‌వర్క్ సైట్ ఫేస్‌బుక్‌తో పాటు సెర్చింజన్ గూగుల్ కూడా పోటీలో ఉన్నాయి. వీటితోపాటు జియో ఇన్‌ఫోకామ్ లిమిటెడ్, హాట్‌స్టార్, యప్ టీవీ, సోనీ టీవీ కూడా బరిలో ఉన్నాయి. ఈనెల 27న జరగాల్సిన ఈ-వేలాన్ని ఇటీవలే బీసీసీఐ వచ్చేనెల 3కు వాయిదా వేసింది. ఏప్రిల్ 2018 నుంచి మార్చి 2023 వరకు బిడ్డింగ్ గెలిచిన కంపెనీ మూడు రకాల హక్కులు కలిగి ఉంటుంది. గ్లోబల్ టీవీ రైట్స్‌తో పాటు భారత ఉపఖండ డిజిటల్ హక్కుల ప్యాకేజి, గ్లోబల్ కన్సాలిడేటెడ్ హక్కుల ప్యాకేజి ఇందులో ఉంటాయి. డిజిటల్ హక్కులను సొంతం చేసుకునేందుకు ఐదు సంవత్సరాలు కలిపి వేలం ప్రారంభ ధర రూ. 7 నుంచి 8 కోట్లు మధ్య ఉంటుంది. ఇదే వేలంలో మ్యాచ్‌కు మొదటి సంవత్సరానికి రూ.35కోట్లు తర్వాతి నాలుగేళ్లకు రూ.33కోట్లు ఉండాలని నిర్ణయించింది. కేవలం ఐపీఎల్ ప్రసార హక్కులను అమ్మకాన్ని జరిపిన బీసీసీఐ రూ.16347.5కోట్లు ధరకు అమ్మేసింది. వేలంలో పాల్గొననున్న ఫేస్‌బుక్ ఖాతాల నుంచి వారం క్రితం డేటా చోరీకి గురవడంపై దాదాపు ఇప్పటికే రూ.3900కోట్ల మేర నష్టం వాటిల్లింది.

వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నేడు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం సోమవారం గుంటూరు జిల్లా ముప్పాళ్లలో జరగనుంది. జిల్లాలో పాదయాత్ర చేస్తున్న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి ఈ సమావేశానికి నేతృత్వం వహించనున్నారు. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై స్పీకర్ సుమిత్రామహాజన్ నిర్ణయం తీసుకోనున్నారు. తాజాగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసును అందచేసింది. దీనిపై కూడా స్పీకర్ నిర్ణయం తీసుకునే దశలో పార్లమెంటులో వ్యవహరించాల్సిన వ్యూహంపై జగన్ దిశానిర్దేశం చేయనున్నారు.

చిదంబరానికి 'టీ'షాక్



చెన్నై: కప్పు టీ ధర రూ.135. కాఫీ ధర రూ.180. ఈ ధర చూసి కేంద్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి పి.చిదంబరం కూడా బెంబే లెత్తిపోయారు. ఈ విషయాన్ని ఆయన ట్విటర్ ద్వారా వెల్లడించారు. ఆదివారం ఉదయం చిదంబరం చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఫ్లైట్‌కు ఇంకా సమయం ఉండడంతో వీఐపీ క్యాబిన్‌లో కూర్చున్నారు. ఈ నేపథ్యంలో తన గార్డుని టీ తీసుకురావాల్సిందిగా కోరారు. అతను టీ తెచ్చాక దాన్ని చూసి షాకవడం చిదంబరం వంతైంది. ఎందుకంటే అందులో పాలతో చేసిన టీ కాకుండా టీ బ్యాగ్ ముంచిన టీ ఉంది. ఈ విషయాన్ని చిదంబరం ట్విటర్ ద్వారా వెల్లడిస్తూ.. 'చెన్నై ఎయిర్ పోర్ట్‌లోని కాఫీ హోటల్‌లో టీ ఆర్డర్ చేశాను. చిన్న కప్పులో వేడి నీళ్లు పోసి ఓ టీ బ్యాగ్ వేసి ఇచ్చారు. దాని ధర రూ.135. ఆ తర్వాత కాఫీ ఎంత అని అడిగాను. రూ.180 అని చెప్పారు. ఇంత ధర ఉంటే ఎవరు కొంటారు అని అడిగాను. అతను చాలా మంది కొంటారని చెప్పడంతో షాకయ్యాను. వెంటనే వద్దని చెప్పి వచ్చేశాను. నేను చేసింది తప్పా? రైటా?' అని పేర్కొన్నారు.

సుప్రీం తీర్పుపై దళిత, ఆదివాసీల అసంతృప్తి

న్యూఢిల్లీ: ఎస్టీ, ఎస్టీలపై వేధింపులను నిరోధించే చట్టం అమలులోకి వచ్చి 23 ఏళ్లు గడిచిన తర్వాత అది దుర్వినియోగం కాకుండా అందులోని కొన్ని నిబంధనలు తొలగిస్తున్నామంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై దళిత, ఆదివాసీ సంఘాలు, సామాజికవేత్తల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దళిత, ఆదివాసీలపై వేధింపులను నిరోధించడం కోసం ఉద్దేశించిన ఈ చట్టం 1995 నుంచి అమలవుతోంది. ఈనెల 20న సుప్రీం ధర్మాసనం తన తీర్పు ద్వారా చట్టంలోని రెండు నిబంధనలను రద్దు చేసింది. ఈచట్టం కింద నిందితులను ముందస్తు బెయిల్‌కు అవకాశం లేకుండా అరెస్ట్ చేసే అవకాశముండగా, ఆ నిబంధనను సుప్రీంకోర్టు రద్దు చేసింది. అధికారులను ఈ చట్టం కింద అరెస్ట్ చేయాలంటే ఉన్నతాధికారి నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు తెలిపింది. అమాయకులైన పౌరులు, ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసేందుకు ఈ చట్టాన్ని కొందరు ఉపయోగించారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తప్పుడు అభియోగాల వల్ల కుల విద్వేషం మరింత పెరుగుతోందని, కులవాదాన్ని శాశ్వతం చేస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిర్యాదు అందిన వారంలోగా దర్యాప్తు జరిపి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రాథమిక దర్యాప్తులో తప్పుడు కేసుగా అనుమానం ఉంటే నిందితులకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఏ కులానికి చెందినా, ఏ మతానికి చెందినా పౌరులెవరూ వేధింపులకు గురి కాకుండా రాజ్యాంగం హామీ ఇస్తుం దంటూ ప్రాథమిక హక్కుల్లోని ఓ అంశాన్ని తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ప్రస్తుత గణాంకాల ప్రకారం 2016లో ఎస్సీలపై వేధింపులు, దాడుల సంఘటనలు 40,801 నమోదు కాగా, ఎస్టీలపై వేధింపులు, దాడుల సంఘటనలు 6,568 నమోదయ్యాయి. గతంలోని పెండింగ్ కేసులతో కలిపి ఎస్సీలపై దాడులకు సంబంధించి 2016లో 1,44,979 కేసుల్లో విచారణ జరగగా, 14,615 కేసుల్లో విచారణ పూర్తయింది. 3,753 కేసుల్లో దోషులకు శిక్షలు పడ్డాయి. 2016లో శిక్షలు పడిన కేసులు 25.7 శాతం. పెండింగ్‌తో కలిపి ఎస్టీలపై దాడులకు సంబంధించి 2,895 కేసుల్లో విచారణ పూర్తయింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.